ఆంధ్రసచిత్రవారపత్రిక



ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

25 నయాపైసలు
6-8-1958



బోసినవ్వు

ఫోటో : ఎస వి పుల్లయ్య—నల్లగొండ]



నిరీక్షణ

—చిత్రకారుడు [అల్లు సూర్యారావు]

పశ్చిమాసియా సుడిగుండం

లెబనాన్‌లో ప్రభుత్వ పక్షానికీ, ప్రతిపక్షానికీ మధ్య తీవ్రమైన పోరాటం, ఐక్య అరబ్ రిపబ్లిక్ తన దేశపు వ్యవహారాల్లో భారీఎత్తున జోక్యం చేసుకుంటోందని లెబనాన్ అధ్యక్షుడు చామౌన్ ఆరోపించటం, ఈ ఆరోపణను భద్రతామండలి చర్చించి అందులో నిజానిజాలను పరిశీలించడానికి ఈక్వెడార్, నార్వే భారతదేశాల ప్రతినిధులతో ఒక బృందాన్ని లెబనాన్‌కు పంపించటం, ఈ బృందమూ, సమితి కార్యదర్శి హామర్షెల్డూ జరిపిన పరిశీలనల ఫలితంగా లెబనాన్ ఆరోపణలో నిజం లేదని తేలటం, దరిమిలా ఇరాక్‌లో సైనికాధికారులు అకస్మిక విప్లవం జరిపి రాజరికాన్ని కూలద్రోసి రిపబ్లిక్ స్థాపించుకోవటం, ఇరాక్ విప్లవం ఇతర అరబ్ రాజ్యాలకు వ్యాపిస్తుందేమోనని భయంతో అమెరికా లెబనాన్‌కు, బ్రిటన్ జోర్డాన్‌కు సైన్యాలను పంపించటం, పశ్చిమ రాజ్యాలూ, వాటిని అనుసరించే రాజ్యాలూ తప్పిస్తే మిగతా ప్రపంచమంతా భారతదేశంతో సహా అమెరికన్, బ్రిటిష్ సైనిక జోక్యాన్ని నిరసించటం, అరబ్ రాజ్యాలపై దురాక్రమణ జరిగితే తాము సహించి ఊరుకునేది లేదని అటు ఐక్యఅరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు నాసర్, ఇటు సోవియట్ ప్రధాని కృశ్చేవ్ ప్రకటించటం-ఇవీ గడచిన రెండు నెలల్లోనూ జరిగిన ముఖ్యసంఘటనలు.

ఈ సంఘటనల సంఘట్టన వేగం ప్రపంచ ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నది. ప్రపంచం మరో ప్రచండయుద్ధానికి దగ్గరగా జరుగుతోందా అని ఆందోళన కలుగుతున్నది.

రెండు చేతులూ కలవనిదే చప్పట్లు కొట్టటానికి వీలులేనట్టే మధ్యప్రాచ్యంలో రష్యా సైనికంగా కలగజేసుకోనంతకాలమూ శాంతిభంగమయ్యే అవకాశం లేదనేమాట నిజమే. కాని కదిలే చెయ్యి తిన్న సమీపిస్తుంటే కదలని చెయ్యి ఎంతకాలం కదలకుండా ఉంటుందనేది సందేహాస్పదం. ఒకసారి సైన్యాలు తమ దేశపు సరిహద్దులను దాటి ఇతర దేశాల్లోకి యాత్ర సాగించిన తర్వాత అవి ఎక్కడ ఆగుతాయో చెప్పటం కష్టం.

ఈ కారణంచేతనే సోవియట్ ప్రధాని ప్రతిపాదించిన రాజ్యాధిపతుల సమావేశం జరగటం ప్రస్తుత పరిస్థితులలో అత్యంతావశ్యకంగా కనిపిస్తున్నది. లెబనాన్, జోర్డాన్ సమస్యల పరిష్కారానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా, భారతదేశం అధిపతులు, సమితి కార్యదర్శి వెంటనే సమావేశం కావాలని కృశ్చేవ్ ప్రతిపాదించారు. ఈ సమావేశం సమితి ఆధ్వర్యంలోనే జరగాలని అమెరికా సమాధానమిచ్చింది. దీనికి రష్యా అంగీకరిస్తూ, భద్రతామండలిలో జరిగే రాజ్యాధిపతుల సమావేశానికి భారత ప్రధానికూడా హాజరుకావటం అత్యవసరమనీ, అదీగాక చర్చనీయాంశంతో సన్నిహిత సంబంధంఉన్న అరబ్ రాజ్యాల అధిపతులుకూడా ఆ సమావేశానికి హాజరుకావాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ సమాధానమిస్తూ, రాజ్యాధిపతుల సమావేశం జరగటానికి ముందు మండలిలో సభ్యత్వంలేని ఏయే దేశాలను ఆహ్వానించవలసిందీ, ఏ తేదీన సమావేశం జరపవలసిందీ చర్చించి నిర్ణయాలు చేసేందుకు భద్రతామండలిలోని సభ్యదేశాల శాశ్వత ప్రతినిధులు సమావేశం కావాలని, అదే సరియైన విధానమనీ అన్నారు.

ఈ ఉత్తర ప్రత్యుత్తరాలతో ప్రమాదభరితంగా ఉన్న పరిస్థితి ప్రతిష్ఠంభనలో పడింది. రాజ్యాధిపతుల సమావేశం వెంటనే జరగాలని అమెరికా బ్రిటన్‌లను రష్యా ఎంత తొందరచేస్తోందో, అమెరికా బ్రిటన్‌లు అంత తాత్సారం చేస్తున్నాయి. దీనివలన అటు రష్యా సైనికంగా జోక్యం చేసుకోకుండా అరికట్టినట్టూ అవుతుంది; ఈ లోపల లెబనాన్, జోర్డాన్‌లలో పరిస్థితులను తమకనుకూలంగా కుదుటపరిచినట్టూ అవుతుంది. అయితే మధ్యప్రాచ్య సమస్యలు ఇంత సులభంగా పరిష్కారమయ్యే సమస్యలు కావు. శాశ్వత పరిష్కారమార్గాలు అనుసరిస్తేనేతప్ప, మధ్యప్రాచ్యం ఎప్పటికైనా ప్రమాదాభిముఖమే అవుతుంది. దీనికోసమైనా సాధ్యమైనంత త్వరలో ఆయా రాజ్యాధిపతుల సమావేశం జరగవలసిన అవసరం ఉన్నది.

ఈ సమావేశం భద్రతామండలిలోనే జరగాలని తాము చేసిన ప్రతిపాదనను రష్యా అంగీకరించదని పశ్చిమరాజ్యాలు భావించినట్లు కనిపిస్తుంది. కాని తాను అందుకూ సిద్ధమేనని రష్యా ప్రకటించటంతో పశ్చిమ రాజ్యాలు ఇరుకునపడ్డాయి. సమావేశం జరక్కుండా మరికొన్ని రోజులు వాయిదా వేయటానికి గాను, ఏయే రాజ్యాలను ఆహ్వానించాలనే విషయాన్ని కార్యక్రమ నిర్ణయాన్ని భద్రతామండలిలోని రాజ్యాలశాశ్వత ప్రతినిధులకే వదిలివేయాలని అమెరికా పట్టుబట్టింది. భద్రతామండలిలో అమెరికాదే పైచెయ్యిగనుక, మండలిలో సభ్యులు కాని ఏయేరాజ్యాల అధిపతులను ఆహ్వానించాలీ అనేవిషయమై అమెరికా, రష్యాలకు తిరిగి అభిప్రాయభేదాలు రావచ్చును. ఉదాహరణకు-భారతదేశ ప్రధానినీ, అరబ్ రాజ్యాధిపతులను పిలవాలని రష్యాసూచించింది. ఇది వల కాదని అమెరికా అనవచ్చును. లేక తనకు సుముఖులుగా ఉంటారని తెలిసిన ఇజ్రేల్, తదితర మధ్యప్రాచ్య రాజ్యాల అధిపతులనుకూడా పిలవాలని అనవచ్చును. ఇది రష్యాకు సమ్మతం కాకపోయినపక్షంలో అసలు తలపెట్టిన రాజ్యాధిపతుల సమావేశానికే భంగం వాటిల్లవచ్చును. ఒకవేళ రష్యా అందుకు సమ్మతించినా, మధ్యప్రాచ్య సమస్యలపై ఉభయపక్షాలకు అంగీకారం కుదురుతుందా అనేది అనుమానమే. పరస్పర నిందారోపణలకే ఆ సమావేశాన్ని వినియోగించేపక్షంలో తిరిగి ప్రతిష్ఠంభన ఏర్పడవచ్చును. ఆ పరిస్థితి ఎన్నటికీ వాంఛనీయంకాగు.

ప్రపంచసమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా యుద్ధప్రమాదాన్ని నివారించటానికీ, అగ్రరాజ్యాలమధ్య ఏకాభిప్రాయం కుదరటం అవసరమని భారత ప్రధాని చాలా సారు హెచ్చరించారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య పరిస్థితి యుద్ధానికి దారితీసేదిగా ఉన్నది. అరబ్ జాతీయోద్యమ విజృంభణను పశ్చిమరాజ్యాలు అపార్థం చేసుకోవటం, సామ్రాజ్యాల రోజులుగతించినా సామ్రాజ్యవాదాన్ని త్యజించలేకపోవటం, మధ్యప్రాచ్య రాజ్యాలను ఇంకా తమ పలుకుబడి క్రిందనేఉన్న వలసలుగా భావించటం, తమ ఆర్థకావసరాలకొద్దీ అరబ్బులలో అరబ్బులకు తగాదాలు పెట్టటం, సైనికకూటాలలోకి ఇరికించటంమూలంగానే మధ్యప్రాచ్యంలో శాంతికి ప్రమాదం ఏర్పడుతోంది. కాని పశ్చిమ రాజ్యాలు ఈబాధ్యతను అరబ్ జాతీయనాయకుడైన నాసర్ మీదికీ, రష్యామీదికీ త్రోసివేయ జూస్తున్నాయి. ప్రత్యేకం రష్యాకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన బాగ్దాద్ కూటమిని, ఐసెన్‌హోవర్ సిద్ధాంతాన్ని పశ్చిమ రాజ్యాలువిసర్జించనంతకాలమూ రష్యాకూడా తనసరిహద్దుల్లో ఉన్న మధ్యప్రాచ్య వ్యవహారాల్లో కిమన్నాసిగా ఊరుకొని ఉండదు. అంగుచేత పశ్చిమరాజ్యాలు, రష్యా మధ్యప్రాచ్యసమస్యలపై ఏకిభావానికి వచ్చి, అరబ్ జాతీయోద్యమాన్ని సహజమైన పరిణామంగా పరిగణించి జోక్యం చేసుకోకుండా ఊరుకోవటం ఒక్కటే పరిష్కారానికి మార్గంగా కనిపిస్తోంది. ★

★ ఆంధ్ర మహిళా సభ ముందడుగు ★



శ్రీమతి లక్ష్మీపార్వతి

చెన్నపట్నంలో ఉన్న ఆంధ్రమహిళల సేవాసంస్థ 'ఆంధ్రమహిళా సభ' శిశు, మహిళాజన ప్రగతికై సాగిస్తూన్న బహుముఖ కార్యక్రమాలు యావద్భారతానికీ ఆదర్శప్రాయమైనవని ప్రశంసలందుకొన్నాయి.

మద్రాసు అడయారులోని 'ఆంధ్ర మహిళ' నర్సింగ్ హోమ్‌లో అంగవైకల్య చికిత్సకై ప్రత్యేకం ఒక భవనం నిర్మించడానికి గవర్నరు శ్రీ విష్ణురాం మేధీ గతవారం శంకుస్థాపన చేయడంతో ఈ సభ సాగిస్తున్న ఉద్యమం మరో అడుగు ముందుకు వేసింది. ఆరోజు (జూలై 26) సభకు అధ్యక్షత వహించిన డా॥ లక్ష్మణస్వామి ముదలియార్ మాటలలో, "ఇది చాలా అవసరమైన ముందడుగు. మనం చాలకాలంగా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తూవచ్చిన ముందడుగు."

ఈ కొత్త విభాగాన్ని వైద్యపరిభాషలో 'ఆర్థోపిడిక్ వార్డ్' అంటారు. అంటే ప్రధానంగా పిలలలో అంగవైకల్యం నివారణకూ, చికిత్సకూ పనిచేసేది.

"పిల్లలంటే మనకి ఎంత అపేక్ష ఉన్నా, వాళ్ళ ఆరోగ్యం, భవిష్యత్తు బాగుండడానికి చేయవలసిన ఇలాంటి ముఖ్యమైన కార్యాలలో పాశ్చాత్యులకన్న మనం తీసినట్టు అని ఒప్పుకోవాలి." అని డా॥ ముదలియార్ సముచితమైన విమర్శచేశారు.

అయితే ఇలా సేవాసంస్థలు ఒక అడుగు ముందుకువెయ్యటం చాలా ఖరీదైనపని... ఈసారి ముందడుగుకు భూరివిరాళం ఇచ్చిన దంపతులు శ్రీ వెలిగండ్ల హనుమంతరావు నాయుడు, ఆయనసతి శ్రీమతి లక్ష్మీపార్వతి. ఈ భవనం నిర్మించడానికి వారు లక్షరూపాయలు విరాళం ఇచ్చారు. నెల్లాళ్ళ క్రితం

> అడయారులోని ఆంధ్ర మహిళా సభ నర్సింగ్ హోమ్: ప్రసూతి శిశుసంక్షేమశాఖలు కాక, వ్యాధులకుకూడా ఇక్కడ చికిత్స చేసారు. 50 మంది రోగులను ఉంచడానికి వసతులు ఉన్నాయి. ఇళ్ళలో నే ఉంటూ, ఇక్కడ ఉచిత వైద్యానికి వచ్చి వెళ్ళేవారు నెలకు నాలుగువేలమంది ఉంటారు. ఈ ఆస్పత్రికి ఆపరేషన్ థియేటర్, శస్త్రచికిత్సశాఖ నిర్మించడానికి మద్రాసు ప్రభుత్వం లక్షరూ॥లు విరాళం ఇచ్చింది. సభ ఆధ్వర్యాన ఇక్కడ మంత్రసాని, నర్సుకోర్సులలో శిక్షణకూడా ఇస్తున్నారు.

హఠాత్తుగా మృతిచెందిన వారి కుమారుడు ఈశ్వరీప్రసాద్ దత్తాత్రేయ పేరిట, ఈ విరాళంతో ఈ సత్కార్యం జరిపిస్తున్నారు.

"మా అబ్బాయిపోయిన 24 గంటలలో ఈ సంకల్పం కలిగింది. దేశముఖ్ దంపతులతో సంప్రతించి నిశ్చయించాము" అన్నారు హనుమంతరావుగారు...



ఈశ్వరీప్రసాద్ దత్తాత్రేయ



శ్రీ వి. హనుమంతరావు, ఐ.ఎ.ఎస్.

శిశువుల శ్రేయస్సుకు తీసుకోతగ్గ జాగ్రత్తను గ్రహించి, అందుకు ఇంత గొప్ప దోహదంచేసిన హనుమంతరావు దంపతులు అభినందనీయులు.

రావుగారు మద్రాసు రాష్ట్ర విభజనకు పూర్వం రాష్ట్రప్రభుత్వ ఉపకార్యదర్శిగా పనిచేశారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడగానే కొంతకాలం ఆంధ్రలో ఆ పదవిని నిర్వహించి, తరువాత తిరిగి మద్రాసు వచ్చారు. శ్రీమతి లక్ష్మీపార్వతి చిరకాలంగా సేవాకార్యక్రమాలలో ప్రముఖపాత్ర నిర్వహిస్తున్నారు. కొంతకాలం రెడ్ క్రాస్ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇప్పుడు ఆంధ్రమహిళా సభకు సంయుక్త కార్యదర్శిని.

పదిహేను ఇరవైయేళ్ళనాడు, నగరంలో మహిళలు నలుగురూ కలుసుకోవడం, హిందీ నేర్చుకోవడం, కార్యక్రమాలుగా ఉన్న ఆంధ్రమహిళాసభ ఈనాటికి, వ్యవస్థాపకురాలు శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కృషికి, లక్ష్యానికీ సార్థకమైన అనువాదమై, గర్వకారణమైన సంస్థగా వర్ధిల్లడం గొప్ప విషయం. ★



★ రాజధానికి వరద బెడద ★

రాజధానిలో చిన్నసైజు జలప్రళయం వచ్చిపడింది. శనివారం సాయంత్రం చినికి చినికి ఆదివారం రాత్రికి గాలివాన అయింది. న్యూఢిల్లీలో ఎప్పుడూ కనీ వినీ ఎరగని వరదనీరు షాపుల్లోకీ, పశువులశాలల్లోకీ, గోడాముల్లోకీ, ఆఖరికి నివాసగృహాల్లోకికూడా ఉప్పెనగా తోసుకువచ్చింది. జనం చాలా అవస్థపడ్డారు. ఆస్తినష్టం బాగా జరిగింది. శ్రేయోరాజ్య సిద్ధాంతంకూడా బాగా దెబ్బతిన్నది. ప్రైవేటుఆస్తి చాలవరకుసురక్షితంగానే ఉంది. కొంత నష్టమైనా కట్టుదిట్టాలు జరగటంచేత భారీఎత్తున నష్టం జరగలేదు. కాని ప్రభుత్వ ఆస్తులు మాత్రం బాగా నష్టమైనాయి. 24 గంటలూ డ్యూటీలో ఉండే అగ్నిమాపకదళంవారు శుభ్రమైన ఆరు ఫైరింజన్లు నీళ్లలో మునిగిపోతుంటే చూస్తూ ఊరుకున్నారు. వాటిని కాపాడటానికి చిటికెనవేలైనా వారు కదల్పలేదు.

కనాట్ ప్లేస్ టెలిఫోను ఎక్స్ఛేంజి వరదల మూలంగా పాడైపోయింది. మొత్తం కార్యాలయమంతా వరద మయమైపోయింది. టెలిఫోను, టెలిగ్రాఫుస్టోర్సు కూడా దెబ్బతిన్నాయనీ, 50 లక్షల రూ. దాకా నష్టం సంభవించిందనీ తెలుస్తోంది. వారినీ వీరినీ కనుక్కోగా, జాగ్రత్తపడితే టెలిఫోను ఎక్స్ఛేంజిని తేలికగా కాపాడగలిగి ఉండేవారని తెలిసింది.

శ్రేయోరాజ్య సిద్ధాంతం తెచ్చిపెట్టిన అనర్థం ఇది. క్రమశిక్షణ భంగమైపోయింది. కష్టపడి పనిచేసే ఉత్సాహం దెబ్బతింది. జాతీయమైన ఆస్తులంటే ప్రభుత్వోద్యోగులకు నిర్లక్ష్యం ప్రబలింది. తంతి, తపాలా ఉద్యోగులతో సానునయంగా ప్రవర్తించటంవలన కలిగిన దుష్ఫలితం ఇది.

వరదలు తగ్గిన తరవాత సింహావలోకనం చేస్తే, న్యూఢిల్లీకంటే, 3 శతాబ్దాలక్రితం షాజహాన్ కట్టిన పాతఢిల్లీయే పకడ్బందీగా ఉన్నదనిస్పష్టమైంది. పాతఢిల్లీలో పురాతనపు ఇళ్ళు కొన్ని పడిపోయినమాట వాస్తవమే. కాని అక్కడక్కడ తప్పితే వరదనీరు పాతఢిల్లీలో ఇళ్ళలోకీ, షాపుల్లోకీచొరబడలేదు. మూడువందలేళ్ళనాటి పాతఢిల్లీలో రోడ్లు

శ్రీకృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

సరియైనపద్ధతిలో ఏర్పాటై ఉండటంచేత వరదలువచ్చినా ఖరవాలికి పోయింది. న్యూఢిల్లీ నిర్మించిన బ్రిటిష్ ఇంజనీర్లు తుపానునీళ్ళు పోవటానికి పారుదల ఏర్పాటు బాగానే చేశారు. అయితే 1947 ఆగస్టు 15 న నిపుణుల బృందం ఒకటి బయలుదేరింది ఆనాటి నుంచీ, న్యూఢిల్లీ రోడ్లు ఎంత చక్కగా అభివృద్ధి అయినాయంటే, చాలాచోట్ల మధ్యలో చిన్నచిన్న నీటిదొరువులు ఏర్పడ్డాయి. రాకపోకల సౌలభ్యంకోసమని ఉద్దేశించిన ట్రాఫిక్ ద్వీపాలు నీటి పారుదలను సాధ్యమైనంత అడ్డగించి సిసలైన ద్వీపాలుగా తయారవుతున్నాయి ఉద్యోగుల సంఖ్యఎక్కువైనా వారు చేసేపనిమాత్రం తక్కువేనని దీనివల్ల స్పష్టమవుతోంది.

ప్లానింగ్, డిజైనింగ్‌లను గూర్చి ఒక్కమాట. స్వాతంత్ర్య సిద్ధితరవాత పి. డబ్ల్యు. డి. నిర్మించిన వాటిలో సగర్వంగా చెప్పుకో దగినవి ఆరంతస్తుల సచివాలయ భవనాలు. ఆహార వ్యవసాయశాఖా కార్యాలయాలున్న భాగంలో అడుగున కార్లు ఆపుకోటానికీ, గోడాములకూ వీలుగా ఏర్పాట్లుచేశారు. అయితే ఈ అడుగుభాగం రోడ్డు మట్టంకంటె దిగువన ఉన్నది. అక్కడ నీరుపారే సదుపాయ మేమీలేదు. అందుచేత వాననీళ్ళు శుభ్రంగా లోపలికివచ్చి గోడాముల్లో ఉంచిన సరుకులన్నీ పాడైపోయాయి.

కేంద్ర రివిన్యూబోర్డు భవనం కూడా ఆరంతస్తులదే. ఇదికూడా పల్లంలోనే ఉన్నది. రెండేళ్ళక్రితం వరదలు వచ్చినప్పుడు ఈ భవనానికి వెళ్ళేత్రోవలన్నీ జలమయమైనాయి. అప్పుడు భవనంలోకి నీళ్ళురాకుండా కట్టలు పోయించటానికి ఏమీప్రయత్నాలు చెయ్యలేదు. ఈ ఏడాది మళ్లీ వరదలు భవనం అడుగుభాగంలోకి ప్రవేశించి దెబ్బతీశాయి.

మధుర రోడ్డుపై ఓవర్ బ్రిడ్జ్ కట్టటానికి దాదాపు రెండేళ్ళు పట్టింది. ఢిల్లీకి వరదలు రావటానికి ముందే, కురిసిన తొలకరి వానలకే ఈ వంతెనలో ఒకభాగం కొట్టుకుపోయింది. రైల్వే ఇంజనీర్ల సామర్థ్యానికి ఇది నిదర్శనం.

నేనిదివరకే వ్రాసినట్లు, న్యూఢిల్లీ మునిసిపల్ సంఘ పరిపాలన విధానం భ్రష్టం కావటానికి అవకతవక ప్రజాస్వామ్యమే కారణం. పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రులు దైనందిన పరిపాలన విషయా[illegible] అనవసరంగా జోక్యం చేసుకోవటమే [illegible] కారణం. అదీ గాక, భారత రాజధాని పురపాలక సంఘం కార్యదర్శికి ఆ పదవికి ఉండాల్సినంత అనుభవమూ లేదు, దక్షతా లేదు. పురపాలక సంఘంలో అధికారుల ప్రాబల్యం ఎక్కువే. కాని నిజంగా దాన్ని చేతులో పెట్టుకుని ఆడించేది కొద్దిమంది అనధికారులు.

మునిసిపల్ పాకీ పనివారికి వారానికొకరోజు సెలవివ్వాలని ఏ మహానుభావుడికి తట్టిందో మరి. స్వాతంత్ర్యసిద్ధి తరవాత నించీ వారికి కొకరోజు సెలవు ఇవ్వటం మొదలుపెట్టారు. ఈ పనివారు ఇతరులు పని

"మనిషిలో మనిషి"

80-వ పేజీ ("మనిషిలో మనిషి" శీర్షిక) మూడవ కాలమ్‌లో ఆఖరు రెండు పంక్తులు రెండవ కాలమ్ చివరచేర్చి చదువుకోవలసిందిగా మనవి.

చేస్తుంటే చూస్తూ అలిసిపోయే బాపతు పనివారు. సెలవు ఫలితంగా వీరు సోమవారం ఉదయం రెండురోజుల పని చెయ్యవలసి వస్తోంది. ఇందువల్ల కొన్ని కొన్ని ప్రాంతాలు పరమ ఛండాలంగా ఉండిపోతున్నాయి. అసలే పాకీ పనివారు సోమరులు. ఒకరోజు సెలవుతోను, శ్రేయోరాజ్య సిద్ధాంతం మూలంగానూ వారికి మరింత బద్ధకం బలిసిపోయింది. కొత్తగా వచ్చిన ఆరోగ్య శాఖాధికారి ఈ పనివారిలో కొంత క్రమశిక్షణ కలిగించాలని ఇటీవల ప్రయత్నం చేశారు. దానిమీద, ఒక పార్లమెంటు సభ్యుడు పాకీ పనివారిని బాధపెడుతున్నారని ప్రధానమంత్రికి ఫిర్యాదు చేశారు. తత్ఫలితంగా వారినేమీ అనవద్దని ప్రధానమంత్రి పురపాలక సంఘాన్ని ఆదేశించారని తెలుస్తోంది.

స్వాతంత్ర్యానికి ముందురోజుల్లో వాన కురిసి వెలవటంతోనే, నీళ్ళు, చెత్త చెదారం తొలగించటానికి పాకీ పనివారు బృందం చీపురుకట్టలూ అవీ పట్టుకుని బిలబిలమంటూ రోడ్లమీదికి తయారయ్యేవారు. ఆ తరువాత వీరి సంఖ్య పెరగటమయితే పెరిగిందిగాని, పనిమీద శ్రద్ధమాత్రం బాగా తగిపోయింది. వానవెలిసిన తరవాతరోడ్లు బాగుచెయ్యటానికి ఎవరూ రారు. ఇంటిదగ్గర కూర్చుని శ్రేయోరాజ్యంపై భజనగీతాలు పాడుతూ ఉంటారు. అందుచేత రోడ్లమీద నిలవ ఉన్న నీరు అలా గేమురిగిపోతూనే ఉంటుంది.

స్వాతంత్ర్యానికి ముందు రోజుల్లో న్యూఢిల్లీలో మురికి కాలవలను చెత్తా చెదారం తీసేసి శుభ్రంచేసేవారు. ఇప్పుడు ఈ పని వానలకే వదిలేస్తున్నారు. అందుచేతనే వరదలు వచ్చాయి. పూర్వం రోజుల్లో మురికి కాలవల మూతలను వాన కురుస్తుండగా తెరిచి ఉంచి, వాననీరు పోయిన తరువాత మూసివేయటానికి మనుషులు సిద్ధంగా ఉండేవారు. ఇప్పుడా పని పౌరులు చేస్తే చేసినట్టు, లేకపోతే లేనట్టు.

న్యూఢిల్లీ నిర్మాతలు వాననీరు పోవటానికి చాలా తూములుకట్టించారు. వీటిలోకల్లా ముఖ్యమైనది న్యూఢిల్లీకి దక్షిణం వేపుగా ఉంది. దీనిమీద గడచిన రెండేళ్ళుగా రైల్వేశాఖ ఓవర్ బ్రిడ్జి కటిస్తోంది. కాలవ ఈ తూముకు సంబంధించిన ముఖ్యమైన నిండా నిర్మాణసామగ్రి ఉండటంచేత వాన నీరు యమునానదిలోకి ప్రవహించకుండా అవరోధం కలిగింది. ఇళ్ళలోకి వాననీరు రావటానికి ఇది ముఖ్యకారణం.

మురికినీటి పారుదల సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించటానికి శ్రీ కె. సి. రెడ్డి అధ్యక్షతను ఒక సంఘాన్ని ప్రధానమంత్రి నియమించారు.

ఈ సంఘం ఇప్పుడున్న వంతెనలను, వరద కట్టలను తనిఖీ చేసి, అత్యవసర పరిస్థితులలో ఉపయోగించేందుకు ఏమేమి సాధన సామగ్రి కావాలో సలహా ఇస్తుంది. భారత ప్రభుత్వమే ధనం ఇస్తుంది కనుక, ఈ సంఘం తన నిర్ణయాలను తానే అమలు జరపగలదు.

ఇంతవరకూ బాగానే ఉంది. కాని ఇది మాత్రమే సరిపోదు. వాననీటికి మొదట్లో ఏర్పాటుచేసిన తూములను మార్చటం జరిగిందా, మారిస్తే ఎందుకు మార్చారూ అని కూడా విచారణ చేయాలి. ఫైరింజన్లు పాడైపోతుంటే చూస్తూ ఊరుకున్న అగ్నిమాపకదళాన్ని, టెలిఫోను ఎక్స్చేంజిని నిర్లక్ష్యం చేసిన టెలిఫోను సిబ్బందిని కూడా విచారణ చెయ్యాలి. కేంద్ర రివిన్యూ బోర్డు భవనం, ఆహారశాఖ కార్యాలయమూ వరదల పాలవుతుంటే దర్యాప్తు ఎందుకు తీసుకోలేదో విచారణ చెయ్యాలి. వాననీరు పోవటానికి ఏర్పాటుచేసిన కాలవను ఎందుకు అడ్డగించారూ ఎవరు అడ్డగించారూ తేల్చవని, శ్రేయోరాజ్యానికి భంగం కలగని పక్షంలో వారిని శిక్షించాలి.

* * *

నౌకా వ్యాపారశాఖమంత్రి శ్రీ రాజ్ బహదూర్ మీద రాజస్థాన్ కాంగ్రెసు సంఘ అధ్యక్షుడు కొన్ని ఆరోపణలు చేశారు. హైకోర్టును జోధ్పూరుకు మారుస్తున్నందుకు వ్యతిరేకంగా బయలుదేరిన జైపూర్ ఆందోళనోద్యమాన్ని ఆయన సమర్థిస్తున్నారని ఒక ఆరోపణ. ఉద్యమ నాయకులకు శ్రీ రాజ్ బహదూర్ ఢిల్లీ నుంచి టెలిఫోనుచేసి మాట్లాడి వత్తాసు ఇస్తున్నారట.

ఈ ఆరోపణ నిజమే అయితే, రాజ్ బహదూర్ టెలిఫోను బిలులను ఎవరు చెల్లిస్తున్నారూ అని ప్రశ్న ఉదయిస్తుంది. ఆయనే చెల్లిస్తుంటే ఏ బెంగాలేదు. కాని ఒకవేళ వాటిఖర్చును ప్రభుత్వానికి అంటగడుతున్నారేమో లేదో తేల్చుకోవలసిన అవసరం ప్రజలకున్నది.

ఆలిండియా రేడియోలో ఒకప్పుడు డైరక్టరుగా పనిచేసిన శ్రీ లక్ష్మణన్ పై ఒక ఆరోపణ ఏమిటంటే, ఆయన తన సొంత టెలిఫోను పిలుపులఖర్చును ప్రభుత్వానికి అంటగట్టారని. దీని ఫలితంగా ఆయన ఉద్యోగం పోయింది. మరి మంత్రులకు కూడా ఇవే నిబంధనలు, నియమాలు వర్తించాలిగదా. ★

అమరా నిర్జరా దేవా...

"అదే వద్దన్నాను నిన్ను."

కాలేజీ అమ్మాయిలాగా—హెడ్ గుమాస్తా గారి భార్యలాగా వీధిగడపమీద బైఠాయించడం మా ఇంటా వంటా లేనిది నీకెలా అలవాటయిందే అన్నారు వెంకటేశ్వర్లు గారు—వింటున్నావా? అయ్యో మా అమ్మ కడుపు బంగారంగానూ పెట్టెలోంచి బనీనూ లాల్చీ తీసియివ్వడంలో కూడా ఏకాగ్ర దృష్టి కావాలి కాబోలు నేం! అయినా చేతో చేసేపనికి చెవులవసరం ఏమిటే...

ఏపని చేస్తున్నా దానిమీద ధ్యానం ఉండడం అవసరం కనక ఇంక మొగుడు మాట్లాడుతున్నా సరే ఆ పనిలో నే సర్వేంద్రియాలనూ కేంద్రీకరించి ఉంచాలన్న మాట. నాకేం నచ్చలేదమ్మాయ్ నీ వ్యవహారం! అది సరే కానీ, నువ్వు మా యింటిదగ్గరుంటే వసపోసిన పిట్టలా వాగుతావు కదా, ఇక్కడికి వొచ్చేసరికి వర్షాకాలం కోకిలలా అయిపోతావేమిటే? ఇది నేను చేసుకొన్న సుకృతమా! దుష్కృతమా అని ఆలోచిస్తున్నాను. నీతంతు చూస్తే అంతుదొరకని బ్రహ్మపదార్థంలా ఉన్నదిసుమా! అదిబాగానే వుంది కానీ, ఈరోజు ఉదయం కాఫీ అమృతంలా ఉందంటే అంత కోపంవచ్చింది దేనికే మా అమ్మకోడలా!


ఈ బనీను దొరికిందన్నమాట, ఇంత పల్చటి లాల్చీకింద తొడగటానికి? ఏదన్నా అంటే నేమో ముక్కు మొహం ఏకం చేసుకొనేటంత అభిమానం వుంది అమ్మాయి గారికి! అమ్మాయిగారి అభిమానాన్ని చూసి గడుపుకుపోదామంటే, ఒక్కటి తెలీదాయిరి! త్రిశంకు స్వర్గాలు ప్రత్యక్షంగా కనిపించే రోజుల్లో, రామాయణ భారతాలు యధార్థాలేనేమో అని ఇంగ్లీషు చదువుకున్న తెలుగు నాగరికులు భావించే కాలంలో కూడా ప్రపంచంతో ఏవిధమైన సంబంధమూ లేని పల్లెటూరు నుంచి వచ్చిన పడుచుపిల్లవు గదా, ఊరుకున్నకొద్దీ ఏదో మంచిది మంచిదంటే మరదలు మరిదిగారి చెవులటుకు ఆడించబోయి, మడమతొక్కి పడగొట్టినట్టుంది నీ వ్యవహారం.

అందుకే నీకు శోభనంనాడు రాత్రి చెపుదామనుకున్నాను జరత్కారుడి కథ. పెళ్ళి వద్దు పేరంటం వద్దు మొర్రో అని కూర్చున్న ఆ మహాత్ముడికి పెళ్ళి చేశారు. ఎండను బడి తిరిగి తిరిగివచ్చి ఒక్క క్షణం ఆ అమ్మాయి తొడమీద తలవుంచి నిద్ర పోతూంటే, సాయంకాలమైపోయిందట నిస్నాన సంధ్యావందనాలు దాటిపోతాయ— లేపేసి ఊరుకుంది. ఏంచేశాడాయన? తెలుసా...రెండాటలూ చూసివచ్చి పడుకుంటే 'ఎనిమిదయిపోతోంది. పరీక్షలు కూడాను. ఈ వేళ మీకు ఎనిమిదింటికే కాలేజీ డ్యూటీ అని నువ్వు లేపేస్తే' అమర సుఖాన్ని అనుభవించే నిద్రలోంచి లేచి, కాలేజీకి పోయిన నాలాంటి నీ మొగుడు కాదు జరత్కారుడు. ఏమన్నాడు - నేను

ఉపశ్రీ

సంధ్య వార్చకుండా అస్తమించడానికి సూర్యుడికి ఎన్ని గుండెలుండాలి? పిచ్చిపిల్లా - నీ మొగుడి సత్తా తెలీక లేపినందుకు ఫలంగా, నీ దారిని నువ్వు పో. అయితే ఒక్క విషయం - ఆడదాని జన్మకు మాతృత్వం కంటె పరమార్థం లేదు. అంతకంటే ఆ హృదయానికి ఆనందగర్వ కారణము లేదు. ప్రస్తుతం నీకు నెలలు నిండుతున్నాయి ఉభయ వంశోద్ధారకుడైన కొడుకు పుడతాడని అంత కోపంతోనూ ఆశీర్వదించాడు అంతటి ఋషి. ఈ కీలకం ఎక్కడుందో కాని ఒసే - భార్యాబంధం ఉన్నదే...హమ్మ బాబోయ్ "బ్రహ్మముడే" అది.

అది సరే కాని వెనకటి నెలా ఈ నెలాకూడా రావు హోటల్ నుంచి మూడేసి రోజులూ కాలేజీ రాలేనట్టుంది. నువ్వేమన్నా కొంప తీసి జరత్కారుడి పెళ్ళాం స్థితిలో ఉన్నావేమిటే...ఒసీ...—" ★



వరుడు : విజయవాడ కాపురస్తులు శ్రీ హనుమంతు వెంకటసుబ్బయ్య చౌదరిగారి కుమారుడు
చి॥ రామకృష్ణప్రసాద్.

వధువు : ఎనమలకుదురు కాపురస్తులు శ్రీ ముప్పవరపు సీతారామయ్యగారి సోదరుడు శ్రీ వెంకటనారాయణగారి కుమార్తె
చి॥ సౌ॥ స్వర్ణకుమారి.

వీరి వివాహం ఇటీవల విజయవాడలో కమ్మ హాస్టలునందు జరిగినది.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘం

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 1958 జులై 1-వ తేదీ నుంచి 'బాలలసంఘం' స్థాపించాము. జులై 1-వ తేదీ నాటికి 15 సంవత్సరాల వయస్సు నిండని, ఐదేళ్ళ వయస్సుకు తక్కువ గాని ప్రతి తెలుగుబాలుడూ, బాలికా సభ్యత్వం పొందవచ్చు. సభ్యత్వానికి రుసుము ఏమీ చెల్లించవలసిన పనిలేదు. తెలుగు బాలబాలికలందరూ వెంటనే సభ్యులుగా చేరి సచిత్ర వారపత్రిక అప్పుడప్పుడు నిర్వహించే చిన్న చిన్న పోటీలలో పాల్గొని "సంఘం" ఆశయాలను జయప్రదం చేయడానికి సహాయపడతారని ఆశిస్తున్నాము.

గమనిక

పదకొండు మొదలు 15 సంవత్సరాలవరకూ వయస్సుగలవారిని 'A' వర్గంగానూ, ఆరు మొదలు 10 సంవత్సరాల వయస్సువరకూ గల వారిని 'B' వర్గంగానూ విభజించడం జరుగుతుంది

ముఖ్య విషయాలు

సభ్యులుగా చేరదలచిన బాలబాలికలు చేయవలసిందొకటే. దీనితోపాటు ఒక సభ్యత్వపు దరఖాస్తును ముద్రిస్తున్నాము. అందులోని ఖాళీస్థలాలను మీ వివరాలతో జాగ్రత్తగా నింపి (కొట్టివేతలు, దిద్దుపులు వుండకూడదు.) ఆ అచ్చు దరఖాస్తును చిన్నగా కత్తిరించి కవరులో:

సంపాదకుడు,

ఆంధ్ర పత్రిక సచిత్ర వారపత్రిక,
తంబుచెట్టివీధి, మద్రాసు-1.

అనే చిరునామాకు పంపాలి. కవరుమీద వెనుకవైపు "సచిత్ర వారపత్రిక బాలల సంఘం" అని స్పష్టంగా వ్రాయాలి. మామూలు కాగితాలమీద వ్రాసిపంపే దరఖాస్తులను స్వీకరించము.

ఒక్కొక్క దరఖాస్తుమీదా ఒక్కొక సభ్యుని, లేదా, సభ్యురాలి పేరుమాత్రమే వుండాలి. సభ్యత్వపు దరఖాస్తును సచిత్ర వారపత్రికలో సాధ్యమైనంతవరకు వారం వారం ప్రచురిస్తుంటాము.

సభ్యులుగా చేర్చుకున్నట్లు ఒక్కొకరి పేరా విడివిడిగా ఒక్కొక సభ్యత్వపు కార్డును పంపుతాము. ఆ కార్డుమీద సభ్యత్వ క్రమాన్ని సూచించే ఒక సంఖ్య వుంటుంది. ముందు ముందు సభ్యులుగాని, సంఘంగాని జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలలో ఆ సంఖ్యను ఉదహరిస్తూండడం జరుగుతుంది.

పదిహేనేళ్ళ వయస్సుపది పూర్తికాగానే, ఆ తేదీతో బాలల సంఘంలో సభ్యత్వం దానంతటదే రద్దయిపోతుంది.

లక్ష్యాలు

(1) సభ్యులుగా చేరే బాలబాలికలను ఆరుమొదలు పదేళ్ళవరకూ ఒక వర్గంగానూ (B), పదకొండు మొదలు పదిహేనేళ్ళ వరకూ మరొక వర్గంగానూ (A) విభజించి ఆయా వర్గాలకూ విడివిడిగా అప్పుడప్పుడు రెండుంకాల పోటీలు నిర్వహించి ప్రథమశ్రేణిలో నెగ్గేవారికి మాకులనైన బహుమతుల నివ్వడం. (ఈ విషయంలో పోటీనిర్వహణకర్తలదే తుదినిర్ణయం)

(2) సభ్యులలో వారివయస్సుకు తగినట్లుగా రచనాశక్తి, పఠనాసక్తి, కళాభిరుచులన్నీ యథాశక్తి పెంపొందచేయడం.

(3) చిత్రలేఖనం, నృత్యం, అభినయం, గాత్రం వీణ, వయొలిన్ మొదలయిన లలిత కళలలోనూ, వ్యాయామక్రీడలలోనూ ప్రత్యేక అభిరుచి, ప్రవేశం కనబరిచే బాలబాలికలను బహుమతులద్వారానూ తదితరవిధంగానూ ప్రోత్సహించడం.

(4) ఏ ప్రాంతంలో నివసిస్తున్నవారైనప్పటికీ తెలుగు బాలబాలికలందరిమధ్యా స్నేహసమైక్యభావాలను పెంపొందజేయడం.

(5) ఉన్నత పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఉచిత విద్యార్థివేతనాలను బహూకరించడం. (దీనికి సంబంధించిన వివరాలను ముందుముందు ప్రకటిస్తాము) ★

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
బాలల సంఘం
[సభ్యత్వపు దరఖాస్తు]

GROUP
A లేక B

సభ్యుని (సభ్యురాలి) పూర్తిపేరు (విడివిడి అక్షరాలలో) ....

పుట్టినతేదీ, నెల, సంవత్సరం : జులై 1 నాటికి వయస్సు — ఏండ్లు : నెలలు : ....

తండ్రి, లేక, సంరక్షకుని పూర్తి పేరు : ....

ఊరిపేరు, జిల్లా, తాలూకా, పోస్టు [వీథి: నెంబరు] ....

* చదువుతున్న తరగతి, లేక, ఫారము : ....

పాఠశాల పేరు : ....

ప్రధానోపాధ్యాయునిపేరు (తెలిస్తే) :

ఆర్యా :

ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘములో నన్ను సభ్యునిగా/సభ్యురాలుగా చేర్చుకొనప్రార్థన. పైన వ్రాసిన విషయాలన్నీ యదార్థములు.

ఇట్లు

[తేదీ : -1958]

(సంతకము)

* గురా : ఏ పాఠశాలలోనూగాక ఇంటివద్దనే ట్యూషన్ చెప్పించుకొనే బాలబాలికలు కూడా సభ్యులుగా చేరవచ్చు 'చదువుతున్న తరగతి' అనే విషయానికి ఎదురుగా 'ప్రైవేట్ స్టడీ' అని వ్రాయాలి.

సంచిక: **6-8-58**] ఈ దరఖాస్తు **9-8-58** నాటికి మాకు చేరాలి]

★ కొందరు సభ్యుల పేర్లు ★

[ఆంధ్ర సచిత్ర వార పత్రిక బాలలసంఘంలో సభ్యులుగాచేరిన మరి కొందరిపేర్లను ఇక్కడ ప్రచురిస్తున్నాము ఇక రెండు వారాలలో సభ్యత్వపు కార్డులు అందజేస్తాము]

1. సింగరాజు విజయవాణి (పెడన, కృష్ణాజిల్లా) 2. రామోజు సుశీల (రాజమండ్రి) 3. కే. రాజరాజేశ్వరి (విజయవాడ) 4 వెజ్జు నరసింహారావు(విజయవాడ)మలిరెడ్డి కుమారిజెన్నీ (జనార్దనపురం, కృష్ణాజిల్లా) 5 కే రాజారావు (విజయవాడ) 6 కే. వి. భాస్కరబాబు (బళ్లారి) 7. పి వి ఎల్. నరసింహారావు (జగ్గయ్యపేట) 8. కోలవెన్ను వెంకటకృష్ణయ్య (విజయవాడ) 9 సి జగదీశ్వరరెడ్డి (కర్నూలు) 10. కే నాగేశ్వరరావు(జగ్గయ్యపేట) 11. భూపతి రామకృష్ణ (తెనాలి) 12. బి. నాగరత్నం (ద్రోణాచలము, కర్నూలుజిల్లా) 13 మామిడిపూడి శాంత (సికింద్రాబాదు) 14 అమాం వెంకట కామేశ్వరరావు(విజయవాడ) 15. పొన్నూరు సాంబశివరావు (గుంటూరు) 16. మరూరు లక్ష్మీనరసమ్మ (మార్కాపురం, కర్నూలు జిల్లా) 17. పేరేపు శాంత (గూడూరు) 18. బొడ్డు వీరమ్మ (రామారు, ప॥గో॥జిల్లా) 19. సానిశెట్టి హనుమాయమ్మ (చత్రపురం. గంజాంజిలా) 20. తల్లాప్రగడ ప్రభాకర రంగసావిత్రి (దెందులూరు, ప॥ గో)

21 గండికోట నరసింహప్రసాద్ (పిఠాపురం)22. పోతుకూచి రామకృష్ణ(గుడివాడ) 23. అయ్యగారి జగన్ మోహనరావు (పటమట, కృష్ణాజిల్లా) 24. కులిబండ్ల రమణమూర్తి (పాత కడప, కడపజిల్లా) 25 జొన్నలగడ్డ పాండురంగ విఠల్ (సికింద్రాబాదు) 26. పర్వతనేని జోయాకుమారి (హైదరాబాదు) 27. శామ్యుయేల్ భాస్కర్ (కడప) 28 పి. బాబురాము (అనంతపురము) 29 గోలుకొండ వేణుగోపాల్ హేమగిరి (చిత్తూరు) 30. పాలా ఇందిరాదేవి(సీతానగరం, శ్రీకాకుళంజిల్లా) 31. యజ్ఞమూర్తి రజనీకాంత్ (గుంతకల్లు, అనంతపురంజిల్లా) 32. కుంకరి హేమబాల (పుంగనూరు, చిత్తూరుజిల్లా) 33. మాడభూషి చంద్రమోహన్ (గుంటూరు) 34 మాడభూషి స్వర్ణలతారాణి (గుంటూరు) 35. కొత్త స్వతంత్రభారతి (అంగలూరు, కృష్ణాజిల్లా) 36. కళ్ళేపల్లి రామచంద్రరావు (కాకినాడ) 37. సి. కామేశ్వరి (ఉరూరు పేట, తిరువళ్లూరు తా॥ చెంగల్పట్టుజిల్లా) 38. గరికపాటి నాగవరప్రసాద్ (అమర్తలూరు, గుంటూరుజిల్లా) 39 కావూరి సత్యమంజుల (మద్రాసు) 40. జి. ఎల్. సుధాకర్ (ముల్లేపల్లి, అనంతపురంజిల్లా)

41. అల్లంరాజు రామారావు (శృంగవరం, తూ॥ గో॥) 42. పులిపాల రామదాసు (గుంటూరు) 43 వంగూరి గిరిజ (తణుకు) 44. కంచర శారద (పెంటపాడు, ప॥ గో॥) 45 మతుకుమిల్లి వెంకటేశ్వరరావు (భద్రాచలం, తూ॥ గో॥) 46. నల్లాని చక్రవర్తుల చారీజగన్ (రంగాపురం, తూ॥ గో॥) 47. మరెంగుంట కస్తూరిబాయి (రాజమండ్రి) 48. కే. యాదగిరి (హనుమకొండ, వరంగల్లుజిల్లా) 49. శీతంరాజు గిరిధరగోపాల్ (ఏలూరు) 50. మన్నవ రవీంద్రనాథ్ (మాతుంగా, బొంబాయి) 51. చంద్రగంటి సత్యనారాయణమూర్తి (డాల్మియానగర్, (బీహారు) 52 ఎర్రమల్లి వెంకటరమణమూర్తి (జంషడ్పూరు, బీహారు) 53 బుద్ధిరాజు సీత (ఇచ్ఛాపురం శ్రీకాకుళంజిల్లా) 54. ఏ. రామకృష్ణపరమహంస (హైదరాబాదు) 55. దీక్షితుల చంద్రకుమారి (పార్లపల్లె, నెల్లూరుజిల్లా) 56. యర్రమిల్లి లలితాకుంతల (విజయనగరం) 57. పాటిబండ్ల జగన్నాధరావు (మద్రాసు) 58. చేబ్రోలు వెంకటేశ్వర్లు (అంగలూరు, గుంటూరుజిల్లా) 59 మొసలికంటి కామేశ్వరి(విశాఖపట్నం) 60 పట్నాలహరి ప్రసాదరావు (ఏలూరు).

61. చెన్నుపాటి రాఘవేంద్రరావు (పడమటలంక, విజయవాడ) 62. ఎస్. ఇంతియా హుసేన్ (నంద్యాల, కర్నూలుజిల్లా) 63. పరమాత్ముని ప్రభాకర్ (నంద్యాల) 64. తిమ్మననాగపద్మప్రేమం పెద తుంబలం, కర్నూలుజిలా) 65. జి. చంద్రకుమారి (హైదరాబాదు) 66. పరిమిశెట్టి మోతు లక్ష్మి (నూజివీడు) 67. భాగవతుల సూర్యకాంతం (విశాఖపట్నం) 68. ఆదేపల్లి అప్పల నరసింహరాజు (బొబ్బిలి, (శ్రీకాకుళంజిల్లా) 69. సోమవరపు విశ్వేశ్వరప్రసాద్ (జగ్గయ్యపేట) 70. పి. దుర్గాప్రసాద్ (ఏలూరు) 71 శేగా నారాయణరెడ్డి (మద్రాసు) 72 హెచ్. ఆర్. జగన్నాధ్ (హైదరాబాదు) 73. మండపాక వెంకట కామేశ్వరరావు (జయపురం, కోరాపుట్టిజిలా) 74 తిరుమల పంకజవల్లి తాయారు (మంగళగిరి) 75. కింతలి సూర్యప్రకాశరావు (బరంపురం, గంజాంజిల్లా) 76 పి వి. సూర్యప్రకాశరావు (జగ్గయ్యపేట) 77. రాజమహేంద్రవరపు అమరనాథ్ (అకునూరు, కృష్ణాజిల్లా) 78. పాతకోట వాణీకుమారి (విజయవాడ) 79. మిరియాల రాంబాబు (రాజమండ్రి) 80. నవుడూరి శివరావు (హైదరాబాదు).

81. వల్లభాపురపు నిర్మలాదేవి (తోట్లవల్లూరు, కృష్ణాజిల్లా) 82. వి. అరవింద్ (రాజంపేట, కడపజిల్లా) 83. కోడె రాజా రామమోహనరావు (బందరు) 84 ఇనటూరి రామభద్రశర్మ (ఐతంపూడి, ప॥ గో) 85. ఎన్. కల్యాణి (హైదరాబాదు) 86. వడకుదుటి వెంకటరమణమూర్తి (రాజమండ్రి) 87. దామోదరీ (నరసన్నపేట, శ్రీకాకుళం జిలా) 88. చట్టి వెంకట రమణకుమారి (కాకినాడ) 89. పెనుమాక వెంకట కృష్ణారావు (మద్రాసు) 90. వి. అనిల్ కుమార్ (రాజంపేట, కడపజిల్లా) 91. చంద్రవదన్ చౌహాన్ (రాజమండ్రి) (92) చట్టి శేషగిరిరావు (కాకినాడ) (93) అదంట ప్రేమస్వరూప్(విజయవాడ) (94) చిట్టాదివాకర్ (లక్ష్మీపురం,దివితాలూకా, కృష్ణాజిల్లా) (95) కనూరి లక్ష్మీరాణి (గుంటూరు) (96)చీమలపాటి గురుచరణప్రకాశవైద్యనాధన్(టెక్కలి,శ్రీకాకుళం జిల్లా)(97)వల్లూరి అరుణ (ఏలూరు) (98) దంగేటి కళ్యాణి (విశాఖపట్నం)(99) జి. ఎస్. వి. ఎస్. ఎస్. ఎస్. శర్మ(హైదరాబాదు) (100) ఇల్లిందల చిత్ర (హైదరాబాదు.)

(101) దుగ్గిరాల మహాదేవరావు(విజయనగరం)(102) తిమ్మననాగ చిన్నప్రేమం (పెద్దతుంబళం, కర్నూలు జిల్లా)(103) మోగులూరు ఉషాకుమారి (విజయవాడ) (104)సల్లమల్లి మహాలక్ష్మమ్మ (ఒంగోలు) (105) బి. రామతిలకం(మద్రాసు) (106) బి. లక్ష్మీతిలకం(మద్రాసు) (107) కలబంగి హనుమంతరావు (నెల్లూరు) (108) పెమ్మరాజు వెంకటసూర్యనారాయణరావు (పెనుమంట్ర, ప॥ గో॥) 109 శిష్టా సునంద (గుంటూరు) 110. ధరణీ ప్రగడ లక్ష్మీకనకదుర్గ (గుంటూరు) 111. చిల్లరిగె సౌదామిని (మహబూబాబాద్, వరంగల్లు జిల్లా 112. తేలప్రోలు అనంత నాగేశ్వరరావు (కాకినాడ) 113. బోదనపు మోహన్‌రెడ్డి (కంభం) కర్నూలు జిల్లా) 114. చింతా ఉమామహేశ్వరరావు (కాకినాడ) 115 గమని ఫణిరత్న మంజరి (రాజమండ్రి) 116. ఆస్రై సరస్వతి (విజయనగరం) 117. పి.

మరికొందరు సభ్యుల పేర్లు

మణి రాజేంద్రరావు (కురదాగోడు పూరిజిల్లా) 118. సవితిని విజయలక్ష్మి (వుండి, ప॥ గో॥) 119. సత్యవోలు లలితా భ్రమర (రాజమండ్రి) 120. కామవీరం గురులింగమ్మ (ఆదవాని, కర్నూలు జిల్లా)

121. రూపెనగుంట్ల సాంబశివరావు (విజయవాడ) 122 తోడుపునూరి శే. పరదేశి (హైదరాబాదు) 123. యలవర్తి బాపురావు (కూచిపూడి గుంటూరు జిల్లా) 124 ఇప్పగుంట వెంకట శ్రీనివాసరావు (నెల్లూరు) 125. దశికవర్ధని (విశాఖపట్నం) 126. చిక్కాల గోపాలరావు (కాకినాడ) 127 జె. బి. రామకుమార్ (పత్తికొండ కర్నూలు జిల్లా, 128. పోలుకొండ మీనాక్షి భీమడోలు 129 చిల్లరిగె సుధాదేవి (మహబూబాబాద్ వరంగల్లుజిల్లా) 130. ఆర్. నాగేశ్వరరావు (తణుకు) 131. సుసర్ల సూర్యభగవానులు (పర్లాకిమిడి, గంజాంజిల్లా) 132 దేశిరాజు శివరామకృష్ణ (ఏలూరు) 133. వడ్లమన్నాటి ఉమామహేశ్వరప్రభుజీ (బందరు) 134. వి. కె సునంద (మద్రాసు) 135. వెలగపూడి ఉషాకనకసుందరి (గుంటూరు) 136 వి. రమేష్‌చంద్రబాబు (విజయవాడ) 137. శ్రీదర స్వతంత్రభారతీదేవి (నాగాయలంక, కృష్ణాజిల్లా) 138. కలబరికి ప్రభాకరరావు (నెల్లూరు) 139. కె. నళినీపద్మలత (గుంతకల్లు, అనంతపురంజిల్లా) 140. చియ్యవరం సుజనమ్మ (చియ్యవరం, కడపజిల్లా.)

141. ఏకా వెంకటమోహనరావు (పాత గుంటూరు) 142 పి. మధుసూదన్ (నెల్లూరు)

143. వి. మురళీధరన్ (తిరుపతి) 144. గుర్రం శంకరరెడ్డి (కర్నూలు) 145 ముదునూరు వెంకటవిజయలక్ష్మి (విజయనగరం) 146 శిష్ట్లా రాజారామ్ (గుంటూరు) 147. ఎం నాగరత్న (ఆదోని, కర్నూలుజిల్లా) 148 ఎస్. రాఘవేంద్రరావు (రాజమండ్రి) 149 శింగరాజు లక్ష్మీకనకదుర్గ (విజయవాడ) 150. ఇమ్మనేని వెంకటఉషాసాయి (బళ్లారి) 151 ఇ. రంగయ్యనాయుడు (బద్వేలపల్లె, కడపజిల్లా) 152 అయలసోమయాజుల నాగరత్నం (లఖ్నా, కలహండి జిల్లా, ఒరిస్సా) 153 యర్రమిల్లి శ్రీరామ వెంకటరావు (కాకినాడ) 154 కొమ్మూరి శశిరేఖ (కాకినాడ) 155. కొమ్మ ఆనంద మోహన్ (కాకినాడ) 156. కూచిపూడి కోటేశ్వరరావు (వలేటివారిపాలెం, నెల్లూరు జిల్లా) 157. అందవిల్లి వెంకటేశ్వరరావు (విజయవాడ) 158. పోలూరు శ్రీరామ చంద్రమూర్తి (చిలకలూరిపేట) 159 కె వి. రమణమూర్తి (పలాస, శ్రీకాకుళం జిల్లా) 160. మస్నె శాయిబాబు (అప్పికట)

161 సూరి రామసుబ్బయ్యశాస్త్రి (నూజవీడు) 162. శివలెంక జ్ఞాన ప్రసూనాంబ (పెసరమిల్లి కృష్ణాజిల్లా) 163 ఇవటూరి రత్నకుమారి (పెసరమిల్లి) 164 గరిమెళ్ల భాస్కరరామం (చోడవరం, విశాఖ జిల్లా) 165. గ్రంథి నాగమణి (అనకాపల్లి, విశాఖజిల్లా) 166. సోపింటి నాగబాబు (ఏలూరు) 167. యామిడన్న అలివేలు (గుంటూరు) 168. మానుకొండ సూర్య ప్రకాశ్ (ఏలూరు) 169 కొడవంటిసుభద్ర (విజయనగరం) 170. ఏ. పద్మిణాబాయి (సికింద్రాబాదు) 171. వత్సవాయి వరలక్ష్మీదేవి (విజయవాడ) 172. తాడేపల్లి బాపూజీ (చిలకలపూడి బందరుతాలూకా) 173 ముక్కిపూడి సామ్యుల్ సుందరరాజు (కొత్తరెడ్డిపాలెం, గుంటూరుజిల్లా) 174. పత్తిపాండు (తురిమెళ్ల, కర్నూలుజిల్లా) 175. వరద సత్యనారాయణమూర్తి (విజయనగరం) 176. చర్ల మల్లికార్జునశాస్త్రి (కొకగవర్రు ప॥ గో॥ జిల్లా) 177 సుర్రాయోగి వీరాస్వామి (తెనాలి) 178 యాసిన్‌ఖాన్ (గుంటూరు) 179. కంపరాజు శంకర్రాజు (వలేటి వారి పాలెం, నెల్లూరుజిల్లా) 180. బలివాడకృష్ణారావు (విజయనగరం).

181. వకాౢకృష్ణ (తుని, తూ॥ గో॥) 182. ఎర్రంనేని హర్షవర్ధనరావు (పెదకూరపాడు, గుంటూరుజిల్లా) 183. కోణకంచి చంద్రశేఖరశర్మ (క్రోసూరు, గుంటూరుజిల్లా) 184 బిమ్మ రామకృష్ణయ్య (ద్రోణాచలం, కర్నూలుజిల్లా) 185. భావరాజు సీతారామారావు (కర్నూలు) 186 నిమ్మగడ్డ కృష్ణారావు (గుడివాడ) 187. ఎస్. నిర్మలాదేవి (హైదరాబాద్) 188 గోపవరం రాజగోపాల్ రెడ్డి (గోపవరం, కడపజిల్లా) 189 గూడూరు అరుణాదేవి (గూడూరు, నెల్లూరుజిల్లా) 190 మట్టా ప్రసాదరావు (వేస్త్రవారపుపేట, కర్నూలుజిల్లా) 191. కోలచల బాలసుబ్రహ్మణ్యము (తాడేపల్లి, గుంటూరుజిల్లా) 192 ఎరానేని సత్యవాణి (సంధిపూడి, తూ॥గో॥) 193 ప్రతాపని లక్ష్మీరాజ్యం (బుద్దారంవుపేట, వరంగల్లు జిల్లా) 194 శ్రీరంగం రాజేశ్వరరావు (విశాఖపట్నం) 195. ష. నరసింహము (హైదరాబాదు) 196 చెరువు కామాక్షి (హైదరాబాదు) 197 చేవూరు సింహాచల సాయిప్రసాద్ (నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా) 198 ఈమని జగన్‌మోహన్ (విజయవాడ) 199 గట్టుపల్లి ఆదిశేషయ్య (నెల్లూరు) 200 కాశీనాథభట్ల జగన్నాథ శాస్త్రి (రాజమండ్రి)

201. ఎం. సుధ (గూడూరు) 202. పెనుమర్తి గౌరీసత్యవతి (కాకినాడ) 203. ప్రతివాద భయంకర రంగస్వామి (ఏలూరు) 203 నిబ్బరగండ్ల భాస్కరరెడ్డి (తురుమెళ్ల, కర్నూలుజిల్లా) 204. బులుసు సుభద్ర (కాకినాడ) 205 ఎస్. వరలక్ష్మి (సికింద్రాబాదు) 206 కాకరపర్తి ప్రభాకరరావు (వాల్తేరు) 207. సర్రాజు పాండురంగారావు (విజయవాడ) 208. సూరె సౌభాగ్యలక్ష్మి (చినగంజాం) 209. కోడె భారతి (మోదుకూరు, గుంటూరుజిల్లా) 210. ఎస్. కామేశ్వరి (వనికనదిన్నె, కర్నూలుజిల్లా) 211. ఎం. కైలాసనాథ్ (మద్రాసు) 212. దూడా పద్మావతి (విశాఖపట్నం) 213. మహమ్మదాలీ కిషోర్ (నరసన్నపేట, శ్రీకాకుళంజిల్లా) 214. మూర్తి వెంకటశాస్త్రి (జగ్గయ్యపేట) 215. కె. కల్పలతాదేవి (హైదరాబాదు) 216. కోరుకొండ బుచ్చిరాజు (అనకాపల్లి, విశాఖజిల్లా) 217. పెన్మెత్స సూర్యప్రభాకుమారి (తణుకు) 218 టి. ఆర్. మూర్తి (పాణ్యం, కర్నూలుజిల్లా) 219. న్యాయపతి శశికళ (మహబూబ్ నగర్) 220. డి. గీతాబాయి (అనంతపురం)

221. ద్రాక్షారాం వైద్యనాథం బాబు (చీరాల) 222. శాత రాజ్యలక్ష్మి (రంభ, గంజాంజిల్లా) 223. గ్రంథి వెంకటసుబ్బమ్మ (ఒంగోలు) 224. దిగాలా ప్రమీలాకుమారి (సాలీపేట, నల్గొండజిల్లా) 225. ఎం సూర్యప్రకాశరావు (పుల్లేరు, అనంతపురం జిల్లా) 226. టి. వి. ఎల్. చారి (సికింద్రాబాదు) 227. ఉణుగుర్తి నరసింహదాస్ (వాల్తేరు) 228 బాలనాగు సుబ్రహ్మణ్యం (భీమడోలు) 229. ఏటుకూరి రేణుకారాణి (గుంటూరు) 230. కడివేళ్ళ ఇందిరాకుమారి (ఎగువగోట్టివేడు, కడపజిల్లా) 231. దేవరాజు భాస్కరరామదాసు (విశాఖపట్టం) 232. పి. విశ్వనాథ్ (హైదరాబాదు) 233. సి. కే. పద్మావతి (బళ్ళారి) 234. రాంపల్లి రాజేశ్వరరావు (ఏలూరు) 235. ఎస్. వి. సూర్యనారాయణ (పాలకొల్లు) 236. గాజుల లక్ష్మినారాయణ (హైదరాబాదు) 237. వేదుల రత్నమాల (విజయనగరం) 238. ఎల్. ఎస్. విజయలక్ష్మి (హైదరాబాదు) 239. ఎన్ నటరాజన్ (నెల్లూరు) 240 సూనె రాధాబాయి (గుంటూరు) 241 పాగోలు విజయభాస్కరరావు (బొబ్బర్లంక, కృష్ణాజిల్లా) 242. కమ్మ శ్రీనాథరావు (సామర్లకోట) 243. గంగరాజు గిరిజా కృష్ణకుమారి (గుంటూరు) 244. నాయని నిర్మల (తణుకు) 245. అడుసుమిల్లి ప్రసాద్ (మదినేపల్లి కృష్ణా జిల్లా) 246. దేశిరాజు ఆంజనేయులు (పాత గుంటూరు) 247. అంబాఖానా ఈశ్వరీదేవి (కొత్తపేట తూ॥ గో॥) 248. కొండూరి వెంకటరమణ (గుంటూరు) 249 వాకాడ భవానీ వెంకట గోవిందరావు (అనకాపల్లి, విశాఖజిల్లా) 250. చిట్టిబోయిన రాధాకృష్ణరావు (బొబ్బిలి). ★

[వచ్చేవారం మరికొన్ని]

ఒక ఇల్లాలు పొరుగింటి ఇల్లాలితో "మా ఇంటాయనికి ఒక్క చెడ్డ అలవాటు కూడా లేదంటే నమ్మండి. ఆఫీసుకు వెళ్లటం, ఇంటికి రావటం, అంతే. ఎక్కడికీ వెళ్లరు, ఆఖరికి సినిమాకి కూడా వెళ్లరు," అని గొప్పగా చెప్పుకున్నది.

"సిగరెట్లు కాలుస్తారనుకుంటానే," అన్నది పొరిగింటావిడ

"ఆ ఎప్పుడన్నా సంతోషంగా ఉన్నప్పుడు కాలుస్తారు మహా అయితే నెలకు ఒకటో రెండో, అంతే."

కలహంలో కాంతారావు

దామర్ల శ్రీరామకృష్ణ

ఊగుతుంటూ పది కొట్టింది గోడ గడియారం.

హుషారుగా డ్రెస్ చేసుకొని మెత్తని సోఫాలో కూర్చొని పేపరు తిరగవేస్తున్నాడు కాంతారావు. సహజ సౌందర్యవంతుడైన అతనికి పై మెరుగులు ఎంతో ఆకర్షణీయంగా వున్నాయి. ఫంకా గాలికి నొక్కులజుత్తు వయ్యారంగా కదులుతుంటే సన్నని మెరుపుతీగలవంటి వేళ్ళతో సరిచేసుకుంటూ పేజీలు తిరగవేస్తూ తనలో తానే నవ్వుకుంటున్నాడు... ఆ నాడు ఎందుకో కాంతారావు చాలా ఆనందంగా వున్నాడు. పున్నమినాటి చంద్రునివలె అతనిముఖం ప్రకాశిస్తోంది. తెరలు తెరలుగా సంతోషం వస్తున్నట్లు ముఖకవళికలు తెల్పుతున్నాయి.

అడుగులో అడుగు వేసుకుంటూ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ లక్ష్మి కాఫీ కప్పుతో హాల్లో ప్రవేశించింది: కాంతారావు తల ఎత్తిచూసి తిరిగి దించుకున్నాడు. ఆమె ముఖం ముడుచుకుంటూ పెదవులు కొరుక్కుంటూ, కాఫీ కప్పు మేజాపై పెట్టి అలానే నిల్చుంది. ఆమె కళ్ళు వెయ్యి కాండిల్ బల్బులా వెలుగుతూ కాంతారావు ముఖంలోకి చూస్తున్నా అతను మాత్రం తలఎత్తయినా చూడటం లేదు...

"కాఫీ....చల్లారుతుంది...త్రాగి చదువుకోండి" లక్ష్మి చేసేదిలేక అతనికి గుర్తు చేసింది....

"ఓ! అడగకముందే తెచ్చావన్నమాట! ఈవాళ ఏదో పర్వదినం..." కాంతారావు లేతపెదవులతో నవ్వుతూ వ్యంగ్యంగా అన్నాడు.

కాంతారావు స్వభావం ఎప్పుడూ ఇంతే తన చదువుకు, ఉద్యోగానికి తగిన హోదాతోను, బెట్టుతోను మెలిగే అలవాటు అతనికుంది...దాన్ని ఇంటిబయటే కాకుండా ఇంటిలోపల కూడా ఆచరిస్తుంటాడు... అతనుమాటే భాషలో వ్యంగ్యం దాక్కొని ఉంటుంది.

లక్ష్మి అపరిచితురాలు కాదు. కాని కాంతారావు ఉద్దేశ్యంలో పరిచితురాలికి ఇవ్వవలసిన అంతస్తు ఇవ్వకూడదని...భార్యభర్తలే అయినా, వారిరువురిలోనూ మంకుతనం కరుడుకట్టి వుండటంలో, దైనిక జీవితములో ఇరువురికి చిన్నారి చిట్టితగాదాలు తప్పవు. చిన్న విషయం పెద్దపేచీగా మారుతుంది...చివరకెప్పుడో చల్లారుతుంది.

కాంతారావు ఎంత పెంకిఘటమో అంతకంటే రెండాకులు ఎక్కువే లక్ష్మి...తను లెక్చరర్ కాస్తో కూస్తో ధనవంతుడు; అవసరానికి మించిన అందం వుంది. ఇవి కాంతారావుకు గర్వం కలిగిస్తుంటాయి...అవే అతని పెంకితనానికి పునాదులు.

తను అందగత్తే! శ్రీమంతుల ఆడపడుచు! ఇవి లక్ష్మి గర్వానికి కారణాలు. ఇవే ఆమె పెంకితనానికి ఆభరణాలు.

కాంతారావు చదువుతున్న పత్రిక అవతల పారవేసి, కాఫీ కప్పును పెదవులకు అంటించాడు. గుటక తర్వాత గుటక వేస్తూ, ఏటవాలుగా కళ్లుతిప్పుతూ, తనలో తానే చిరునవ్వు చిందించుకున్నాడు...

"ఈవాళ కాఫీ చాలాబాగుంది లక్ష్మి! ఏమన్నా అమృతం కలపలేదుగదా!" లక్ష్మి కళ్ళల్లోకి కూటిగా చూశాడు.

"మీరే అన్నారుగా, పర్వదినం అని... అందుకనే బాగుండి వుంటుంది. మీకు నచ్చితే సరి..." ఆమె తూకమేసినట్లు జవాబు చెప్పింది.

కాంతారావు కప్పులో సగం కాఫీవుంచి "పాపం! నీకు లేదు కామాలు! ఇది త్రాగుదూ" అన్నాడు...

"రెండు కప్పుల కాఫీ గదిలోవున్నది. నాకేం ఇవ్వక్కరలేదు" లక్ష్మి అంది.

కాంతారావు మూతి ముడుచుకున్నాడు. గట్టిదెబ్బ తగిలినట్లుంది, అతనికి. వాచీ చూసుకున్నాడు — పదిహేను నిమిషాలు గడిచిపోయాయి. కాలేజికి ఇంకాముప్పావు గంట టైముంది...తిరిగి పత్రిక తీసి చదవటం మొదలెట్టాడు.

ఆనాడు, ఫస్టుతారీఖు అవటంతో అతనికి సంతోషంగా వుంది—జీతం మూడువందలు ముట్టచెబుతారు...అందుచేతనే చాలా తొందరపడుతున్నాడు, కాలేజికి వెళ్లాలని.

ఖాళీకప్పు లోపలపెట్టి తిరిగవచ్చింది, లక్ష్మి.

"ఈవాళ పర్వదినమన్నారు!...ఎందుకో తెలుసుకోండి!..." ఆమె ఆసక్తితో చూసింది...చూపులు, జవాబు చెప్పాలోమన్నట్లు కాంతారావును ప్రశ్నించినట్లున్నాయి...

"నీవు చెప్పు చూదాము..." అతను తేలిగ్గా నవ్వుతూ అన్నాడు...

"చెప్పమంటారా? ఈవాళ ఫస్టుతారీఖు! అందుకనే పర్వదినం..." లక్ష్మి నవ్వింది...

కాంతారావు కళ్ళు పెద్దవిచేస్తూ "ఫస్టుతారీఖు అయితే పర్వదినమెందుకు?..."

"బలేవారు మీరు! మీకు జీతం వస్తుంది గదూ..."

"అయితే!..."

"అయితే, గియితే, ఏంలేదు! డబ్బు వస్తుందిగదా అంట..."

"వస్తుంది"

"అందుకే, నాకు సంతోషం...అంటే ఎందుకో ఆలోచించండి...' లక్ష్మి సోఫాలో రావు ప్రక్కన కూర్చుంది...కాంతారావు జరిగి సర్దుకున్నాడు...

"అర్థం అవలేదుగదూ! చెపుతాను వుండండి; బెనారస్ సిల్కు చీర ఈ నెల్లో తెస్తామన్నారుగదూ! గుర్తు తెచ్చుకోండి..." లక్ష్మి రావు కళ్ళల్లోకి చూస్తూ, పదహారు పళ్లు విప్పి నవ్వింది...

కాంతారావు మౌనంగా వున్నాడు—అతని దృష్టి రెపరెపలాడే, నాకిలి కర్టెను మీదకు మళ్లింది...అక్కడనుండి వయ్యారంగా అల్లుకొన్న సన్నజాజిలతల పైకి పోయింది...లక్ష్మి మాటలు విననట్లు నటించుతున్నాడు...

"గుర్తుకొచ్చిందా! అవునులెండి, నా మాటంటే వులకు పోకదు..." ఆమె బుంగ మూతిపెట్టి, సొగసుగా చూసింది...

"ఈ నెల్లో బెనారస్ చీర తెస్తానన్న మాట! అంతేకదూ..." రావు ప్రశ్నార్థకంగా చూస్తాడు...

"అనలేదూ.....సరిగ్గా గుర్తు తెచ్చుకోండి..."

"అయితే కావచ్చు; దానికి ముంచుకు పోయిందేముంది?" రావు సాఫీగా అన్నాడు...

"అందుకే; ఈవాళ ఫస్టుతారీఖుగనుక, అంటే డబ్బు వస్తుందికనుక,—ఆ మాట చెల్లించుకోమంటున్నాను...అంతకంటే ఏమీలేదులెండి! మరీ కంగారు పడుతున్నారు" అంది లక్ష్మి...

"అయితే పర్వాలేదులే బ్రతికించావు! ముందు డబ్బు రానియ్యి..."

"కాలేజికి వెళ్ళగానే వస్తుందిగా! నేను రెడీగా వుంటాను! సాయంత్రం షాపింగ్ వెళ్దాము..."

"ఆ పనిమాత్రం చేయకు; నేను చెప్తానుగా నీకు......" రావు మృదువుగా పలికాడు.

"అసలు వద్దంటారా..." అదోలా ముఖం పెట్టుకొని అడిగింది.

"అదే తర్వాత చెపుతానులే; ముందు డబ్బు రానీయి;...వీలుగావుంటే, తీసుకుందాం; మొదట ఇతరఖర్చులు వున్నాయి; ఆ తర్వాత మిగిలితే...నీ చీర విషయం చూస్తాను..." కాంతారావు చావు కబురు చల్లగా చెప్పాడు.

లక్ష్మికి కోపం, విచారం, ముంచుకొచ్చాయి! తనకెంతో అన్యాయం జరిగినట్లు, తన ప్రతిపత్తికి హాని కలిగినట్లు బాధపడింది...కళ్ళు చెమ్మగిల్లాయి. ముఖం కందగడ్డలా అయింది...

"ఇక, దానికి సున్న అన్నమాట..." బొంగురుగొంతుతో అంది; మాటలు ఎంతో కష్టంమీదగాని పెగలటంలేదు...

"లక్ష్మీ! అన్నీ నీవే అనుకుంటున్నావు! అపార్థాలు కల్పించుకుంటున్నావు......వీలుంటే తెస్తానన్నాను-దీనికోసం ముఖం అదోలా పెట్టుకుంటే నాకేం నష్టంలేదు" కాంతారావు, లేచాడు సోఫానుంచి...

తన గదిలోకి వెళ్ళి, ఫైల్, కొన్ని పుస్తకాలు తీసుకొని, కాలేజికి బయలుదేరాడు...

సత్యభామ కోపాన్ని అభినయిస్తూ, లక్ష్మి అతని పోకడను ఓరకంటితో చూసింది. కోపం ముంచుకొచ్చింది అతని తెంకితనానికి; ఏనాడూ, తన మాట గౌనడు. అంత మొండిగా ప్రవర్తిస్తాడతను...

దబాలున తలుపువేసుకుంది లక్ష్మి.

నల్లని తారురోడ్డుమీద చకచకా అడుగులు వేసుకుంటూ, కాంతారావు పోతున్నాడు; ఎంతదూరం నడిచినా, అతనికి కాలేజి కనిపించేట్లు లేదు—బాటాబూట్లు చప్పుడు విని సంగీతంలా ఆనందిస్తూ నడుస్తున్నాడు.

నిజంగా తన ప్రవర్తన తనకే సంతోషంగా వుంది. తన లెక్చరర్ అధికారం, క్లాసు విద్యార్థులమీద నేకాదు. ఇల్లాలిపై కూడా, నిరాటంకంగా చెలామణి అవుతుంది.

ఆనాడు ఫస్టుతారీఖుని తనకు ఎంతో సంతోషంగావుంది. మూడు పచ్చనోట్లు కళ్లలో తారట్లాడాయి. ఇంటి ఖర్చుక్రింద ఒక్కనోటు మినహాయించుకున్నాడు. మిగతాది తన జల్సాలకు ఉపయోగించుకోవాలి.



★ కలహంలో కాంతారావు ★

అసలే తను క్రొత్తగా చేరాడు లెక్చరర్‌గా. క్రొడస్సులోను, ఇతరవిషయాలలోను, వున్నత స్థాయిలో వుంటేనే, తనకు గౌరవము, తనకు విలువ. తనబట్టలు చూసుకున్నాడు. అచ్చే అట్టే బాగులేవు. ఎంత మంచివయినా చిన్న వేగా! ఏంవిలువ వుంటాయి. మంచి ట్వీడ్‌సూటు కుట్టించుకోవాలి. అప్పుడు గౌరవముంటుంది...

ఇక లక్ష్మివిషయం ఆడవాళ్లకెందుకు, అంత ఖరీదుగల బట్టలు: ఇప్పుడున్నవి చాలవూ! పైగా, ఇంటినుండి బయటికి వస్తుందా, పెడుతుందా! ఎప్పుడూ, ఆ నాలుగుగోడల మధ్యనేగా. పైగా తనవద్ద ప్రస్తుతం డబ్బులేదాయే! అవచ్చే డబ్బుతో తను ట్వీడ్‌సూటు కుట్టించుకోవాలి. ఇక కాళ్ళజోడు ఏమీబాగులేదు. తోటి లెక్చరర్‌లు అంబాసిడర్, బూట్లు తొడుగుతున్నారు. తనకీ ఒకజత వుంటేనే గౌరవము.

ఇలా ఆలోచిస్తూ కాంతారావు, కాలేజి గేటువద్దకు వచ్చాడు...నిట్టూర్పుతో ఆఫీసులోకెళ్ళి, అటెండెన్సులో సంతకముపెట్టి ఇక క్లాసులకు హాజరవటానికి బయలు దేరాడు. అతనికి క్లాసులవగానే ఎంతో భయమేసింది. ఆనాడు, వరుసగా, మూడు గంటలు వాగాలి! తలనొప్పిరాదూ!...కాని అతనికి మూడువందలు గుర్తుకొచ్చేసరికి, గబగబా అడుగులేసుకుంటూ, క్లాసులోకి వెళ్లాడు.

మూడుగంటలని పేరేగాని ఎంతసేపు, మూడునిమిషాల్లా గడచిపోయాయి. ఖచ్చితంగా రెండయింది క్లాసునుండి బయటికి వచ్చేసరికి ఆఫీసులోకిపోయి, కౌంటర్ వద్ద సంతకముచేసి, మూడు పచ్చకాగితాలు చేతుల్లోకి తీసుకున్నాడు.



ఇప్పుడు కాంతారావుముఖం వికసించిన తామరపువ్వులా వుంది. మూడువందలు జేబులో పెట్టుకుని టీచర్సు రూములోకి వెళ్లాడు. ఏదో పత్రిక తిరగవేస్తూ, చదువులో మునిగివున్న తోటిలెక్చరర్ వెంకట్రావ్, ధరించిన లేతమామిడిచిగురు వులెక్ ట్వీడ్‌సూటు, అతని కళ్ళను ఆకర్షించింది. చప్పున వెంకట్రావ్ దగరకెళ్ళి, భుజానచరచి, చిరునవ్వుతో కూర్చున్నాడు కాంతారావు.

"క్లాసులన్నీ ఫినిష్ చేశావోయ్..." సిగరెట్టు వెలిగిస్తూ వెంకట్రావ్ మందహాసం చేశాడు...

"ఈవాళ నాతల పగిలిపోయిందనుకో... వరసగా మూడుగంటలు వాగేయాలిసొచ్చిందోయ్..." తగురీతిగా జవాబు చెప్పాడు కాంతారావు...

"సాలరీ తెచ్చుకున్నావుగా..." తనకు ఆఫర్ చేసిన సిగరెట్టును తీసుకుంటూ. తిరిగి కాంతారావు ప్రశ్నించేసరికి, అవునన్నట్లు తలవూపేడు వెంకట్రావ్...

కాంతారావు రెండుకళ్ళూ, అతనిట్వీడ్ సూటుమీదనే వున్నాయి.

"ఎప్పుడు తీసుకున్నావోయ్ ఆసూటు."

"లాస్ట్‌వీక్! ఏమంత బాగుండలేదు గదూ..."

"నో! బెస్టుగా వుంది! ఎక్కడ తీసుకున్నావేంటి..."

"సిల్కు ప్యాలెస్‌లో; ! నీవు కూడా తీసుకోకూడదు; నీ ఎరుపు శరీరానికి ఈ రంగు నైస్‌గా వుంటుంది..."

"అయితే వెళదాము పద! నీవుకూడా సెలక్టు చేద్దువుగాని" అని కాంతారావు, వెంకట్రావును వెంటపెట్టుకొని సిల్కు ప్యాలెస్‌కు వెళ్లాడు ... రెండు జతలకు సరిపోయే క్లాత్ తీసుకున్నాడు...నూట ఏభై రూపాయలు ఐనా, అతనికి అట్టే కష్టం కలుగలేదు. తను ఏనాటినుండో, కలగంటున్న కోరిక, ఈడేరిందని, సంతోషం... పైగా, తన అంతస్తును అది, బాగా గుర్తింప చేస్తాయి......

ఇంకో ముప్ఫయి రూపాయలు పెట్టి బూట్లు కొన్నదాకా, అతనికి తృప్తి కలుగలేదు. వులెన్‌సూటుకు ఆ బూట్లు తగి వుంటాయి, రెంటికీ జత బాగుంటుంది... అని అనుకొన్నాడు...వెంకట్రావ్‌కు గుడ్‌బై, చెప్పి, ఉత్సాహంతో గృహం చేరుకున్నాడు...

కాంతారావు తెచ్చిన వస్తువులు చూడటానికి, లక్ష్మికి కోపం వచ్చిందో! లేక సంతోషం వచ్చిందో, ఆమెకే తెలియాలి ...కాగితంలో వున్న బట్టలనుచూసి, తన చీర వుందనుకుంది; ... ఏలాగయినా తనమాట, నెగిందని, సంతోష పడింది...

కాంతారావు వాటిని చూపించేవరకు, తనకు జరిగిన అన్యాయాన్ని ఆమె తెలుసుకోలేదు. తన వూహాలు గాలిలో కలిశాయని అనుకుంది.

ట్వీడ్ క్లాత్ చూపిస్తూ, "చూశావు లక్ష్మీ! ఎంత బాగుందో! చాల ఖరీదులే, నావంటికి బాగుంటుందేమో...చెప్పు..."; కాంతారావు పలికిన పలుకుల్లో వ్యంగ్యం వుందో, పెంకితనం వుందో, సంతోషం వుందో, లక్ష్మికి అర్థంకాలేదు.

లక్ష్మికి ఏడ్పొంతపనయింది. నిజంగా ఏడ్చేదే; కాని అభిమానం అడ్డుపడింది. దానికి బదులు కోపం అవధులుదాటి, ఎవరెస్టు శిఖరం అందుకుంది. తనకు చీర తేలేదు సరిగదా! తను ట్వీడ్‌సూట్లు తెచ్చుకున్నాడు-; పైగా తనకు చూపిస్తూ వెక్కిరిస్తున్నాడు. ఇవి ఆమె ఆలోచనలు తనకు భరించరాని అవమానం జరిగిందని, తన హృదయంలో మానరాని, గాయం తగిలిందని; ఆమె భావన.

కాంతారావు పెంకితనం అంతటితో ఆగలేదు. నిగనిగలాడే బూట్లను, చూపిస్తూ "లక్ష్మీ! ఇది రీసెంటు ఫ్యాషను! ముప్ఫయి రూపాయలు. చాలా బాగున్నాయి కదూ ..." అన్నాడు...;

అసలే గాయపడిన ఆమె హృదయానికి, ఆ మాటలు గట్టిగా గ్రుచ్చుకున్నాయి. కళ్ళల్లో నీళ్ళు కొస్త మెరిశాయిగాని, వెంటనే వెనక్కు త్రిప్పుకుంది ... వాడిన గులాబిలాముఖం పెట్టింది;

కాంతారావు మళ్ళీ మళ్ళీ చూసుకుంటూ పెట్టెలో పెట్టి, సోఫాలో కూర్చొని "కాఫీ తీసుకురా!" అన్నాడు, చేతులు దులుపుకుంటూ.

లక్ష్మి కదలకుండానే, అలానే నిల్చుంది, "లక్ష్మీ! కాఫీ అవలేదూ! మర్చిపోయాను, ఈ వాళ సినిమా కెళదాము, తయారవు" ఆశగా ముఖంపెటి చూశాడు.

"కాఫీ గీఫీ ఏమిలేదు! సినిమా, గినిమా! ఏమివద్దు" ... అన్న, లక్ష్మి పలుకులు, అతనికి అట్టే ఆశ్చర్యం కలిగించలేదు. పర్యవసానం అలాగే వుంటుందని అతను అర్థం చేసుకున్నాడు. అయినా, కొంతవరకు సమాధాన పడదామని అతని తలంపు. అందుచేతనే, లక్ష్మిని లాలించి అడిగాడు. చీరె తేకపోవటం, ఆమె కోపానికి మూలం అని ఎరుగున్నా, దాన్ని సినిమారూపంలో మరిపింప చెయ్యాలనుకున్నాడు.

"లక్ష్మీ: ఎందుకలా ముడుచుకుపోతావు చీరెదేముంది! వచ్చేనెల్లో తీసుకుందాం!..

నేనూ.. ట్వీడ్‌సూటు తీసుకోనే వాడినే కాను... కాని నా లెక్చరర్ పనికి మంచి సూటు అవసరం కదూ; తప్పనిసరి అయి తీసుకున్నాను; బూట్లుకూడా అంతే... దీనికోసం... పెద్దగా..." కాంతారావు శాంతియుత పరిష్కారానికి తన ఆసక్తి కనుపరిచాడు... కాని ఎదుటివారికి ఆ ఆసక్తి వుంటేనే పరిష్కారం సాధ్యం...

లక్ష్మిపై, ఆ లాలింపుపలుకులు పనిచేయ లేదు పైగా, ఆమె తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవటానికి, తన సర్వాధికారాన్ని వినియోగం చేయాలని ఆలోచిస్తోంది...

"అయితే కాఫీ ఇవ్వవన్నమాట.. పోనీలే, హాయిగా హోటలుకెళ్ళి తాగుతాను.." అంటూ కాంతారావు వీధిలో అడుగు వేశాడు...

అతని మనస్సు కొంచెం దెబ్బతిన్నట్లయింది. ముఖంలో కళాకాంతులు లేవు. లక్ష్మి అంటే అతనికి కోపంతో పాటు ఈర్ష్య, వాటితో పాటు అసహ్యం...పుట్టుకొచ్చాయి తను ఎంతో సంతోషంగా సూటు తీసుకుంటే ఆమెకు దుఃఖమొస్తుంది పోనీ! తను ఒకజత తగ్గించుకొని. చీర తెచ్చి వుంటే బావుండేదేమో అనుకున్నాడు.

కాని సమస్య సుఖాంతం కావటం కాంతారావుకు ఇష్టంలేదు. తన సంపాదన పరుడు తన డబ్బుఖర్చు తన ఇష్టంమీద జరుగుతుంది, తనహోదాకు తగ్గట్టు అన్ని అవసరాలు సమకూర్చుకుంటాడు గని మీద ఆడపెత్తనం ఏమిటి? తను లక్ష్మికి లొంగకూడదని, అలా చేస్తే తన అంతస్తు అంతరిస్తుందని తలచాడు.

లక్ష్మికి ఆలోచనలు ప్రవాహంలా వచ్చాయి. తనకు చీర లేకపోవటం కంటే, తనకు జరిగిన అవమానానికి ఆమె భరించలేకపోయింది...స్త్రీకి తగిన గౌరవమియ్యాలని ఆమె వాదన! భార్యఅంటే, పురుషుని, సేవకురాలేగాదు—అతని సుఖదుఃఖాలలో భాగస్తురాలు! అందుకనే అతను ట్వీడ్ సూటు, తీసుకున్నప్పుడు, తనకూ, చీర తేవాలి!.. ఇవి ఆమె ఆలోచనలు... ఆమెకు తన పుట్టిల్లు గుర్తొచ్చింది...లక్షాధికారి గారాబపు కూతురుగా పెరిగిన తను, ఇక్కడ ఏమాట చెల్లుబడిగాని అబలగా అయిపోయింది

రాత్రి ఎనిమిది గంటలకుగాని కాంతారావు ఇంటికిరాలేదు. అంత ఆలస్యంగా వచ్చినా, లక్ష్మి అడగలేదు. కాంతారావుకీ ఆమెను పలుకరించాలని లేదు. పలుకరించనూ లేదు...

భోజనం దగరేవచ్చింది పేచీ. అరగంట కూర్చున్నాడు సోఫాలో; ఆమె పలురించలేదు ప్రేగులు అరుస్తుంటే కాంతారావుకు పట్టరాని కోపంవచ్చింది ఏంచేస్తాడు, ఆమె సహాయ నిరాకరణ చేస్తున్నప్పుడు తను స్వయంగా వడ్డించుకోగలడు. కాని, తన లెక్చరర్ హోదా అడ్డంవచ్చింది.

చేసేది లేక అతను పెదవులు కదిలించాడు "లక్ష్మి! భోజనమన్నా వడ్డించు..." అతని మాటల్లో దీనత్వం వున్నట్టు కనుపించినా, కోపం, కఠినత్వం దాగి వున్నాయి.

ఆమె ముఖం త్రిప్పుకోకనే జవాబిచ్చింది, తనకు భోజనం అవసరములేదని. కాంతారావు మళ్ళీ అందుకున్నాడు. "లక్ష్మి! పరిస్థితిని విషమింపచేస్తున్నావు నేనెంతో మంచివాణ్ణి గనుక సరిపోయింది...మర్యాదగా. అన్నం పెట్టు... లేకపోతే పర్యవసానం ఆలోచించుకో..."

లక్ష్మి తగేరకం కాదు అలా అయితే పరిస్థితి అంత ఉన్నతస్థాయికి వచ్చేది కాదు; బెదురు లేకుండా అంది. "నాకేం పనిలేదు_ నేనువడ్డించను. అవసరముంటేహోటల్ కు పొండి..."


"కారణం?" తెలిసే అడిగాడు. ఆమె నోటినుండి వినాలని.

"మీరు నాకు ఇవ్వవలసిన గౌరవం ఇవ్వటంలేదు; ప్రతివిషయంలోనూ కించపరుస్తున్నారు..."

"చీర తేలేదనేనా ఈరభసంతా...సరేలే ఎన్నాళ్ళో కానీయి. నేనుమాత్రం తెచ్చేది లేదు ... నిక్కచ్చిగా చెపుతున్నాను..." కాంతారావు కోపం వెళ్ళగక్కాడు. కోపంవస్తే ఎంత అతిగా పోవాలో అంత పోతాడు. లక్ష్మిమాటలు అతన్ని రెచ్చ కొట్టినాయి తన లెక్చరర్ అధికారం. క్లాసులోనే కాదు, ఇల్లాలి పైకూడా చెల్లాలని అతని పట్టుదల.

"మీ బెదిరింపులకు నేను భయపడను... నాకూ ఆత్మాభిమానం వుంది" లక్ష్మి ఉద్రేకంతో అంది.

"లక్ష్మి! మాటలు కొంచెం జాగ్రత్తగా



"ఏ ఆఫీసు పనివాళ్ళయినా మా ఆఫీసు పనివాళ్ళముందు బలాదూరేనంటే నమ్మండి! వాళ్ళు నన్ను ఎంత క్షుణ్ణంగా అరం చేసుకున్నారనుకున్నారు? ఏళ్ళ తరబడి పనిచేస్తూ కూడా ఒక్కసారైనా నోరెత్తి ఇంక్రిమెంటు అడిగినపాపాన పోలేదు!"

★ కలహంలో కాంతారావు ★

రానీ...లేకపోతే..."

"అది మీరే గుర్తించాలి. మళ్లీ అంటున్నాను. నాకు ఆత్మాభిమానంవుంది, పసలేని హెచ్చరికలకు భయపడను..." లక్ష్మికి తను చదువుకున్న రోజుల్లో డిబేటుల్లో మాట్లాడిన వాక్యాలు గుర్తుకొచ్చాయి...

కాంతారావుకు కోపంముంచుకొచ్చింది. తను ఇంతవరకు ఎన్నడూ, అట్టి ప్రతిఘటన చూడలేదు. చివరకు కాలేజి స్టూడెంట్సు కూడా, తనంటే వణికిపోతారు. అట్టి తను ఒక అబలదగిర చులకన అయ్యాడు.

అతని కుడిచెయ్యి ఆమె ఎడమచెంపపై టక్కునతగిలింది...జలజలకన్నీళ్ళురాలాయి. ఆమెకు ఉక్రోషం ఉప్పెనలా త్రోసుకొచ్చింది. దెబ్బ తగిలిన బాధకంటె, అవమానంవలన బాధ ఆమెకు భరించరానిదిగా వుంది. చెంపమీద చేయి వాలిందని కాదు. తన ప్రతిపత్తి కించపరచబడిందని ఆమె ఆవేదన, ఆవేశం...

లక్ష్మి పెదవులు వణకుతున్నా... "...నేను ఆడదాన్ని గనుక కొడతారు... కాని అది మీకు గల పశుత్వాన్ని మాత్రం తెలియజేస్తుంది..." ఆమె కంటినీరు వరదలై పారింది.

"లక్ష్మీ! మళ్ళీ చెపుతున్నాను. ఇలా పెంకిగావుంటే నా యింటిలో వుండటం... కుదరదు...అది ఆలోచించుకో..." కాంతారావు ఉన్నతస్థాయిలో మొదలెట్టాడు...

"నేనూ అదే అనుకుంటున్నా... నాకు గౌరవంలేని యింటిలో ఒక్క క్షణం వుండను." ఆమె, మాటల్లో తగ్గేరకం కాదు...

ఆరాత్రిఅంధకారంగా గడచిపోయింది...

ఉదయాన్నే తయారయింది లక్ష్మి తన వస్తుసామగ్రి సర్దుకొని, పెట్టె అంతా నింపుకొంది. కాంతారావు ఆమెను గమనించనట్లు నటిస్తున్నా, కొంచెం కలతపొందేడు, పరిస్థితి విషమిస్తోందని.

పెట్టె పట్టుకొని బయలుదేరుతూ... 'వెళతాను' అంది లక్ష్మి. "సంతోషం..." కాంతారావు సాక్షిగా అన్నాడు ... కాని మనస్సు బాధపడింది ... లక్ష్మికి అంతే; కాని స్వభావాలు తగేరకం కాకపోవటంతో ఫలితం, కానవచ్చిందిగాదు...

లక్ష్మి ఎక్కడకు వెడుతోందో, వేరె చెప్పనవసరంలేదు.

ఆ తరవాత కాంతారావు కొంచెం సంతోష పడ్డాడు. తన అధికారాన్ని ధిక్కరించగల సామర్థ్యం ఎవరికి వుండదని, వుండకూడదని. అతని నమ్మకం...అది అక్షరాలా నిజమయింది.

మొదటిరోజు వంటరిజీవితం వయ్యారంగా వుంది. ఇంటికి తాళంపెట్టి, హాయిగా హోటల్లో భోంచేసి, కాలేజికి పోయాడు. రాత్రి సినిమాకు వెళ్ళివచ్చి, మత్తుగా నిద్రించాడు—ప్రతిరోజూ అలానే తేలిగా వుంటుందని అతని నమ్మకం...

లక్ష్మి దగ్గరనుండి ఉత్తరం వస్తుందని, తలచాడు. కాంతారావు. కాని రెండు రోజులు అయినా, అదేం జరగలేదు...... అదోలా బాధపడ్డాడు అతను. లక్ష్మి నిరక్ష్యంగా వుందని దృఢపరచుకున్నాడు...

మూడురోజులకుగాని అతనికి ఇంటిబాధ అర్థం అవలేదు...ఇలు వూడ్చకపోవటంలో దుమ్ము అరడుగు ఎత్తున పేరుకుంది. ఇంట్లోకి రావటానికే అతనికి భయమేసేది...ఇక హోటలు భోజనం ఎంత కష్టంగా వుందో, అతనిముఖం చూస్తేనే తెలుస్తుంది. క్రొత్త బియ్యపు అన్నం కడుపునొప్పి తెచ్చింది. అశుభ్రంగావుండే హోటలు గుర్తుకొచ్చినప్పుడల్లా, వళ్ళు జలదరించేది నీళ్ళు తనే తోడుకోవాలి. అన్నీ తనే. లక్ష్మి అవసరం కొంతవరకు గుర్తుకొచ్చింది. పోనీ మామగారికి ఓఉత్తరం రాస్తే.ఛా! తన అంతస్తును తను కించపరచుకోవడమా! తనే ముందు దిగజారితే ఇహ లక్ష్మికి పట్టపగాలువుంటాయా! తనకు పూచిక పుల్ల యినా విలువ వుంటుంది!

లక్ష్మికూడా, అక్కడ మొదటిరోజుల్లో సంతోషపడింది. కాని ఆమెకు తర్వాత అర్థమయింది. తనకు వసతుల్లో లోపం లేదు...కాని ఏమిటో అంతా వెలితిగా కనిపించింది! తనకు తానే నొచ్చుకుంది. తొందరపడినందుకు ఉత్తరం వ్రాస్తారేమో అని చూసింది. పాపం ఏలా వున్నారో! తెలవారుతూనే కాఫీ ఎక్కడనుండి వస్తుంది. తను చేసే రుచికరమైన సాంబారు ఎక్కడ దొరుకుతుంది. కొస్తంత బాధపడింది లక్ష్మి, కాని ఆమెకు స్వతహాగానే వుంది. పెంకితనం. తను లొంగరాదనుకుంది. తనేముందు, బయటపడితే, ఇక గడ్డిపోచకు గల విలువైనా తనకు వుండదనుకుంది.

కాంతారావు కొంచెం అనారోగ్యంగా వుంటున్నాడు హోటలు భోజనము రుచించక పోయేసరికి, భోజనం మానేసి, రొట్టె పాలు, తీసుకొంటున్నాడు.

ఒకరోజు వెంకట్రావ్ కాంతారావు ఇంటికివచ్చాడు...ఆ దుమ్ము చూసేసరికి దిమ్మతిరిగింది కాలు పెట్టటానికి వీలులేనంత దుమ్ము...అసహ్యంగా ఎక్కడ చూసినా వస్తువులే...ఇదరూసోఫాలో కూర్చున్నారు.

వెంకట్రావ్ సిగరెట్టు వెలిగిస్తూ "ఏమోయ్! పెద్దసత్రంలావుంది. మీ ఆవిడ పేకేమిటి" అన్నాడు.

కాంతారావు నోరు పనిచేయలేదు. కాని సర్దిచెప్పాడు. పుట్టింటికెళ్లిందని—

"హోటల్లో భోజనం ఏమంత బాగుండలేదోయ్! చాలాబాధగా వుంది..." కాంతారావు మాటలు కలపటానికి ప్రయత్నిస్తున్నాడు—

"అయితే మా యింటికి రా! ఆమె వచ్చేదాకా అక్కడనే భోంచేద్దువుగాని"

"ఇంకా నయం..."

"ఏమిటోయ్! వస్తే ఏముంది...... హోటలో నీవు కాబట్టి తింటున్నావు... అయితే ఎన్నాళ్ళు అయిందేమిటి వెళ్లి..."

వెంకట్రావ్ వదిలేరకం కాదు...

"ఒక వీక్ అయింది..."

"వెళ్లి, తీసుకురాకూడదూ..."సిగరెట్ పీక పారవేస్తూ, వెంకట్రావ్ అన్నాడు. కాంతారావు గతుక్కుమన్నాడు. తనకథ అతనికి తెలియలేదు గదా! మాట్లాడకుండా ఏవో ఆలోచిస్తున్నాడు.

"ఏమన్నా, పేచీ రాలేదుగదా!" తన 'సైకాలజీ' నైపుణ్యం ప్రదర్శించాడు వెంకట్రావ్.

అతను మళ్ళీ మౌనంగా వున్నాడు. అసలు విషయం వెంకట్రావ్‌కు చెప్పాలని, మనస్సు

(47-వ పేజీ చూడుడు)

తారుమారు

శశికుమార్ హోటల్లో కూర్చుని కాఫీ త్రాగుతున్నాడన్నమాటే కాని అతని మనస్సు మనస్సులో లేదు. అతడు పద్మను ప్రేమించాడు. కాని ఆమె ప్రేమను పొందేదెలా? హఠాత్తుగా అతని బుర్రలోకి ఏదో ఆలోచన వచ్చింది. దాంతో పాటే ఒక చిరునవ్వుకూడా అతని పెదవులమీద తాండవించింది. వెంటనే కుర్చీలోంచి లేచి బిల్లు చెల్లించి హోటల్ బయటకు వచ్చాడు. ప్యాంటుజేబులోకి చేతులు పోనిచ్చి ఒక్కసారి మెడసారించి బజారుకేసి చూశాడు.

బస్సులు, సైకిళ్లు, రిక్షాలు, ఒకదాని వెంట ఒకటి వరుసగా పోతున్నాయి. నెమ్మదిగా కాలి రోడ్డుకు అడ్డంగా నడచి ఓ సందుగుండా నడక సాగించాడు.

ఇంతలో అతనికి కనుచూపు దూరంలో దారికి ఓ ప్రక్కగా కూర్చున్న వ్యక్తి కన్పించాడు. ఆ! యితడే తనపనికి కావాల్సినవ్యక్తి. సమయానికి దొరికాడని గబగబా అతని దగ్గరవెళ్ళి "ఏయ్! నీ పేరేమిటి?" అన్నాడు. వాడు ఖాకీ నిక్కర్ తెల్లని చినిగిన చొక్కా, ఎర్రటి కండువా వేసుకొని అచ్చం రౌడీలా వున్నాడు. శశి కుమార్ "ఏయ్!" అనగానే వాడి ప్రాణాలు పోయినంతపనైంది ఏ సి. ఐ. డి. యో రా వీడని.

"సార్! నా పేరు...నా పేరు...అబద్ధం సార్" అన్నాడు తడబడుతున్న గొంతుకతో. "అయితే అబద్ధం! నాకు ఒక చిన్న పని చేసిపెట్టాలి చేస్తావా?"

వాడు కొంచెం ధైర్యం తెచ్చుకుని "పనా పనిచెయుటం అంటే నాకు గిట్టదుసార్!" అన్నాడు.

"అదికాదు. నాకు చిన్న సాయం చెయ్యి. అందుకు కొంతడబ్బు ఇస్తాను"

"ఓ! అయితే చేస్తా. ఏమిటో చెప్పండి"

"ఏమీ లేదు" అంటూ అటు, యిటూ శశికుమార్ ఒకసారి పరకాయించిచూచి వాడి చెవిలో ఏదో చెప్పాడు.

"అదెలాకుదురుతుందిసార్! ఆఅమ్మాయి ఒప్పుకోకపోతే నే నేం చేస్తాను సార్?" అన్నాడు వాడు ఆముదం తాగిన ముఖం పెట్టి.

"అందుకు నేను వుపాయంకూడా కనిపెట్టాను. విను మరి చెప్తా."

మళ్ళీ చెవిలో ఏదో పరమ రహస్యం చెప్పాడు.

"సరేసార్ చేస్తా,"

"మరి ఎంత యివ్వమంటావ్?"

"ఓ వందరూపాయలు ఇప్పించండి."

"సరే అలాగే యిస్తాను."

"సార్! అడ్వాన్సు కొంతడబ్బు ఇప్పించండి."

"ఇదిగో యాభైరూపాయలు."

చుక్కా నాగేశ్వరరావు

"సార్! రేపు యీపాటికి యిక్కడికి వస్తా."

"ఏడ్చినట్లుంది. ముందు యీరోజు ఆ అమ్మాయిని చూపించనీ. ఆ తర్వాత రేపు ఆపని.."

"చిత్తం"

2

తెనాలి గాంధీపార్కు టవర్ క్లాక్ అప్పుడే సాయంత్రం ఆరుగంటలు కొట్టింది. పార్కుపక్క సందుపేవ్ మెంటుమీద శశి, అబద్ధం కూర్చున్నారు. ఇంతలో ఎత్తు మడమల బూట్లతోనూ వాలు జడతోనూ వయ్యారంగా నడచుకొంటూ ఓ అందమైన అమ్మాయి పార్కులోకి వెళ్ళింది. తదేక ధ్యానంగా చూస్తున్న శశికుమార్ ని "సార్! ఆమేనండి" అన్నాడు అబద్ధం. ధ్యానభంగమైన ఋషిలా మేల్కొని—"అవును అబద్ధం! ఇక తిరిగి వచ్చేప్పటికి రెడీగా వుం"డన్నాడు వాడితో.

ఇంతలో చీకటి నలుదైపులా వ్యాపించింది. పగలే ఆసందులో జనం అట్టే నడవరు. కాని పద్మ రోజూ సాయంత్రం ఈ దారిగుండానే పార్కులోకివస్తుంటుంది.

అప్పుడే పార్కునుండి పద్మయింటికి తిరిగి వెళ్తోంది. శశికుమార్—కర్తవ్యం నెరవేర్చమని అర్జునుడికి కృష్ణపరమాత్మ గీతలో బోధిస్తున్నట్లుగా అబద్ధానికి చెప్పి దూరంగా తొలగిపోయాడు.

ఆమె పేవ్ మెంటు దగ్గిరికి రాగానే బొడ్లోంచి కత్తితీసి "నీ నగలు యిస్తావా? ప్రాణం తీయమంటావా?" అని బెదిరించాడు అబద్ధం. పద్మ ఆ దెబ్బతో హడలిపోయింది. కేకలు వేయాలనుకొన్నా పీక మీదే పెట్టాడు కత్తి తప్పనిసరియై ఆమె నగలన్నీ యిచ్చింది. అవి మూటగట్టుకొని గబగబ దారిప్రక్కనున్న తోటగోడదూకి మాయంఅయాడు వాడు.

అతడు పోయాక "దొంగ దొంగ" అని

★ తారుమారు ★

పద్మ కేక వేసింది. "ఎవరూ? నీవా? పద్మా! ఏమిటి?" అంటూ శశికుమార్ రంగంలోకి దూకాడు.

"శశికుమార్! అదుగో! వాడే నా సొమ్ములన్నీ కాజేశాడు." అంటూ మసక చీకట్లో వస్తున్న ఆ బద్ధాన్ని వేలితో చూపింది.

"ఉండు వాడిపని చెప్తా"నంటూ గబగబా పరుగెత్తుకెళ్ళి వాణ్ణి పట్టుకొని "భేష్! నాటకం బాగా ఆడావు" అన్నాడు.

"సరే నా డబ్బు యివ్వండి వెళ్తా" అన్నాడు వాడు

"అదికాదోయ్! ఆమె ముందుకు నిన్ను తీసుకువెళ్ళి కొడ్తున్నట్లు నటిస్తాను. నీవు ఆ తర్వాత వెళ్ళవచ్చు."

"సరే!"

"ఇదిగో మిగిలిన యాభైరూపాయలు."

3

శశికుమార్ వాణ్ణి పట్టుకొని పద్మదగ్గరికి లాక్కొచ్చాడు "ఏంరా వెధవా! ఒంటరిగా ఆడపిల్ల వెళ్తుంటే ఇదేరా చేసేది?" అంటూ స్టంట్ హీరో ఫోజ్ లో చొక్కా చేతులు పైకిలాగి నాలుగు దెబ్బలు కొట్టాడు

వాడు "నాకు బుద్ధివచ్చింది బాబూ! ఇక ఎప్పుడూ యిలాంటి పని చేయను" అని బ్రతిమాలాడు'

"శశికుమార్! పోనీ వాణ్ణి. మనసొమ్ము యిచ్చాడుగా" అంది జాలిగా

"జాగ్రత్త. ఎక్కడైనా కనిపించావా డొక్క చీల్చివేస్తా. పో!" అంటూ గదమాయించాడు శశికుమార్.

"చిత్తం" అంటూ వాడు చీకట్లో మాయమయ్యాడు.

వాడు వెళ్ళిన తర్వాత పద్మ— "అమ్మయ్య! నీవే సమయానికి రాకపోతే నా నగలన్నీ పోయేవి శశికుమార్! యిన్నాళ్ళుగా నిన్ను అపార్థం చేసుకొన్నా క్షమించు" అన్నది.

ఇద్దరూ పద్మయింటికి చేరారు. అక్కడ కూడా ఆమె తన కృతజ్ఞత చెప్పింది.

లైట్ స్విచ్ ఆన్ చేసి సోఫాలో శశికుమార్ ని కూర్చొపెట్టి తను యింట్లోకి వెళ్ళి డ్రెస్ మార్చుకువచ్చింది ఇంతలో డ్రాయర్ పైనవున్న వారపత్రిక శశికుమార్ తిరగవేస్తున్నాడు. పద్మమాటవిప్పింది "వక్కసారిగా యీనగలు నావి కావే" అంది దాంతోపాటే ఓ కాగితం యిలా చదివింది.


"శశికుమార్! నీ నాటకంతోపాటు నేరుగా నేనూ ఒక నాటకం ఆడాను ఏమిటంటే నీవు చెప్పినప్రకారం ఆ అమ్మాయిని కత్తితో బెదిరించి సొమ్ములు కాజేశాను. అంతకుముందు మీరిచ్చిన అడ్వాన్సుతో కొన్ని గిల్టునగలు కొని వకమూటలో యీ తోటలో దాచాను. అసలు నగల మూట దాచి ఆ గిల్టునగల మూట నీకు యిచ్చాను.

ఇది చూసే మీ ప్రియురాలు మీకు దక్కదని నాకు తెలుసు అందుకు విచారిస్తున్నాను. అయినా మనలో మాట ప్రేమించని అమ్మాయిని నీవు యిలా చేయటం న్యాయమా? అసలు నా పేరు అబద్ధంకాదు. నేను చదువుకొన్నాను. ఉద్యోగం లేక నాటకాల్లో దిగాను. అయితే యిలాంటి పాత్ర అభినయించటం యిదే మొదటిసారి. ఆఖరిసారి కూడాను. హాయిగా మీవల్ల దొరికిన యీ డబ్బుతో సుఖంగా జీవితం గడుపుతాను.

ఇట్లు

'.........'

ఉత్తరం చదివి పద్మ కోపంతో తొక్కత్రొక్కిన త్రాచుపాములాగా లేచింది. వింటున్న శశికుమార్ రాతిబొమ్మలాగా సోఫాలో కూర్చుండి పోయాడు. టెలిఫోన్ హుక్ అందుకొని పోలీసు సేషన్ కి పద్మ కాల్ చేసింది. ★



లక్ష్మణరావు ఆరోజు ఉద్యోగంలో ప్రవేశించి ముందుగా మిత్రుడు కుదిర్చి పెట్టిన ఇంట్లో ప్రవేశించాడు. ఆరోజు సాయంకాలమే ఆయిల్లు తనకు పనికిరాదని తీర్మానించుకొన్నాడు. గాలి లేదు, వెలుతురు లేదు. పైడుకాలవ దుర్గంధంతో అవచ్చే కొంత గాలి ఇంట్లో ప్రవేశించి మనుష్యుల్ని బైటికి తరుముతుంది. వెంటనే వేరే ఇల్లు చూసుకోవడం ఉత్తమమని తోచింది. మిత్రుడు ఉద్యోగం తనకు అప్పగించి వెళ్లిపోయాడు; ఊళ్ళో ఇంకే స్నేహితులూ లేరు. ఎవరైనా కొంచెం పరిచయమైన తర్వాత వేరే ఇంటిని చూసుకోవచ్చునని నిశ్చయించుకొన్నాడు.

సాయంకాలం క్లబ్బుకు బయలుదేరాడు. క్లబ్బుకు వెళ్ళే రోడ్డు కిరువైపులా మంచి ఇళ్ళున్నాయి. వీటిలో ఏదైనా ఖాళీగా వుండకూడదూ! అనుకొన్నాడు. మంచి రచయితదగ్గర ఎవరైనా సంపాదకు లడిగితే ఇవ్వడానికి కథ సిద్ధంగా వుండనట్టే మంచివీధిలో మంచి ఇళ్ళు ఖాళీగా వుండవు కాబోలు అనుకొన్నాడు. సామాన్యుడైన రచయిత దగ్గర తిరిగివచ్చిన కథలు, ఎంతో మంది 'నమస్కారాలు' అందుకొన్న కథలు కోకొల్లలుగా పడివున్నట్లు, సందులలో గొందులలో పనికిరాని ఇళ్ళు కొల్లలుగా వుంటాయి?

క్లబ్బులో కొన్ని ఉత్సాహమున్న ముఖాలు. కొన్ని చప్పగావున్న ముఖాలు... కొన్ని 'సోమరి' గా వున్న ముఖాలు... ఎవరూ ఆకర్షించలేదతణ్ణి. కానీ అందరినీ అతడు ఆకర్షించాడు.

"ఓ మీరేనా సార్. ఈరోజు...ఆఫీసరుగా ప్రవేశించిందీ"

"ఓ మీరే నన్నమాట"

"నమస్తే రండి. తమ పేరండి..."

"తమ స్వగ్రామం..."

చాల ప్రశ్నలు వేశారు చాలమంది. జవాబులు విని తమతమ ఆటల్లో మునిగిపోయారు.

లక్ష్మణరావుకు చదరంగం చాల ఇష్టం. అయితే ఆ బల్ల ఖాళీగావుంది. 'ముందు సభ్యుడిగాచేరేద్దాం' అనుకొని 'కార్యదర్శి' అని గదిముందు రాసివున్న గదిలోకి వెళ్లాడు. అది గది కానే కాదు అది ఒక పొగ గొట్టం! గదంతా పొగ. హఠాత్తుగా బిగరగా నవ్వులు...రెండు నిముషాలు ఆగాడు.

"ఓ రండి సార్ ......ఎవరూ...... తమరూ..." అని ఒక గంభీరమైనగొంతు.

"ఇక్కడ కార్యదర్శిగా రున్నారాండి"

"ఓ... నే నే రండి..."

"నేను క్లబ్బులో చేరాలండి" అంటూ దగరకు వెళ్ళాడు. ముగ్గురు మనుష్యులు టేబిలుమీదకి కాళ్లు పెటుకుని తలలు, కుర్చీలమీద పెట్టకొని కూర్చుని సిగరెట్లు కాలుస్తున్నారు. అందులో సిగరెట్ నోట్లో కాకుండా వేళ్ళ మధ్య వుంచుకొని తీవ్రంగావున్న మనిషి కార్యదర్శి అని లక్ష్మణరావు గుర్తుపట్టాడు.

"కూర్చోండి" అనగానే కూర్చున్నాడు.

కూర్చుని తనెవరో చెప్పకున్నాడు. కార్యదర్శి, మిగిలిన ఇద్దరూ టేబిలుమీది నుంచి కాళ్ళు దించేశారు. కార్యదర్శికూడా సిగరెట్ ఎక్కడో పారేశాడు. ఈ కార్యదర్శికి, తనతో 'ఆఫీసు పని' విషయం చాల వుంటుందని వెంటనే పోల్చుకున్నాడు లక్ష్మణరావు.

"వెంటనే చేరండి సార్. మొదటి సారి రెండు రూపాయలు కట్టాలి. ఒకరూపాయి ప్రవేశ రుసుము, మరో రూపాయేమో ఈ నెలకు చందా...మరి..." ఇంకేం చెప్పాలో తోచలేదు కార్యదర్శికి.

"ఇప్పుడే చేరచ్చాండీ!" అనగానే—

"ఓ యస్...చేరండి సార్" అన్నాడు కార్యదర్శి. అని పైకిలేచి అలమరా నుంచి రసీదుపుస్తకం తీశాడు. డబ్బు ఇవ్వకముందే రసీదు రాయడం ప్రారంభించి, "తమ పేరు సార్?" అన్నాడు.

"లక్ష్మణరావు" అన్నాడు.

'ఎవరు లక్ష్మణుడు? ఊర్మిళ ఎక్కడ?' అంటూ రివటలా వుండి, తెల్లగా, ఉత్సాహంగా వున్న ఒక యువకుడు ఆ గదిలో ప్రవేశించాడు.

లక్ష్మణరావును చూసి—"ఎవరో అనుకొన్నా క్షమించాలండీ" అన్నాడు.

"దానికేం లెండి" అంటూ జేబులోనుంచి రెండు రూపాయలు తీసి కార్యదర్శి గారికిచ్చి రసీదు పుచ్చుకొన్నాడు.

లేచి "వస్తానండీ" అన్నాడు.

"ఇంతకూ మీకు ఏయే ఆటలు ఇష్టమో చెప్పారుకారు. పేకాటాడ్చాండీ?" అన్నాడు కార్యదర్శి.

"వచ్చుకానీండీ ఆడే అలవాటు లేదండీ. టెన్నిస్ ఆడుతాను గానీ కోర్ట్ వచ్చిన తర్వాత చేరుతాను ఈలోగా చదరంగం ఆడుతూ వుంటాను. చదరంగం ఆడేవాళ్ళు ఎవరూ వున్నట్టు లేరే?" అన్నాడతను.

"లేకేమండీ? నేనెనూ? రండి. నేనూ ఎవరూ లేరే అని చూస్తున్నా" అని గది వెలుపల వరండాలోకి వచ్చాడతను ఇద్దరూ చదరంగం వున్న బల్లదగ్గరకు వచ్చి కూర్చున్నారు.

ఒకరొకరు పరిచయం చేసుకున్నారు. ఆయువకుడి పేరు రామదాసు. తమకు రెండు లారీలున్నాయని, వాటిని అద్దెకు నడుపుతున్నారనీ, మరో వ్యాసంగమేమీ లేదనీ, చెప్పాడు రామదాసు.

ఒంటెలు, గుర్రాలు, ఏనుగులు రాజా, మంత్రీ...కదులుతున్నాయి కొన్ని మరణిస్తున్నాయి. ఆట సాగుతోంది. తను ఓడిపోతున్నట్లు లక్ష్మణరావు గ్రహించాడు. కానీ తనను చిన్నబుచ్చినట్లవుతుందేమోనని అతను తెలిసే, తనవాటితో అతని వాటిని చంపే అవకాశం కలిగించి, గెలిపించేశాడు. మరోఆట వేశారు. ఈలోగా అతను ఎక్కడ ఇల్లు కుదిరిందీ, ఎలావున్నదీ, భోజనం, పెళ్లి, బంధువులు...చదువు.. వగైరా అన్ని విషయాలూ లక్ష్మణరావుగురించి అడిగి తెలుసుకొన్నాడు.

"ఆఇలు నాకు తెలుసుగదూ! ఉత్తపనికిరాని వెధవఇల్లు. నాకు తెలుసులెండి. ఆ విషయం నాకొదలండి. మీకు ఫస్ట్ క్లాసయిన ఇల్లు చూసి పెడతాను. మీకు లేడిమో వుందాండీ? లేదూ...సరే...కొనేద్దాం లెండి. డబ్బు ఒకేసారి ఇచ్చేయాలని ఏం లేదు. వాయిదాలపద్ధతి నే కొనొచ్చు. ఈ ఊళ్ళో దోమలు చంపేస్తాయి. రాత్రికుని ద్రపోనీవు. దోమతెర తెచ్చుకున్నారుగదా! తీసుకురాకపోతే...ఫరవాలేదులెండి. నేను రేపు ఉదయం మావాడిచేత కుట్టించి పంపుతాను. ఇంకా మీ ఏనుగును చంపేశాను. మీ రాజుకు చెక్కిచ్చాను. కాచుకోండి..."

* * *

మరునాడు ఉదయం ఎనిమిదింటికల్లా రామదాసు లక్ష్మణరావు ఇంటి కొచ్చాడు.

"ఇంతత్వరలో ఇంటికొచ్చేమనిషి ఒకరు లభించడం ఎంతఅదృష్టం. మనిషి చాలా మంచివాడులా వున్నాడు. ఎవరికింపట్టింది తన బాగోగుల విషయం. ఇతను పాపం చాల శ్రద్ధతీసుకొంటున్నాడు. ఇలాటివారు వుండబట్టే ఇంకా ప్రపంచం ఇలాగ నిలబడి వుంది..." అనుకొన్నాడు. కూర్చోమని మర్యాదచేశాడు.

కాఫీఅదీ పూర్తయిందాండీ! మీకోసం క్లబ్ రోడ్ లో రెండు మంచిఇళ్ళు చూశాను. మీరు ఎప్పుడు వీలయితే అప్పుడువచ్చి చూసి మీకునచ్చిన ఇంట్లో చేరొచ్చు. ఆరెండూ [illegible]లేదూ అంటే, మాడో ఇల్లు చూపి[illegible]న్నాడు రామదాసు.

"అద్భుతం" అనుకొన్నాడు లక్ష్మణరావు. "ఇప్పుడే వెళ్ళి చూద్దామండీ. ఈ కొంపను ఎంత త్వరగా వదిలేస్తే అంత మంచిది. పదండి."

వెంటనే వెళ్ళి ఇళ్లుచూశారు. అందులో ఒకయిల్లు పూర్తిగా నచ్చింది లక్ష్మణరావుకు అందులో తనూ, తన భార్యా...ఇద్దరే... ఎంత హాయిగా వుండటానికి వీలుందో ఒకసారి సమగ్రంగా వూహించుకొన్నాడు. వెంటనే ఎడ్వాన్సిచ్చేశాడు.

"మీరు వెంటనే ఫామిలీ తెచ్చుకోవడం శ్రేయస్కరం. ఈ హోటల్లో తింటే, అన్యాయంగా పాడయిపోతారు...ఎప్పుడు తీసుకొస్తారు చెప్పండి. ఈలోగా ఒక మంచి పనిమనిషిని, పాలమనిషిని, పెరుగు మనిషిని, ఏర్పాటు చేసేస్తాను." అన్నాడు ఇంటికి తిరిగివస్తూ దారిలో రామదాసు.

"అన్నీ కుదరగానే తీసుకు రావాలనుకొంటున్నానండీ." అన్నాడు చాల ఆనందంతో లక్ష్మణరావు.

"మీరు ఇప్పుడు ప్రవేశించే ఇంటినుంచి ఆఫీసుకు చాల దూరమవుతుంది. సైకిలు లేకపోతే కొంచం కష్టంగానే వుంటుందనుకొంటాను" అన్నాడు రామదాసు.

"సైకిలు వూళ్లో వుందండీ. బుక్ చేసిపంపమని రాశాను. త్వరలోనే వచ్చేస్తుందిలెండి" అన్నాడు లక్ష్మణరావు.

"అంతవరకు మీకేమీ అభ్యంతరం లేక



పోతే నా సైకిలు వాడుకోవచ్చు. మీ దగ్గరే వుంచుకోండి దాన్ని. ఆ యిల్లు మాయింటికి దగ్గరేగా, ఎప్పుడైనా అవసరమైతే వచ్చి తీసుకొంటాను" అన్నాడతను.

'అద్భుతమైన మనిషి' అనుకొని "అ ఎందుకండీ ఇదేం దూరం కాదులెండి" అన్నాడు తను.

అతడు వినలేదు. దారిలో ఒక కుర్రాడిని పిలిచి ఇంటికివెళ్లి సైకిలు తీసుకొనిరమ్మని అప్పుడే చెప్పి పంపేశాడు. లక్ష్మణరావుకు ఏం చెప్పాలో తోచలేదు. ఇలాంటి పరిస్థితిలో వ్యక్తిత్వానికి భంగంరాకుండా ఎలా ప్రవర్తించాలో 'వ్యక్తిత్వము' అనే పుస్తకంలో రాసినవిషయాలు జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. చచ్చినా జ్ఞాపకం రాలేదు. కానీ అందులో 'ఇలాంటి మనుష్యులపట్ల చాలజాగ్రతగా వుండాలని, రాసినవిషయం మటుకు జ్ఞాపకంవచ్చింది!' ఏ ఉద్దేశంతో ఆవ్యక్తి, ఇలాంటి సహాయం చేస్తూన్నాడూ అని, ఆ ఎదుటవాడికి ఏమాత్రమూ, తను అనుమాన పడుతున్నట్లు అనుమానం కలగకుండా, జాగ్రతగా బోధపరచుకోనే ప్రయత్నం చేయాలి!

ఇద్దరూ ఇంటిదగ్గరికి వచ్చారు. "వస్తానండీ సాయంకాలం మళ్ళీవస్తాను. ఇల్లు మార్చేద్దాం" అంటూ రామదాసు చకచకా, ఆర్జెంటుగా నడిచి వెళ్ళిపోయాడు.

* * *



లక్ష్మణరావు ఊరుకువెళ్ళి భార్యను తీసుకువచ్చి కొత్తయింట్లో కాపురం పెట్టాడు. అన్ని సౌకర్యాలు కుదిరాయి. ఈ సందర్భంలో రామదాసుచేసిన సహాయం ఇంతా అంతా కాదు.

అన్ని కుదిరాయనుకొన్న తర్వాత పదిహేనురోజులు, రామదాసు ఊళ్ళోలేక కనిపించలేదు. ఒక ఆదివారంనాడు సాయంకాలం హఠాత్తుగా—

"లక్ష్మణరావుగారూ..." అంటూ ఇంట్లో అడుగుపెట్టాడు:

లక్ష్మణరావు చాలఆనందంతో రామదాసును లోపలికిరమ్మని కూర్చోపెట్టాడు. భార్య శారదనుపిలిచి "రామదాసుగారికి కాఫీఇవ్వు" అన్నాడు.

రామదాసు ఒకసారి వంటయిల్లు చూడాలన్నాడు. దంపతులతనికి వంటయిల్లు చూపించారు. శారద తను ఆ వంటగదిని ఎంత నేర్పుతో సరుకొన్నదీ, నిర్వహిస్తున్నదీ క్లుప్తంగా వివరించింది.

కానీ రామదాసుకు చాల లోపాలు కనిపించాయి. చిన్న చిన్న డబ్బాలు అవీ వుంచుకోవడానికి మంచి అలమరా లేదు. గిన్నెలు వగైరాలు తగిలించడానికి 'స్టాండు' లేదు. పాత్రలుంచుకోడానికి చిన్న అరుగు వంటిదిలేదు. ఇంకా చాల కనిపించాయి. ముఖ్యం, ఆ గది గచ్చంతా పోయింది. క్రింద మంచి సిమెంటు వేయిస్తేగాని బావుండదు.

"ఒక మంచిగోడ అలమరా, స్టాండు రేపు టౌన్‌నుంచి తెప్పించేస్తాను. ఈ ఇంటి యజమాని సాయంకాలం కనిపిస్తాడు. వెంటనే గచ్చు వేయించమంటాను. ఆ గదిని ఇంకా ఎంత బాగా తయారు చేయాలో అంత బాగానూ చేయించేద్దాం," అన్నాడు ఉత్సాహంతో రామదాసు.

లక్ష్మణరావు భార్య శారదకు చాల సంతోషం కలిగింది. 'ఊరు కాని ఊరులో తన భర్త, ప్రయోజకుడైన, సరసుడైన తన భర్త 'ఒక మంచి స్నేహితుణ్ణి' సంపాయించాడు!

రోజులు గడిచాయి. రామదాసు లక్ష్మణరావుకు ఆప్తమిత్రుడయ్యాడు. కానీ అతని లోపల "ఇతడు ఏ ఉద్దేశంతో స్నేహంగా వుంటున్నాడ" నే ప్రశ్న తొలగనేలేదు. అప్పుడప్పుడూ తనలో ఆ ప్రశ్న బాధిస్తూవుతున్నందుకు విచారిస్తున్నాడు కూడాను.


ఒక రోజు ఆఫీసులో పెద్ద గుమాస్తా దగ్గరగా వచ్చి చెప్పాడు.

"మీరు ఆయనతో స్నేహం చేయడం మంచిది కాదేమోసార్. తెలిసికూడా చెప్పకుండా వూరుకోవడం ధర్మం కాదేమో నని మీకు చెపుతున్నాను. అతడు ఇన్సూరెన్సు ఏజెంటు. మరికొన్ని వ్యాపార కంపెనీలకు కూడా ఏజెంటుగా వుంటున్నాడు. ఇంక

(55 వ పేజీ చూడండి)

మూగ నోము

కొడుకూ, కొత్తకోడలూ దీపావళి కింటికి వస్తారని ఎదురు చూస్తున్న పేర్రాజుకి ఆశాభంగ మయింది. కాని సూర్యం రాలేక పోవడానికి వ్రాసిన కారణమూ—తనకి ప్రమోషన్ రాబోతోందిట. అందుకని సెలవుని కొన్నాళ్ల వాయిదా వెయ్యడం న్యాయమనిపించిందిట—తను రావడానికి బదులు తల్లి దండ్రులే



బొంబాయి రావలసిందన్న కోరికా ఆయన విచారాన్ని పటాపంచలు చేసి హృదయాన్ని ఆనందంతో నింపేసేయి.

ఉత్తరాన్నింట్లోకి పట్టుకెళ్లి పేర్రాజు విషయమంతా భార్య బాపనమ్మతో చెప్పేడు. తర్వాత పంచాంగం చూసి ప్రయాణానికి ముహూర్తం నిర్ణయించేడు.

పేర్రాజూ, బాపనమ్మా పండుగ నాలుగురోజు లుండనగానే బొంబాయి చేరేరు. కొడుకు క్రొత్త కాపురాన్ని చూడడమనే

[illegible]

సరదాతోపాటు ఇదివరకెన్నడూ ఎరగని పట్టణం అనుభవాలు వారికెంతో ఆనందాన్నిచ్చేయి. సూర్యం వాళ్లని షికారు తీసుకెళ్లి, పట్టణంలోని వింతలూ, విద్యుద్దీపాలంకరణ సన్నాహాలూ చూపించేడు. ఇంటిదగ్గర కోడలు బాపనమ్మగార్ని చీపురుపుల్లంత పనయినా ముట్టుకోనియ్యకపోవడం మూలాన్న ఆమె రోజుల్ని మహారాణీలాగ గడిపింది.

నరక చతుర్దశినాడు సూర్యం ఆఫీసుకి వెళ్తూంటే, బాపనమ్మగారు పండుగనాడాఫీసేమిటని ఆశ్చర్యంగా అడిగింది. బొంబాయిలో ఆఫీసులకు దీపావళినాడూ మర్నాడూ సెలవులనీ, అందుచేత ఈవేళ ఆఫీసుందనీ సూర్యం చెప్పేడు.

“పండుగపూటా పని చేసి, పండుగెళ్లిన మర్నాడు సెలవిచ్చు కోవడ మేమిట్రా?” అందావిడ.


"ఇక్కడ దీపావళికి ముందురోజుకంటె, దీపావళి మర్నాడు పెద్ద పండుగ లే." అన్నాడు. సూర్యం "ఆవేళ గుజరాతీ వాళ్లకి నూతన సంవత్సరాది."

"కార్తీక మాసంలో సంవత్సరా దేమిటో, విడ్డూరం!" అంది బాపనమ్మగారు. "సరే, ఎవళ్ల పండుగలూ వ్రతాలూ వాళ్లవి. కాబోసు!... అన్నట్లు వ్రతాలంటే జ్ఞాపక మొచ్చింది. మణిచేత ఈయేడు మూగ నోము మొదలెట్టించాలి."

కోడలివైపు తిరిగి, "ఎంత పట్టణ్ణంలో ఉన్నా, ఏటా చేతిపద్మం నోము మానకూడదు, పిల్లా. తెలిసిందా!" అని హెచ్చరించింది.

తనకా నోము మానుకునే ఉద్దేశమే లేదనీ, పైగా వాళ్లమ్మగారు దాని పద్ధతంతా చెప్పే పంపేరనీ అంది మణి.

దీపావళి రోజు హాయిగా గడిచిపోయింది 'మణి తయారుచేసిన పిండివంటల భోజనంతో, రాత్రికి సూర్యం తల్లిదండ్రులకి చూపించడానికి క్రొత్త క్రొత్త రకాల బాణాసంచా తెచ్చేడు. భార్య లిద్దరూ, "ఏమిటండీ ఆ కుర్రతనం?" అంటూన్నా, వినిపించుకోకుండా పేర్రాజూ సూర్యం అవన్నీ కాల్చి ఆనందించేరు.



మర్నాటి సాయంత్రం మూగ నోము తతంగం బోలెడుంది కనుక వంట సంగతి తను చూస్తానంది బాపనమ్మగారు. మణి తన డబ్బా తులసికోట దగ్గర పూజ ప్రారంభించింది. అన్నం వండడ మయ్యాక బాపనమ్మగారి కో సమస్య వచ్చింది. కూర పోపుకి నూనెక్కడుందో ఆవిడకి కనబడలేదు. కోడలి నడిగింది. కాని మణి అప్పటికే తులసి ప్రదక్షిణాలు పూర్తిచేసి మౌనముద్ర ధరించేసింది. అత్తగారి ప్రశ్న కెల్లాగ సమాధానం చెప్పాలా అనుకుంటుంటే ఆమెకో ఉపాయం తట్టింది. తులసిమొక్క పాతి ఉన్న డబ్బాకేసి చూపించి, బాపనమ్మగారికి సంజ్ఞ చేసింది. ఆవిడ ఖర్జూరపు చెట్టు బొమ్మ ఉన్న ఆ పచ్చడబ్బాని గుర్తుంచుకుని, వంటింట్లోకి వెళ్లి అల్లాంటి డబ్బా విప్పి చూసింది. అందులో ఉన్నది డాల్డా వనస్పతి. కాని ఆవిడకి 'డాల్డా' సంగతి తెలియదు. కనక ఆ 'క్రొత్త' సరకుని వాడడాని కావిడ సంకోచించింది. అయినా, మణి రోజూ వాడే సరకుని తనొక్క పూట వాడితే పోయిందేమీ లేదనుకుని దాంతోటే వంట పూర్తి చేసింది. కాని మణి రాగానే, నూనెకు బదులిదేదో సరుకు వాడుతూన్నందుకు కూకలెయ్యాలని నిశ్చయించుకుంది.

ఇంతట్లో మణి పొరుగింటి ముత్తయిదువకి బొట్టుపెట్టి వచ్చింది. మిగతా నోము తతంగం పూర్తిచేసుకున్నారప్పటికి. అత్తగారు ప్రశ్నల వర్షం కురిపించేసింది. ఆ డబ్బాలోని సరుకేమిటి? శుభ్రంగా నూనె వాడుకోకుండా ఇల్లాంటి క్రొత్త సరుకేదో వాడి రోగాలు తెచ్చుకోవడ మెందుకు...?

"అత్తల్లు అజ్జలు పెట్టేటి వేళ!" అన్న నోము పాటలోని పాదం జ్ఞాపకం వచ్చింది మణికి.

బాపనమ్మ ప్రశ్నలన్నిటికీ ఆమె వినయంగా, తాపీగా సమాధాన మిచ్చింది.

"అదేమీ క్రొత్త సరుకు కాదండి ముప్ఫై ఏళ్లకి పైగా జనం వాడుతూన్న డాల్డా వనస్పతి అది. 'డాల్డా' వాడితే రోగాలూ దగ్గూ వస్తాయనుకోవడం వట్టి అపోహ. నిజాని కది పుష్టికరమూ ఆరోగ్యకరమూను. శుభ్రంగా నూనె వాడమంటారు. కాని 'డాల్డా' ఎంత శ్రేష్ఠమో చూడండి. నూనెలలో లేని 'ఏ' విటమినులూ, 'డి' విటమినులూ అనే పదార్థాలని 'డాల్డా'లో కలుపుతారు. అవి శరీరాన్ని రోగాలు రాకుండా కాపాడేటందుకూ, ఎముకలూ, పళ్లూ దృఢంగా పెంచడానికీ అవసరం.

"పైగా 'డాల్డా' వంటలన్నిటికీ దివ్యంగా వాడుకోవచ్చునని వేరే చెప్పనక్కర్లేదు. పండుగ పిండి వంటలేగాక పలహారాలకి ఉప్మా, పెసరట్లూ, ఇంకా కూరల వేపకాలూ, పోపులూ, అన్నిటికీ నేను 'డాల్డా'యే వాడుతాను. గత నాలుగు రోజులలోనూ రుచి చూసినవారు మీరే చెప్పండి 'డాల్డా' రుచికరమానో కాదో."

"వంటలన్నీ విశేషంలాగ ఉన్నాయమ్మాయ్!" అంది బాపనమ్మగారు. "కాని అవన్నీ 'డాల్డా'తో చేసేవంటే ఆశ్చర్యంగా ఉంది. మొదట ఆ డబ్బాని చూసినప్పుడే నువ్వేదో ఫేషను కోసం తెచ్చిన సరుకని, వాడ్డానికి సందేహించేను."

"అమ్మెప్పుడూ 'డాల్డా'యే వాడుతుంది. ఆ అలవాటే నేనూ చేసుకున్నాను." అంది మణి. "ఒకలాగ చూస్తే అది ఫేషనే అనుకోండి. కాని అర్థమూ, ప్రయోజనమూ ఉన్న ఫేషను ఆరోగ్యకరమూ, పొదుపూ అయిన ఫేషను."

అంతట్లో సూర్యం ఇంటికి వచ్చేడు. "మణి మూగనోము పట్టలేదా ఏమిటి, తెగ మాట్లాడేస్తోంది." అన్నాడు.

"మూగనోము అయిపోయిందండీ, మీ అమ్మగారికి డాల్డా వనస్పతి సంగతి చెప్తున్నాను." అంది మణి.


"మరే, బాగా నచ్చచెప్పింది," అంది బాపనమ్మగారు. అసలా విషయం ఎలా ప్రస్తావనకి వచ్చిందో చెప్పి "ఇంటికి వెళ్లాక నేను కూడా 'డాల్డా' వాడకం మొదలెడతాను." అంది.

"భేష్," అన్నాడు సూర్యం. "కాని 'డాల్డా' డబ్బా అంటే పైనో ఖర్జూరపు చెట్టు బొమ్మ, లోపల తులసిమొక్క ఉన్న డబ్బా అని జ్ఞాపకం ఉంచుకోకు!" అన్నాడు నవ్వుతూ.

"అబ్బే, ఖర్జూరపు చెట్టు బొమ్మ మాత్రమే గుర్తుంచుకుంటాలే." అంది బాపనమ్మగారు. "కాని, డాల్డా వనస్పతిని గురించి తులసి మొక్క దగ్గిర మా కోడలు మూగ నోము నాడు తెలుసుకున్నా నన్న సంగతి మాత్రం మరిచిపోను."

హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ బొంబాయి.

DL. 442B-X52 TI



[ఆదిపర్వము — తృతీయాశ్వాసము]

క. అనుపమనియమాన్వితు లై, యనూనదక్షిణలఁ గ్రతుసహస్రంబులు సే
సినవారికంటె నక్రో,ధనుఁడు గరం బధికుఁ డండ్రు తత్త్వవిధిజ్ఞుల్.

క. అలిగిన నలుగక యెగ్గులు, వలికిన మఱి వినని యట్లు ప్రతివచనంబుల్
వలుకక బన్నమువడి యెడఁ, దలఁపక యున్నతఁడ చూవె ధర్మజ్ఞుఁ డిలన్.

వ. కావున బుద్ధి గలవారికిఁ గ్రోధంబు గొనియాడం దగదు శర్మిష్ఠ రాచకూఁతురు గొండుకయది దానితోడి దేమి ర
మ్మనిన దేవయాని యిట్లనియె.

క. కడు ననురక్తియు నేర్పును, గడఁకయుఁ గలవారి నుఱక కడవఁగ నెగ్గుల్
నొడివెడు వివేకశూన్యుల, కడ నుండెడునంతకంటెఁ గష్టము గలదే.

వ. ఈవృషపర్వుపురం బేను జొర నొల్ల నెటయేనియుం బోదు ననిన శుక్రుండు నాకు నీవ గతివి నీతోడ నేనును వత్తు
ననుచుఁ గూఁతుం బట్టువఱుచు చున్నంత నంతయుఁ జారులవలన నెఱింగి వృషపర్వుండు శుక్రు నొద్దకు వచ్చి
నమస్కరించి యిట్లనియె.

ఉ. దేవతలన్ జయించుచు న తిస్థిరసంపదలం ద్వదీయవి
ద్యావిభవంబు పెంపునను దానవు లుద్ధతు లైరి కాని నాఁ
డీవనరాశిలోఁ జొరరె యింతకు నంతకకోపు లైన య
ద్దేవపతాకినీపతుల దివ్యనిశాతమహాయుధాహతిన్.

క. వారణఘోటకభాండా,గారంబులు మొదలు గాఁగఁ గలధనములతో
సూరినుత యిందఱము నీ,వారకములుగాఁగ మమ్ము వగవుము బుద్ధిన్.

శర్మిష్ఠ దాసియై దేవయానిం గొలుచుట

వ. ఈదేవయాని కెద్ది యిష్టంబు దానిన యిత్తు నడుగు మనిన దేవయాని సంతసిల్లి యప్లేని శర్మిష్ఠఁ గన్యకాసహస్రం
బుతో నాకు దాసిగా నీవలయు నిదియ నాకిష్టంబు దీనినయిచ్చునది యనిన వృషపర్వుం డప్పు డక్కూఁతు రావించి
కన్యకా సహస్రంబుతో దేవయానికి దాసిగా నిచ్చి శుక్రునకు మనఃప్రియంబు సేసిన శర్మిష్ఠయు నగ్గురువచనంబునఁ
గన్యకా సహస్రంబుతో నిత్యంబును దేవయానిం గొలుచుచుండె నంత నొక్కనాఁడు,

క. వనకేళీకౌతుకమునఁ, జనియెను శర్మిష్ఠఁ దొట్టి సఖు లెల్ల ముదం
బునఁ గొలిచి రాఁగ విభవము, దన కమరఁగ దేవయాని తద్వనమునకున్.

వ. ఇట్లరిగి దేవయాని యవ్వనంబునఁ గన్యకలుం దానును బుష్పాపచయంబు సేయుచు విమలజలప్రవాహవిలసితం బైన
యొక్క సెలయేటికెలన నవవికచకుసుమసుకుమార కోరకనికరభరిత సహకార కురవక వకుళాశోక తమాలసాల
చ్ఛాయాశీతలసికతాతలంబున నిష్టవినోదంబుల నున్నయవసరమున.

సీ. అంగనాజనులయుత్తుంగసంగతకుచ, కుంకుమచందన పంకములయు
వారివ ధమ్మిల్ల భారావకలితది,వ్యామోదనవపుష్పదామములయు
వారివ ముఖసకర్పూరతాంబూలాది, వాసనాసురభి నిశ్శ్వాసములయు
వారివ పరిధానచారుధూపములయు, విలసితసౌరభావలులు దాల్చి

తే. యనిలుఁ డను దూత వాయి తోడ్కొనియుఁ దెచ్చె
దేవయానిపాలికి మృగ తృష్ణఁ జేసి
కాననంబునఁ గ్రుమ్మరు వాని వీరు
నతిపరిశ్రాంతుఁ డైనయయాతి నంత.

క. తరళనయనాబ్జదళములు, నెరయఁగఁ బై మున్ను చల్లి నృపసుతుఁ బూజిం
చిరి నవకుసుమయుతాలం, కరణవిశేషముల నచటి కాంతలు ప్రీతిన్.

యయాతి మహారాజు దేవయానిని వివాహంబగుట

వ. అయ్యయాతియుఁ దత్ప్రదేశంబున సుఖోపవిష్టుండై దేవయానిం దొల్లి యెఱింగినవాఁడై యతిశయరూపలావణ్య గుణసుందరి యయిన శర్మిష్ఠ నెఱుంగ వేఁడి మీ రెవ్వరివారలు మీకులగోత్రనామంబు లెఱుంగ వలతుం జెప్పుం డనిన రాజునకు దేవయాని యిట్లనియె

తే. నన్ను మున్న యెఱుంగుదు విన్నాతి నాకు, దాసి వృషపర్వుఁడను మహా దానవేంద్రు
కన్యఁ నాయొద్ద నెప్పుడు గదలకుండు, ననఘ మఱి దీని శర్మిష్ఠ యంద్రు జనులు.

ఉ. నిగ్రహ మేది నన్ను ధరణీవర కూపము వెల్వరించునాఁ
డుగ్రమయూఖసాక్ష్యముగ నున్నతదక్షిణపాణిఁ జేసి భూ
పాగ్రణి నాదుదక్షిణకరాబ్జము వట్టితి కాన మున్న పా
ణిగ్రహణంబు సేసి తది నీయెడ విస్మృతిఁ బొందఁ బాడియే.

ఉ. నన్ను వివాహమై నహుషనందన యీలలితాంగిఁ దొట్టియీ
కన్నియ లందఱుం దివిజ కన్యలతో నెన యైనవారు నీ
కున్నతిఁ బ్రీతి సేయఁగ నృపోత్తమ వాసవుఁ బోలి లీలతో
నిన్నరలోకభోగము లనేకము లందుము నీవు నావుడున్.

వ. క్షత్రియకన్యకల బ్రాహ్మణులు వివాహం బగుదురు గాక యధర్మోత్తరంబుగా క్షత్రియులు బ్రాహ్మణకన్యకల వివాహం బగుదురే నీపలుకులు ధర్మవిరుద్ధంబులు మఱియు సర్వవర్ణాశ్రమధర్మంబులు సంకరంబులుగా కుండ రక్షించుచున్న యేన యిట్టి యధర్మంబున కొడంబడితినేని జగత్ప్రవృత్తి విపరీతం బగుననిన నయయ్యాతికి దేవయాని యిట్లనియె

క. వెలయఁగ ధర్మాధర్మం,బులు నడపుచు నిఖిలలోకపూజ్యుం డై ని
ర్మలుఁ డగుశుక్రుఁడు పంచిన, నలఘుభుజా నను వివాహ మగుదే యనినన్.

వ. అమ్మహాముని వచ్చి యిది ధర్మవిరుద్ధంబు గా దని చెప్పెనేని నిన్ను వివాహంబగుదు నని యయాతి యొడంబడిన దేవయాని యప్పుడుశుక్రు రావించిన.

క. తన దివ్య తేజమున నవ్వన మెల్ల వెలుంగుచుండ వచ్చెను భృగునం
దనుఁడు నిజనందనకుఁ బ్రియ, మొనరింపఁగఁ దలఁచి దానియొద్దకుఁ బ్రీతిన్.

క. అతిసంభ్రమమున నవనీ,పతి విహితోత్థానుఁ డై తపశ్శక్తిఁ బ్రజా
పతినిభుఁ డగుభార్గవునకు, నతిభక్తిం బ్రణమితోత్తమాంగుం డయ్యెన్.

వ. మఱియు దేవయానియు శర్మిష్ఠయుం గన్యకాసహస్రంబును నత్యంతభక్తితోఁ గ్రమంబున నమస్కరించి రంత దేవ యాని శుక్రున కి ట్లనియె.

ఆ. ఇన్నరేంద్రుచేత మున్న గృహీతనై, యున్ననాకరంబు గ్రన్న నింక
నొరున కర్హ మగునె పరిణయవిషయమై, ధరఁ బరిగ్రహింపఁ బరమమూర్తి.

వ. కావున నాకు నీ జన్మంబునఁ బతి యయాతియ యితండును భవద్వచనంబున నన్ను వివాహం బగుదు ననియె నిందు ధర్మవిరోధంబు లేకుండునట్లుగాఁ బ్రసాదింపవలయు ననిన శుక్రుండు గరుణించి యయాతికి నీకును నయిన యీవివాహంబునం దపక్రమదోషంబు లే కుండెడు మని వరం బిచ్చి యయ్యిరువురకుం బరమోత్సవంబున వివాహంబు సేసి శర్మిష్ఠం జూపి యిది వృషపర్వునికూఁతురు దీనికిం బ్రియంబున నన్నపానభూషణాచ్ఛాదన మాల్యానులేపనాదుల సంతోషంబు సేయునది శయనవిషయంబునఁ బరిహరించునది యని పంచి కూఁతునల్లునిం బూజించిన నయ్యయాతియు శుక్రుని వీడ్కొని దేవయానిని శర్మిష్ఠను గన్యకాసహస్రంబును దోడ్కొని నిజపురంబు

నకుం జని యంతఃపుర రమ్యహర్మ్యతలంబున దేవయానిని నుచితదనుమతంబున నశోక వనికాసమీపంబున నొక్క గృహంబునందుఁ గన్యకాసహస్రంబుతో శర్మిష్ఠ నునిచి దేవయానియందు సుఖోపభోగపరుండై యున్నఁ గొండొక కాలంబునకు దేవయానికి యదుతుర్వసు లనుకొడుకులు పుట్టి రంత శర్మిష్ఠ సంప్రాప్తయౌవనయు ఋతుమతియునై యాత్మగతంబున.

చ. అనదృశయౌవనం బిది యనన్యధనం బగునొక్కొ నాకు ని
క్కుసుమసముద్గమంబును నగోచరదుర్గమదుర్గవల్లరీ
కుసుమసముద్గమం బగునొకో పతిలాభము లేమిఁ జేసి యొ
ప్పెసఁగఁగ దేవయాని పతి నేమితపం బొనరించి కాంచెనో.

క. పతిఁ బడసి సుతులఁ బడయఁగ, నతివలు గోరుదురు గోరినట్టుల తనకుం
బతిఁ బడసి సుతులఁ బడసెను, నతులితభార్గవికి భాగ్యసంపద యెనయే.

తరువోజ. ఈరాజునంద నా హృదయంబు దవిలి యెప్పుడునుండు నన్నీతఁడుగరము
కారుణ్యమునఁ బ్రీతిగలయట్లు సూచుఁ గమలాక్షి భార్గవ కన్యదా నెట్లు
గోరి యీతనిఁ దనకును బతిఁ జేసికొనియె నట్టుల యేనుఁగోరి లోకైక
భారధురంధరుఁ బరహితధర్మపరు నహుషాత్మజుఁ బతిఁ జేసికొందు.

యయాతి శర్మిష్ఠకుఁ బుత్త్రదానంబు సేయుట

వ అని విచారించుచున్న యవసరంబున దాని పుణ్యస్వరూపంబు సన్నిహితంబై నయట్లొక్కనాఁడు యయాతి యశోక వనికాలోకనతత్పరుండై వచ్చువాఁ డేకతంబ యున్న శర్మిష్ఠంగనిన నదియును సంభ్రమవినయావనతయై తనవలన నమ్మహీపతిప్రసన్నచిత్తుం డగుట యెఱింగి కరకమలంబులు మొగిచి యి ట్లనియె.

ఉ. నీలగళోపమాన కమనీయగుణోన్నతిఁ జెప్పఁ జాలున
న్నేలిన దేవయానికి నరేశ్వర భర్తవు గాన నాకునుం
బోలఁగ భర్త వీవ యిది భూనుత ధర్మపథంబు నిక్కువం
బాలును దాసియుఁ సుతుఁడు నన్నవి వాయని ధర్మముల్ మహిన్.

వ. అద్దేవయానిం బరిగ్రహించినప్పుడు తద్ధనంబగుట నేనును భవత్పరిగ్రహంబ కావున నన్నుం గరుణించి నాకు ఋతుకాలోచితంబుఁ బ్రసాదింపవలయు ననిన నయ్యయాతి యి ట్లనియె.

క. లలితాంగి శయన మొక్కఁడు, వెలిగా రుచిరాన్నపాన వివిధాభరణా
దుల శర్మిష్ఠకు నిష్టము, సొలయక చేయు మని నన్ను శుక్రుఁడు పంచెన్.

వ. ఏ నమ్మహాముని వచనంబున కప్పు డొడంబడితి నెట్లు బొంకనేర్తు ననిన శర్మిష్ఠ యి ట్లనియె.

క. చను బొంకఁగఁ బ్రాణాత్యయమున సర్వధనాపహారణమున వధగా వ
చ్చినవిప్రార్థమున వధూ, జనసంగమమున వివాహ సమయములందున్.

వ. ఈయేనింటియందు ననత్యదోషంబు లేదని మునివచన ప్రమాణంబుగలదు నీవు వివాహసమయంబున నొడంబడితివి కావున ననత్యదోషంబు నిన్నుఁ బొంద దనిన నయ్యయాతి యొడంబడి శర్మిష్ఠకు నభిమతం బొనరించెనదియుఁ దత్సమాగమంబున గర్భిణి యై కొడుకుం గనిన విస్మయం బంది దేవయాని దానికడకు వచ్చి యి ట్లనియె.

తే. బాల వయ్యు నత్యుత్తమ శీలవినయ, గౌరవాన్విత వై నిర్వికారవృత్తి
నున్ననీ కున్నయునికిన నన్నుతాంగి, సుతుఁడు పుట్టుట యిదిగడుఁ జోద్యమయ్యె.

వ. అది యె ట్లని యడిగిన శర్మిష్ఠ లజ్జావనతవదన యయి యిట్లను నెందేనినుండి యొక్కమహాముని నిఖిలవేదవేదాంగ పారగుండు వచ్చి ఋతుమతినైయున్న నన్నుం జూచి నాకుఁ బుత్త్రోత్పత్తిఁ బ్రసాదించె ననిన విని దేవయాని నిజ నివాసంబునకుం జనియె శర్మిష్ఠయు నయ్యయాతివలనం గ్రమంబున ద్రుహ్యానుపూరులనంగా మువ్వురుగొడుకులం బడిసి యున్నంత నొక్కనాఁడు.

సీ. కరువలిచేఁ దూలుకపిలజటాలియ, కర మొప్పుశిఖలుగాఁ గనకరత్న
మయజాలభూషణా మలదేహదీపుల, తేజంబుగాఁ బవిదీప్యమాన

యాగశతంబుల నర్చితం బై నమూఁ డగ్నులు ప్రత్యక్షు లైనయట్లు
దనర మోల శర్మిష్ఠ తనయులు గ్రీడించు, చుండంగ నున్నయయ్యుర్వీశుని

ఆ. కడకు నేఁగుదెంచెఁ గన్యలు దనుజాధి, రాజసుతయుఁ దోడ రాఁగ నొప్పి
దేవి దేవయాని దేవేంద్రుదేవియ,పోలె నెంతయును విభూతి మెఱసి.

వ. ఇట్లరుగుదెంచి యధిక తేజస్వు లయి యయాతిప్రతిరూపంబులుం బోనియబ్బాలకులం జూచి యిక్కుమారు లెక్కడివా రెవ్వరికొడుకు లని యయాతి నడిగి యలబ్ధప్రతివచన యై మీతల్లిదండ్రు లెవ్వ రని యక్కుమారుల నడిగిన.

క. తరుణప్రదేశినుల మా,సరముగ వారలు యయాతి శర్మిష్ఠలఁ జూ
పిరి తండ్రియుఁ దల్లియుఁ నని, కర మనురాగిల్లెఁ గన్యకానివహంబున్.

వ. ఇట్లు ద న్నెఱుంగకుండ నయ్యయాతి శర్మిష్ఠవలన లబ్ధసంతానుండగుట యప్పు డెఱింగి.

చ. పతివిహితానురాగమున భార్గవపుత్త్రి యయాతిచేత వం
చిత యయి వాఁడు దానవికిఁ జేసిననెయ్య మెఱింగి కోపదూ
ఖిత యయి తండ్రిపాలి కతిఖేదమునం జని దీర్ఘనేత్రని
ర్గతజలధారలం గడిగెఁ గాంత తదీయపదాబ్జయుగ్మమున్.

శుక్రుఁడు యయాతికి శాపం బిచ్చుట

వ అయ్యయాతియు దానిం బట్టువఱచుచుఁ దోడన చని శుక్రుంగని నమస్కరించి యున్న నద్దేవయాని గద్గదవచన యై యధర్మంబున ధర్మంబు గీడ్పఱిచి యిమ్మహీశుం డాసురంబున నాసురియం దనురక్తుండై పుత్త్రత్రయంబువడసి నాకవమానంబు సేసె ననిన విని శుక్రుండు యయాతి కలిగి నీవు యౌవన గర్వంబున రాగాంధుండ వై నాకూతున కప్రియంబు సేసితివి కావున జరాభార పీడితుండవు గ మ్మని శాపం బిచ్చిన నయ్యయాతి శుక్రున కి ట్లనియెఁ.

క. ఋతుమతి యై పుత్త్రార్థము, పతిఁ గోరినభార్యయందుఁ బ్రతికూలుం డై
ఋతువిఫలత్వము సేసిన, నతనికి మఱి భ్రూణహత్య యగు నండ్రు బుధుల్.

క. దానికి భీతుఁడ నై య, మ్మానవతీప్రార్థనం గ్రమం బొనరఁగ నం
తానము వడసితి నెదలో, దీనికి నలుగంగఁ దగునె దివ్యమునీంద్రా.

వ. ఏ నిద్దేవయానియందు విషయోపభోగతృప్తుండఁ గాను జరాభారంబుఁ దాల్పనోపనని ప్రార్థించిన విని వానికిశుక్రుండు గరుణించి యట్లేనినీముదిమి నీకొడుకులయం దొక్కరునిపయింబెట్టి వానిజవ్వనంబు నీవుగొని రాజ్యసుఖంబు లనుభవింపుము నీవు విషయోపభోగతృప్తుండవైన మఱి నీముదిమి నీవ తాల్చివాని జవ్వనంబు వానికి నిచ్చునది నీముదిమిఁ దాల్చిన పుత్త్రుండ రాజ్యంబున కర్హుండును వంశకర్తయు నగు ననిన నయ్యయాతి శుక్రు వీడ్కొని దేవయానీ సహితుండై తనపురంబునకు వచ్చి శుక్రశాపంబున జరాభారంబుఁ దాల్చిన వానికి.

క. తల వడఁకఁ దొడఁగె నింద్రియ,ములగర్వ మడంగె నంగములు వదలె వళీ
పలితంబు లయ్యె వగరును, దలయేరును నుక్కిసయును దలకొనుదెంచెన్.

వ. ఇట్లు జరాక్రాతుం డైనయయాతి గొడుకుల నెల్ల రావించి నాకు విషయసుఖతృప్తి లే కున్నయది గావున మీయం దొక్కరుండు నాముదిమి గొనితనజవ్వనంబు నాకిచ్చునది యనిన విని యదుతుర్వసుద్రుహ్యవ్యనులు దండ్రి కిట్లనిరి,

ఆ. తగిలి జరయు రుజయు దైవవశంబున, నయ్యెనేని వాని ననుభవింత్రు
గాకయెఱిఁగి యెఱిఁగికడఁగి యారెంటిఁ జేకొందురయ్య యెట్టి కుమతులైన.

క. నరలు గలకాము నైనను, దరుణులు రోయుదురు డాయ ధనపతియయ్యుం
బురుషుఁడు దుర్వారజరా,పరిభూతి నభీష్టభోగ బాహ్యుఁడ కాఁడే.

వ. అని యొడంబడ కున్న నలిగి యయాతి యదువంశంబునవారు రాజ్యంబున కయోగ్యులుగాఁ దుర్వసువంశంబునవారు ధర్మాధర్మవివేకశూన్యులై సంకీర్ణవర్ణ కిరాతులకు రాజులుగా ద్రుహ్యువంశంబునవా రుడుపప్లవసంతార్యంబై నదేశంబునకు రాజులుగా జరాదూషకుం డగుట ననువంశంబునవారు ముదియు నంతకు నుండక జవ్వనంబుననపంచత్వంబున కరుగువారునుంగా శాపం బిచ్చి యానలువురకుం గొండుకవాని శర్మిష్ఠాపుత్త్రుఁ బూరుంబిలిచి యడిగినవాఁడు దండ్రికోరినయట్లచేసిన నవయౌవనుండై యయాతి యభిమతసుఖంబులు సహస్రవర్షంబు లనుభవించి తృప్తుండై. పూరుజవ్వనంబు వానిక యిచ్చి తనజరాభారంబుఁ దాన తాల్చి నిజాజ్ఞావిధేయచతురంతమహీతల బ్రహ్మక్షత్త్రాదివర్ణముఖ్యుల నెల రావించి మంత్రి పురోహితసామంతానంత పౌరజనసమక్షంబున సకల క్షోణీచక్రసామ్రాజ్యంబునకుఁ బూరు నభిషిక్తుం జేసిన సర్వప్రకృతిజనంబు లారాజున కి ట్లనియె.

★



మనిషిలాగా మనిషి

(నాటకం)

ప్రఖ్యా శ్రీరామమూర్తి

పాత్రలు : రఘు, ఉమేష్, శేఖర్, సుజాత, సరళ, గురవాచారి, ఒక నాటకసమాజం సభ్యులు. రంగడు...రఘుయింట్లో కుర్రాడు. పి. సి. వందనం...పోలీస్ కానిస్టేబులు. మీనాక్షి...రఘు భార్య.

సూచన : మొదటి అంకం నాటకం తాలూకు అని ప్రేక్షకులకు తెలియరాదు గనుక పాత్రధారులు పరస్పరం పిలుచుకోవడంలో నాటక పాత్రలపేర్లనే—అంటే రఘుకు బాబీ అనీ, ఉమేష్‌కు రమేష్ అనీ, శేఖర్‌కు రాజా అనీ, గురవాచారికి వీరభద్రయ్య అనీ, సుజాతకు సరళకు లిల్లీ, రాణీ అనీ వాడతారు.

ఒకటో అంకం : నాటకం

* * *

దృశ్యం : మద్రాసులో ఒకానొక నాటకశాల రంగస్థలం.

సమయం: రాత్రి 7 గంటలవేళ.

రంగస్థలం పారిస్ లాంటి ఒక నవనాగరిక మహానగరంలోని భవనంలా అలంకరించబడి వుంది. చుట్టూ గోడలనిండా అనేక చిత్రపటాలూ, కార్టూన్లూ వ్రేలాడదీసి వుంటాయి.

ఎడమపక్కమూల ఒక ఈజిల్, దానికి అటుపక్క ఒక చిన్న టేబులు-ఇటు స్టూలు వుంటాయి. టేబులుమీద చిత్రరచన కుపయోగించే పెన్సిళ్ళు, పెయింట్లు, కుంచెలు మొదలైన సామగ్రి అంతా వుంటుంది. చూడంగానే అది ఒక ఆర్టిసు యింట్లో స్టుడియో హాలు అని అర్థం అవుతుంది.

ఎదర ద్వారం బైటనుంచి మార్గం. పక్కన డైనింగ్ రూంలోకి, ఎడమపక్కన పడకగదిలోకి ద్వారాలుంటాయి. హాలులో ఒక సోఫా, మరో టేబులు, రెండు మూడు కుర్చీలు కూడా వుంటాయి.

తెర లేచేసరికి నాటకం జరుగుతోంది.

ఆర్టిస్ట్ శంకరరావు (బాబీ) వేషంలో రఘు శీర్షాసనంలో నిమగ్నుడై—92, 93, 94, 95 అని లెక్కపెడుతూ వుంటాడు. ఇంతలో ఎదర గుమ్మందగ్గర బెల్ మోగుతుంది. రఘు వినిపించుకోడు. బెల్ మళ్ళీ మోగుతుంది. దాని వెనువెంటనే ఉమేష్ 'రేడియో కమర్షియల్' రిప్రజెంటేటివ్ రమేష్‌దత్తు వేషంలో లోపలికి వస్తాడు. చేతిలో hand microphone — వైరుతో సహా వుంది. మనిషి నీటుగా వుంటాడు. టకప్-నిగనిగలాడే ఫ్రెంచ్ షూజ్.]

ఉమేష్ : గుడీవెనింగ్, సర్.

[రఘు పలకడు. ఒంట్లు లెక్కపెడుతూనే వుంటాడింకా. ఉమేష్ ఆశ్చర్యంతో అతనివంక కాస్సేపు తేరి పారజూసి, మళ్ళీ పలకరిస్తాడు] క్షమించండి....

[రఘు : నూరు పూర్తిచేసి మామూలుగా నిలబడతాడు. ఉమేష్‌ని గుర్తించలేక కాస్త సందేహంగా చూస్తాడు...]

రఘు : గుడీవెనింగ్ ...ఫరవాలేదురండీ... యోగాభ్యాసంలో వున్నప్పుడు ఏం మాట్లాడరాదు. అందుకని మీరు రింగ్ చెయ్యంగానే పలకలేకపోయాను.

ఉమేష్ : క్షమించండి సార్-మిమ్మల్ని నేను డిస్టర్బ్ చేసినట్టున్నాను...

రఘు : ఫరవాలేదు కూర్చోండీ.

[కొత్తమనిషితో ఏం మాట్లాడటానికీ తోచక, ఏ పనీ లేకపోయినా రంగుల అట్ట కుంచె చేతపట్టుకుని ఈజిల్ మీదవున్న అసంపూర్ణ చిత్రానికి రంగులు పూస్తూ కూనిరాగం తీస్తుంటాడు. ఉమేష్‌కూడా పలకరించడానికి కాస్త సంకోచించి, రిస్ట్‌వాచీ చూసుకుని కాస్త తొందరపాటుతో అంటాడు-]

ఉమేష్ : గంట ప్రకారమే మీరు స్టేషనులో వుండాల్సింది—

రఘు : (అదిరిపడి) స్టేషనా? నేనేం చేశానని...?

ఉమేష్ : అబ్బే- పోలీస్ స్టేషన్ కాదండీ నేను రేడియో కమర్షియల్ రిప్రజెంటేటివ్‌ని. మై నేమీజ్ రమేష్‌దత్. ఇవ్వాళ మీతో ఇంటర్వ్యూ 7-20కి రికార్డ్ చేస్తామని ఎంగేజ్‌మెంట్ ఫిక్స్ చేసుకున్నాం. మర్చిపోయారా?

రఘు : (జ్ఞాపకంవచ్చి) అరెరె-నాకసలు సంగతే గుర్తులేదు. అయామ్‌సో సారీ. ఇంకా పెద్ద గంద్రగోళంలో పడిపోయాను...

ఉమేష్ : విచారించకండిసార్ మరేం ఫరవాలేదు. మీ కోసం కాస్సేపు చూసి ఇహ మేమే బయల్దేరి వచ్చాం. సౌండ్ వేన్ వీధిలో వుంది. ఇంటర్వ్యూ ఇక్కడే రికార్డ్ చేస్తాం.

[అంటూ కిటికీ దగ్గరకుపోయి వైరు కిందికి జారవిడుస్తూ కేక పెడతాడు—]

ఓహోయ్—అబ్బాయిలూ—కనెక్ట్ చేసుకోండిరా.

రఘు : (బెదురుతూ) అహాహా—వుండండుండండి—నన్నేం మాట్లాడమంటారిప్పుడు? నాకిలాంటివెప్పుడు అలవాటు లేదు కూడాను—

ఉమేష్ : ఇందులో ఏముందిసార్ పెద్ద. నేనేవో నాలుగు ప్రశ్నలడుగుతాను—మీరు జవాబులుచెప్తే సెయ్యండి-అంతే!

రఘు : ఏం జవాబులు చెప్పాలో యేమిటో—...

ఉమేష్ : (చిరునవ్వుతో) అంత చిక్కు ప్రశ్నలేం వెయ్యనుగా నేను.

రఘు : నేను తడుముకున్నా...నోరు పెగలక—

ఉమేష్ : మరీ మంచిది! రిహార్సల్సు వేసుకున్న ఇంటర్వ్యూలా వుండదు.

రఘు : ఈ సంగివిధవ రిహార్సల్సు కునైనా మాట్లడకూడదా అని అనుకోరు జనం?

ఉమేష్ : ఇది రికార్డింగ్ మాత్రమేసార్ మీకు నచ్చకపోతే మళ్ళీ మొదలెట్టవచ్చు.

[వీధిలోంచి కారు హారన్ వినిపిస్తుంది]

ఆఁ-వాళ్ళు రెడీ. మొదలెడదామా మరి.

[ఉమేష్ మైక్ ముందు చిటికెవేసి చూసుకొని, గబగబా మాట్లాడతాడు.

రఘు ఏమీ అనలేక అతనివంక చూస్తుంటాడు.]

ఫైవ్ — ఫోర్ — త్రీ — టు — వన్. హలో లిజనర్స్!... శ్రోతలకు నమస్కారం! మాట్లాడుతున్నది రేడియో కమర్షియల్ రమేష్ దత్. ఇన్నాళ్లూ మీ అభిమాన సినిమా నాటక కళాకారుల పరిచయాన్ని మీకు కలిగించిన నేను ఇవ్వాళ మరో ప్రముఖ కళాకారుణ్ణి మీ దగ్గరకు తెస్తున్నా. వీరి పేరు శంకరరావుగారు. వీరికళ చిత్రకళ. ప్రతిరోజూ ప్రతి పేపర్లోనూ ప్రతి మాగజైన్‌లోనూ అన్నిటికంటె ముందు మీ దృష్టి నాకర్షించి మిమ్మల్ని ఆనందింపజేసే విచిత్ర చిత్రాలు, కార్టూను— చూట్టానికి వినోదకరంగా కనిపిస్తూనే హృదయాల్ని కలచివేసే దారుణ విషాదమూర్తుల్ని రచించే 'బాబీ' ఈ శంకరరావుగారేనని మీలో చాలామందికి తెలీదు! 'బాబీ సంసారం', 'బొంబైలో బాబీ', 'బాబీతో బజారుకు' మొదలైన వ్యంగ్య చిత్రాలు — ఇంతెందుకు— ప్రతి మనిషిలోనూ అంతర్లీనంగా వున్న అమాయక మానవత్వానికి పీడిత దిగ్భ్రాంత ప్రజాకోటికి చిహ్నంగా చిరస్థాయిగా నిలిచే 'బాబీ'ని సృష్టించింది ఈ శంకరరావుగారే! గాలిలో దీపంలా, నడిసముద్రాన పడవలా, మింట రెక్క విరిగిన పక్షిలా ఏటి కెదురీదుతున్న అమాయక బాబీని చూస్తుంటే గమ్యం లేని నేటిమానవకోటివ్యర్థ ప్రయాస నిస్సహాయత కళ్లకుకట్టి, హాస్య కరుణ విషాదాలొక్కసారిగా



★ మనిషిలో మనిషి ★

ముచ్చరిగొనని మానవు డెవడూ వుండడు!... 'బాబీ' — ఇహనుంచీ శంకరరావుగార్ని వారి సంకేతనామమైన 'బాబీ' అనే పిలుస్తాను—ఇప్పుడు బాబీ మీ ముందున్నారు—మీతో మనసు విప్పి మాట్లాడటానికి సిద్ధంగా వున్నారు—

[రఘుకి మైక్ అందివ్వబోతాడు – రఘు భయంతో వణికిపోతూ తల అడ్డంగా వూపుతాడు. ఉమేష్ మైక్ లోకి—]

కాని — బాబీ మాట్లాడేముందు మీకో హెచ్చరిక! బాబీ మీ వూహలకి చాలా భిన్నంగా వుంటాడు. నిజానికి ఆయన కంఠస్వరంకూడా మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది.

[రఘు తీవ్రంగా మళ్ళీ తల అడ్డంగా వూపుతాడు.] ఆఁ హాఁ హాఁ–అంటే బాబీ వయోవృద్ధుడనీ మాట్లాడటం చేతకాదనీ కాదు... అసలిక్కడ ఇలా నిలబడ్డ బాబీని చూస్తూంటే నిజమైన మేధా సంపత్తికి వయస్సుతో నిమిత్తం లేదనిపిస్తుంది.

[రఘు మళ్ళీ మొహమాటపడతాడు]

బాబీ మొహమాట పడుతున్నారు. ఈ క్షణంలో మీరు బాబీని చూడగలిగితే చాలా బాగుండేది–దువ్వెన్న కూడా లొంగని జుట్టు–నల్లని కళ్ళు–చాలా తీయని చిరునవ్వు—

[రఘు కొంత భిడియంతో ముసిముసి నవ్వులు నవ్వుతాడు]

తీర్చిదిద్దిన సుందర(దూ)పమూ! అసలు బాబీ తెల్సుకుంటే సినిమాహీరో—

[రఘు ఇప్పటి దాకా పొగిడింది చాల్లే ఆపమని సౌజ్ఞచేస్తాడు]

బాబీ నా గొడవ ఆపమంటున్నారు— ఇహ ఆయన మాట్లాడతారట!

[మైక్ రఘుకి అందిస్తాడు. రఘు బెదురుగా ఓ అడుగు వెనక్కి వేస్తాడు. ఉమేష్ మైక్ చేతో్త్త యూసి—]

మాట్లాడరూ?

[రఘు తల అడ్డంగావూపుతాడు. ఉమేష్ మైక్ లోకి—]

క్షమించండి—బాబీతో మాట్లాడుతున్నాను—నే నడగబోయే ప్రశ్నల్ని గురించి వర్రీ అవుతున్నారు పాపం. చాలా సహజమైన ప్రశ్న ఒక్కటి అడుగుతానాయన్ని...ఏమండీ—అసలు మీ పేరు శంకరంపుగారు కదా—మరి బాబీ అని ఎందుకు పెట్టుకున్నట్టు?

[మైక్ రఘు నోటి ముందుపెట్టి మాట్లాడమని బలవంతం చేసాడు]

రఘు: ఆఁ—ఆఁ—అబ్బే...అందులో పెద్ద విచిత్ర మేమీ లేదండీ. మా ఆయా నన్ను చిన్నప్పుడు తల్లక్రిందులుగా పడేసింది.

ఉమేష్: ఊఁ హూఁ.

రఘు: సరిగా తల్లకిందులుగా అవునో కాదోగాని మొత్తానికి పడేసింది. దెబ్బ తల మీద తగిలి వుండాలి. తలమీద బుడిపె కూడా ఒకటి వుండేది–ఈ మధ్యనే చాలా వరకు కరిగిపోయింది. తడిమి చూస్తే ఇంకా చేతికి తగులుతుంది.

ఉమేష్: నిజం? [రఘు ఉమేష్ చెయ్యి తీసుకుని తలమీద పెట్టి చూపుతాడు.]

రఘు: ఆఁ–అదుగో–అదే!

ఉమేష్: అవునవును.

రఘు: అది సంగతి.

ఉమేష్: ఏది?

రఘు: అదే–నాకు బాబీ అనే పేరు ఎలా వచ్చిందీనూ.

ఉమేష్: అదే ఇంకా చెప్పలేదు మీరు.

రఘు: ఓ–కుక్క పిల్ల సంగతి వదిలేసినట్టున్నాను.

ఉమేష్: కుక్కపిల్లా?

రఘు: అవును. చిన్నప్పుడు నాకు బాబీ అని కుక్కపిల్ల ఒకటుండేది. ఆయా నన్ను నన్ను తల్లకిందులుగా పడేసినప్పట్నుంచీ కుక్కపిల్లను శంకరం అనీ, నన్ను బాబీ అని పిలవాలని పట్టుబట్టాను.

ఉమేష్: అలాగా! (విరగబడి నవ్వుతాడు) ఆ తల్లకిందులుగా పడ్డప్పుడుగాని ప్రపంచం మీకు సవ్యంగా కనిపించలేదన్నమాట! (ఇంకా నవ్వుతాడు)

రఘు: (సగం చచ్చి) నే చెప్పలా–ఒట్టి దద్దమ్మలా మాట్లాడుతున్నట్టున్నాను. ఇప్పుడు రికార్డు చేసిందంతా చెరిపెయ్యండి–మళ్ళీ మొదలెడదాం.

ఉమేష్: (నవ్వుతూ) నో నో మిస్టర్ బాబీ! సరే–పెద్దయిన తర్వాత కూడా ఆ పేరే కంటిన్యూ చేశారన్నమాట!

రఘు: ఊఁ.

ఉమేష్: బైదివే, హలో లిజర్స్! నేను ఇంట్లోకి ప్రవేశించేసరికి మన చిత్రకారుడు తల్లకిందులుగా నిలబడి తపస్సు చేస్తూ వున్నారు–ఎవరికోసమో మరి!

రఘు: ఆఁ–అహాఁ–అబ్బే–తపస్సు గాదు–నే కోరిగిన అమ్మాయి–

ఉమేష్: ఓ! అమ్మాయికోసమా!

రఘు: ఆ అమ్మాయికి యోగంమీద మంచి నమ్మకం—

ఉమేష్: ఓహో!

రఘు: మనయోగం యెల్లా వున్నా—

ఉమేష్: ఓసారి ట్రై చేద్దామనుకున్నారన్నమాట!

ఉమేష్: వింటున్నారా? ఒక అమ్మాయి కోసం ఆమె సంతృప్తికోసం బాబీ తల్లకిందులుగా తపస్సు చేస్తున్నారట!...మరి దేవి ప్రసన్నం...

రఘు: చూశారా—మళ్ళీ తెలివితక్కువగా మాట్లాడినట్టున్నాను. నేను చేసేది తపస్సు కాదు—శీర్షాసనం చేస్తున్నా. తల, మీద బొప్పి కరిగిపోతుందని లిల్లీ చెప్పింది.

[లిల్లీ వేషంలో సుజాత, వీధిగుమ్మంలోంచి ప్రవేశిస్తుంది]

హలో లిల్లీ!

ఉమేష్: (అటు తిరిగి చూసి) ఓహ్ వ్వాట్ ఏ బ్యూటీ లేడీస్ అండ్ జెంటిల్‌మెన్! విడిపోయే మబ్బుతునకల వెనకనుంచి గుమ్మరించుకొచ్చిన శ్రావణ పున్నమి వెన్నెల్లా అందం చిందిస్తున్న అపూర్వ లావణ్యవతి—ఇప్పుడే అడుగు పెట్టింది లోపలికి! ఇందాక ఏమో అనుకున్నాగాని– ఈ అమ్మాయికోసమే ఐతే బాబీ తల్లకిందులుగా తపస్సు చెయ్యడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు!...ఈవిణ్ణి ఎక్కడో చూసినట్టున్నాను... ఎస్! మీరంతా కూడా చూసిన మనిషే! ఈ మే–ఈ విడే–బాబీ వేసే ప్రతి బొమ్మలో ఆయన గీసే ప్రతి రేఖలో ఆయన ప్రతి కుంచె విసురులోనూ మూర్తీభవించే సౌందర్యం ఈమే! ...విల్లంబులాంటి కనుబొమలు ... విశాల వినీల నయనాలు ... చిరునవ్వు చిందే పెదవులు...ఇక్కడే వుంది. The Muse–The inspiration of Babı is here! ఆమె కూడా మిమ్మల్ని పలుకరిస్తుంది.

[మైక్ ఆమె ముందు పెడతాడు]

సుజాత: (మైక్ లోకి) హలో!

ఉమేష్: Thank you, Thank yon Miss Lilly.

ఆఁ—ఇహ బాబీని ఇంకో ప్రశ్న వేద్దాం...ఏమండీ – మీరిప్పుడు తలపెట్టిన పెద్ద పను లేమైనా వున్నాయా?

రఘు: ఇప్పుడా?

ఉమేష్: ఎవరివైనా పెద్దవారి బొమ్మలు– ప్రెసిడెంట్ గారివిగానీ—ప్రైం మినిస్టరు గారివిగానీ—

రఘు: (కొంత సందేహించి, సుజాత కేసి ఓసారి చూసి, హఠాత్తుగా ఉమేష్ చేతిలోంచి మైక్ లాక్కుని మాట్లాడుతూ ఆమె దగ్గరగా వెళ్తాడు) ladies and gentlemen మీ రింతకుముందు విన్న కోకిలస్వరం నా ప్రియమిత్రురాలు లిల్లీది! ఆమెను వెంటనే వివాహమాడటమే నే చెయ్యదలచుకొన్న పెద్దపని! ఆలస్యం ఏమాత్రం లేదు. ఇంకో అరగంటలో మా పెళ్ళి అయిపోయినట్లే!

సుజాత: (ఆశ్చర్యపడి) what?

రఘు: అందులో నా స్వార్థం ఏం లేదులేండి. ఆమెని సంతోష పెట్టడానికే!

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25 న.పై

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 50
6-8-58

Founder : K. NAGESWARA RAO

విలంబి శ్రావణ బహుళ షష్ఠి బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
సినీనటి సావిత్రి
—ఫోటో : సోమయాజులు

గమనిక

గతవారం సంచిక, మొదటిపుటలో చిత్రం వేసినవారు: ఎమ్. ధనలక్ష్మి—మద్రాసు అని గ్రహింప ప్రార్థన.

రఘు : (మైక్ ఆమె ముందుంచి) మళ్ళీ అను.

సుజాత : (మైక్ లోకి) what ?

రఘు : (మైక్ లోకి) ఈ what అనే మనిషి వుంది చూశారూ ఈమె నా ప్రేయసి లిల్లీ ! పెళ్ళి సంగతి ఈవిడే ఎరగనట్టుందే మని మీ రేం హడావుడి పడకండి—నా పెళ్లి ప్రపోజలు ఆమెకుకూడా ఇప్పుడే తెలిసింది లిల్లీ తో ఒంటరిగా వున్నప్పుడైతే ఈ సంగతి ఆమెకి చెప్పనేలేక పోయేవాణ్ణి. కానిచుట్టూ మీరంతా వుంటూండగా వింటూండగా చెప్పడం చాలా తేలికనిపిస్తోంది. ఎప్పుడూ అనుకోడానికే నా సాహసించని సంగత్తులు కూడా నలుగురి మధ్యనైతే చాలా తేలిగ్గా అనెయ్యవచ్చు చూడండి.

ఊ మేష్ : (కొంచెం గాబరాగా) ష్.

రఘు: ష్ (మైక్ లోకి) ఐనా నేనిప్పుడు సంపూర్ణ ఏకాంతంలో వున్నట్టున్నాను—నామీద నాకే అంతులేని విశ్వాసం పుట్టుకొస్తోంది. అనంతమైన ఉద్వేగం ఏదో నన్ను ఊరేయెలలూగిస్తోంది. ఒంటరిగా రాత్రి పూట చుటుముటిన కమ్మతెమ్మరలూ ప్రజ్వల తారకలూ శ్రోతలుగా తనలో తాను తనకు తాను ఏమేమో మాట్లాడుకు నేకవిలా గా అనిపిస్తోంది నాకు Lad[1]es and Gentle men! మీ అదృష్టవశుకుం మీకు నాయందున్న అభిమానం నాకమితమైన ధైర్యాన్ని ఇస్తున్నై. (సుజాతకేసి వెళ్తూ) ఇహ నేను నా లిలీని సమీపించి ఆమె ముఖం లోకి ఆమె అగాధ వినీలనయనాల్లోకి సూటిగా చూస్తూ 'లిల్లీ ! నేను నిన్ను ప్రేమిస్తున్నా, నీతోటి వివాహం కాంక్షిస్తున్నా' అని ధైర్యంగా చెప్పెయ్యగలను...ఇంతకు ముందు చచ్చినా నాకీ ధైర్యం కలిగేది కాదు. ఇప్పుడు నా హృదయం ఆనందంతో గంతులు వేస్తోంది—మీరంతా నన్ను ఆశీర్వదిస్తారనీ నా ఆనందాన్ని మీరు కూడా పంచుకుంటారనీ ఆశిస్తున్నా. Thank you, Ladies and Gentlemen! (ఊ మేష్ తో) హమ్మయ్య. Not bad, I hope.

[ఊ మేష్ మైక్ వంక చూపుతాడు]

ఓహ్ (మైక్ చేత్తో మూసి) I am Sorry

ఊ మేష్ : (నవ్వుతూ) It Certainly was not bad ఎంత కొమ్ములు తిరిగిన భావకవికూడా ఇలా మాట్లాడలేడు (మైక్ తీసుకుని అందులోకి-) కంగ్రాచ్యులేషన్స్ బాబీ! నాతో బాటు శ్రోతలందరూ కూడా మిమ్మల్ని అభినందిస్తారనడంలో అనుమానం ఏమాత్రం లేదు Thank you, Thank you Mr and Miss Babi సలక్షణంగా పెళ్ళి అయి నూరేళ్ళు వర్ధిల్లండి.

(నిశ్శబ్దంగా వుండమని చెయ్యెత్తి సూచిస్తాడు)

కట్...(రఘుతో) Thank you Sir. (సుజాతతో) Thank you miss

[మైక్ వైరు చుట్టలుగా చుట్టుతూ కిటికీకేసి పోతాడు]

సుజాత : బాబీ! నీకేమన్నా పిచ్చెత్తిందా?

రఘు : (ఆమె భుజం స్పృశిస్తూ) ష్! Silence my dear wife (ఊ మేష్ తో) ఆఁ చూడండీ-ఆ యోగం సంగతి వుంది చూడండి-ఆశీర్వాసనం-అది మరీ గాడిద వ్యవహారంగా వుంటుందేమో—అది కాస్తా కట్ చేస్తే బాగుండదూ?

ఊ మేష్ : నో నో నో, అసలు బాగున్న పాయింటే అదీ! ఇంతమంచి ఇంటర్వ్యూ ఇంతవరకూ నా జన్మలో రికార్డుచెయ్యలేదు నేను. క్వైట్ అనెక్స్పెక్టెడ్!

రఘు : (ఇక ఎదురుచెప్పలేక నవ్వుతూ) అఁహఁ—

ఊ మేష్ · (వైర్, మైక్ చంకలో పెట్టుకుని) వల్. థేంక్యూ వన్స ఎగైన్ సర్.

రఘు : వెల్ - గుడ్...గుడ్...

ఊ మేష్ · గుడ్ బై

రఘు : గుడ్ బై. [ఊ మేష్ వెళ్ళిపోతాడు]

సుజాత : నిజంగా నీకు మతిపోయి వుండాలి. నువ్వేం మాట్లాడావో—

రఘు : మనల్ని గురించే! నిన్నూ నన్నూ గురించే!

[సుజాత చేయిపట్టుకుని ఆమెను రెండు సార్లు గిఱ్ఱున తిప్పుతాడు]

మనిద్దరికి పెళ్ళి కాబోతోంది. ఆసంగతే ప్రపంచానికి ప్రకటిస్తున్నా. ప్రకటించేశాను లిల్లీ!

[సుజాత ఓపక్క కుర్చీలో కూలబడుతుంది]

ఒక్క యీ ప్రపంచానికేకాదు - అతల సుతలాది పధ్నాలుగు భువనాలకు - నవగ్రహాది సర్వగ్రహాలకు - అనంతమైన తారకలకు - అన్నిటికీ చాటించేశాను. రేడియో తరంగాలు నిరంతరంగా నిర్విరామంగా నిరవధికంగా ప్రయాణం చేస్తూనే వుంటాయి. చూడులిల్లీ - అనంతవిశ్వాన్ని చుట్టుకుని ప్రతిధ్వనిస్తూ పోయే మన పెళ్ళి కబురు-

సుజాత . బాబీ !

రఘు (తలమీద నుంచోపోతూ) నాకు చాలా హుషారుగా వుంది వొళ్లంతా కెపెక్కినట్టు వివశమై పోతున్నట్టుంది. తల్లకిందులుగా నుంచోవాలనిపిస్తోంది-లిల్లీ! నుంచోమంటావా?

[మొగ్గ వెయ్యబోతాడు]

సుజాత : (అతన్ని సమీపించి నేలమీద కూర్చోబెడేట్టు వెనక్కితోసి) వొద్దు... (ఆందోళనతో) ఏమిటి బాబీ వున్నట్టుండి ఈ పెళ్ళిబెడద? ఎక్కణ్ణుంచి వొచ్చింది నీకీ అభూత—

రఘు: ఆ మైక్రోఫోను నన్ను రెచ్చగొట్టింది. అదిచూడగానే నా ఆలోచనలూ ఉద్దేశాలు నీకు మైక్ లో చెప్పాలనిపించింది లిలి. అసలు పొద్దున్నుంచే మథనపడుతున్నా నీతో ఈ సంగతి చెప్పడమెల్లాగా అని!

సుజాత: (దగ్గరకొచ్చి తలనిమురుతూ) మళ్ళీ ఎక్కణ్ణాండి నీబుఱ్ఱ చెడిపోలేదు గదా?

రఘు: (వినిపించుకోలేదేమో) ఇహ వాళ్ళొచ్చే వేళైంది—

సుజాత: ఎవరు?

రఘు: రాజా వాడిలవ్ రాణీనూ.

సుజాత. వాళ్ళకు తెలుసా ఈ గొడవ?

రఘు: తెలుసు నే నేరమ్మని ఆహ్వానించా. 'అబ్బాయ్—మీ యిద్దరు రావాలి. హంగు లేకపోతే నాకు సభాకంపం పుటుకొచ్చి లిల్లీముందు నోరెత్తలేకపోతాను' అన్నాను.

[సుజాత నివ్వెరబోయి చూస్తుంది]

ఈపూట డిన్నరు కూడా వుండమన్నాను. ఇంకెవరూ రారు. మనం నలుగురమే. పెళ్లికూడా చాలా సింపుల్ గా— సరాసరి రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళడం మళ్ళీ సరాసరి ఇక్కడికి రావడం. ఇహ తెల్లవార్లు కోలాహలంగా గడపాలని!—

[హఠాత్తుగా ఆగి ఆమెకళ్లల్లోకి సూటిగా చూస్తు]

మధ్యాహ్నం నువ్వు సినిమాకు వెళ్లావా?

సుజాత: ఎందుకూ?

రఘు: మధ్యాహ్నం నువ్వు సినిమాకు వెళ్ళావుగదూ?

★ మనిషిలో మనిషి ★

[సంధ్యవెలుగు క్రమంగా తగ్గిపోతోంది గదిలో]

సుజాత: కమలావాళ్ళతో ఏదో టీపార్టీకి వెళ్ళాను.

రఘు: అంతకుముందు?

సుజాత: (విసుగు పుట్టినట్టు) అబ్బ— ఏమిటి బాబీ ఈగొడవ?

రఘు: (ఆమెదగరకొచ్చి, సోఫాలో ఆమె పక్కనే కూర్చుంటూ) గొడవేం లేదు మైడియర్. రెండేళ్ళుగా మనబతుకు బంతి పువ్వులావుంది. నువ్వు నాపక్కన వున్నంతసేపూ ఇద్దరం మైమరచిపోయే వాళ్ళం. మన కష్ట సుఖాలన్నీ ఒలకబోసుకునే వాళ్ళం. ఒకళ్ళనొకళ్ళం బాగా అర్థం చేసుకున్నాం.

సుజాత: కానీ—

రఘు: నిజమే—ఒక్కోసారి నా కందకుండా పోయేదానివి—పరధ్యానంలో పడేదానివి—కాని అది క్షణికమే. వస్తుతః నువ్వు నాదానివి. నేను నీవాణ్ణి...సినిమాదేం వుంది లేద్దూ—రేపు మళ్ళీ వెళ్ళవచ్చు- బాగుందా సినిమా?

సుజాత: చాలా బాగుంది. అహా-అసలు నీకు నచ్చుతుందో లేదోనని ముందు నే వెళ్లి చూసొచ్చాను...

రఘు: కొందరు కొందరు కొంటెపిల్లలు చెప్పేదొకటీ చేసేదొకటీ! ఆ తెగులు నీకూ వుంది. కాని నువ్వెంత దాచిపెట్టినా నీ ఊహాపోహాలూ నీ ఆలోచనల లోతులూ పసిగట్టగల కుక్కబుద్ధి నాకుంది. దంపతుల్లో ఒకళ్ళకంటే మరొకరిది పైచెయ్యి కావడంలోనే వుంది వైవాహిక ఆనందం. అందుకని నే చెయ్యిజాచి నీ చెయ్యి అర్థిస్తున్నాను లిల్లీ. కాదంకు.

సుజాత: నేను సినిమా కెళ్లినట్టు నీ కెలా తెలుసు?

రఘు: నువ్వు సినిమాకువెళ్లివచ్చినప్పుడల్లా నీ కనుకొలుకులు కాస్త ఎఱ్ఱబడతాయి. నీ కపోలాలమీద చిరుచెమటలు ముత్యాలు కడతాయి.

సుజాత: ......బాబీ! ఇది నిజమేనా అసలు? డిన్నరూ అదీ? అసలు రాజా వాళ్ళు నిజంగా వస్తున్నారా?

రఘు: నిజమే లిల్లీ.

సుజాత: ముందే నాతో యెందుకు చెప్పలేదు? ఈపూట నాకు చాలా అర్జంటు పనులున్నాయి. మావూరునుంచి చుట్టాలొచ్చారు. ఫారిన్‌నుంచి మా రిలెటివ్ ఒకతను వస్తున్నాడు. ప్లేన్‌దగ్గరకు వెళ్ళి మీట్ కావాలి.

రఘు: ప్లేన్‌లో దిగినవాడు మళ్లీ వెనక్కి పోడులెద్దూ. మీ చుట్టాల్ని అటుపంపించి నువ్విలా వచ్చెయ్.

[సుజాత విసుగుతో తలవంచుకుంటుంది. రఘు ఆమెను సమీపిస్తాడు—]

ఈ పూట నీ పెళ్ళి లిల్లీ నీ పెళ్ళి! అయిపోయినట్టే! దీనికంటే ముఖ్యమా ఆ చుట్టం?

[ఆమెను పట్టుకు లాలిస్తాడు.]

సుజాత: (వదిలించుకుంటూ) అబ్బ— సీరియస్‌గా చెప్తుంటే వినిపించుకోవేం? ఈ పూట కుదరదు.

రఘు: పెళ్లా?

సుజాత: డిన్నరు.

రఘు: పోనీ వాళ్ళను మీటైనతర్వాత వస్తావా? (సుజాత మాట్లాడదు) ఎన్నింటికి వస్తావ్?

సుజాత: (ఇహ సహించలేక) చాలా టైం అవుతుంది.

రఘు: ఎంతో టైం అవదులే లిల్లీ. నాకు తెలుసు. అంతంతసేపు చుట్టాలతో ఏం మాట్లాడలేంకూడానూ మనం—ఊరికే అంతసేపైనట్టుంటుందే గాని!

సుజాత: (గబాల్న లేచి) ఇహ నేపోవాలి బాబీ.

రఘు: (ఆమె చెయ్యిపట్టుకుని ఇటు నడిపించుకొస్తూ) ఇవ్వాళ నా హృదయం గంతులు వేస్తోంది. నామనస్సు పరిపరివిధాల పోతోంది. చాలా కొత్తగా ఫీలవుతున్నా. నేను—బాబీని—పెళ్ళికొడుకునవుతున్నాను!

[సుజాత ఏం అర్థంకాక చూస్తుంది అతని వంక]

(ఇంకా ఉత్సాహంగా) అవును! నేనూ పెళ్ళి చేసుకోగలను! అందులో అంత అసాధ్యం ఏమీ కనిపించడం లేదు నాకు. ఏం లిల్లీ! (ఆమె జబ్బలమీద చేతులుంచి ఆమె ముఖంలోకి చూస్తూ) నాకూ ఓ పెళ్లాం వస్తుందన్నమాట! (ఆమెను కౌగలించుకుని) నా జీవితం—పనీపాటా—పగలూ రాత్రీ అన్నీ కూడా ఆమెతో పంచుకుంటా నన్నమాట! నన్నడ్డగలిగినవాళ్లు లేరు! ... కాని ... కాని...అన్నట్టు — ఇవ్వాళ నీ కోసమని మాంఛి తాయిలం ఒకటి తెచ్చాను లిల్లీ.

[జేబులోంచి చిన్న పెట్టెతీసి అందులోంచి ఉంగరం ఒకటి తీస్తాడు.]

సుజాత: ఎందుకిది?

రఘు: నీకోసమే! (ఆమె చెయ్యికోసం చెయ్యిజాస్తాడు).

సుజాత: (చెయ్యి వెనక్కి లాక్కుంటూ) వొద్దుబాబీ—నాకక్కర్లేదు.

రఘు: మన పెళ్ళికిది లంచం అనుకోకు.

సుజాత: అబ్బ — ఇహనవ్వాపెయ్ బాబీ నీ నాన్సెన్స్. ఇప్పటిదాకా అయింది చాలు—ప్లీజ్!

రఘు: నా జ్ఞాపకం కోసమైనా—

సుజాత: నువ్వెప్పుడూ నాకళ్లల్లోనే మెదులుతూ వుంటావ్. ఆ సంగతి నీకు తెలుసు!

రఘు: అందుకని వొద్దంటున్నావా!?

సుజాత: అబ్బ—ఇవ్వాళ వొద్దు బాబీ.

రఘు: ఎందుకని?

సుజాత: డిన్నరుకి నేనెలాగో వుండను గదా.

రఘు: కాస్త ఆలస్యంగానైనా వస్తున్నావుగా లిల్లీ.

సుజాత: ఐనా మనలో మనకీ గుర్తులెందుకు బాబీ? నీ అభిమానం నే నెరగనా?

రఘు: అలాంటప్పుడు ఇంకా నా పెళ్లానివై ఎంత సుఖపడతావో కాస్త వూహించుకో...ఈ టేబులు మధ్యలో పెద్దామనుకున్నాను...మనిద్దరం—రాజా, వాడిలవ్—అందరం ఎదురుబళ్ళుగా కూర్చుందామనుకున్నాను—ఫస్టాసయిన డిన్నరు—

సుజాత: మరి మీ మావయ్య? ... ఆయన్ని పిలవలా?

రఘు: ఆయన్ని ప్రత్యేకించి పిలవడం దేనికి? ఏ సమయానికి ఎక్కడ హాజరు కావాలో ఆయనకి బాగా తెలుసు. పేరెత్తితే చాలు ప్రత్యక్షమౌతాడు ఏదో ఒక విషాదగీతి ఆలపిస్తూ! ఎప్పుడు చూసినా ఏదో ఒక ఘోరం జరుగుతూంటుంది. చెప్పిన కథ చెప్పకుండా చాలా జాగ్రత్తగానే వుంటాడుగాని, అన్నిటికీ ఒకటే క్లైమాక్స్—ఇరవై లక్షలుంటే అవసరం గడుస్తుంది సర్దమంటాడు.

సుజాత: ఇరవై—? [వీధితలుపు బెల్ మోగుతుంది] అడుగో వచ్చినట్టున్నాడే?

రఘు: (తలుపు తీసిచూసి) కాదు లే—మనరాజా!

[రాజు వేషంలో శేఖర్ వస్తాడు. చేతిలో రిబ్బన్‌తో కట్టిన రెండుమూడు అట్టపెట్టెలూ అవీ వుంటాయి]

శేఖర్: (సామాన్లు వొళ్లోనే పెట్టుకుని సోఫాలో కూర్చుంటాడు) హల్లో!

రఘు: (సుజాతతో) చూశావా! ఏవో కట్నాలుకూడా తెచ్చినట్టున్నాడు!

శేఖర్: కట్నాలా? అన్నీ నీ పద్దులోనే రాయించి తెచ్చాను.

[రఘు నవ్వుతాడు. శేఖర్ ఓసారి ఒళ్లో చూసుకుని—]

(48-వ పేజీ చూడండి)

నక్షత్ర ఫలితాలు

బి. నరసింగరావు

[6-8-58 మొదలు 12-8-58 వరకు]

గ్రహ స్థితి

	ప శ		శు
	9 తేది బుధ వక్రారంభం. 10 తేది కర్కాటకములో శుక్రుడు ప్రవేశించును. మేష, వృషభ మిథునములలో చంద్రుడు.		ర
			బు
	శ	గురు	

అశ్విని [చూ, చే, చో, లా]

ఈ వారం బంధువుల రాకపోకలవల్ల ఖర్చు ఎక్కువ. రావలసిన డబ్బు చేతికందక పోవడము చేతను అశాంతి. కోర్టు వ్యవహారములు కొంతవరకూ అనుకూలిస్తవి. పరులకు సహాయం చేయడానికి పాటుపడి, మాట దక్కక నిందలను పొందుతారు. ఉద్యోగస్తులకు కొత్త సమస్యలవల్ల కార్యభారము ఎక్కువ. వర్తకులకు వ్యవహారము పట్ల పేచీలు. భార్యకు అనారోగ్యము. 6, 7 కార్యభారము, త్రిప్పట, అనారోగ్యము, వివాదములు ఆపైని స్వల్పముగా ధనయోగము.

*** భరణి [లీ, లూ, లే, లో] ***

ఈ వారము అనుకున్నట్టుగా పనులు జరగవు. ధనాభావముచే ఇబ్బంది కలుగుతుంది. బంధువులకు సహాయము చేయబోయి జరగక మాటపడి మనోవ్యథ నొందుతారు. వాహనములవల్లగాని, ఎత్తయిన స్థలము నుండి పడుటవల్లగాని, వాడిపనిముట్లవల్లగాని అవయవములకు గాయములు కలుగవచ్చును. యంత్రముల నడుపు నిపుణులకు, రసాయన శాస్త్రజ్ఞులకు, గనుల యాజమానులకు కష్టముతో కూడినలాభయోగము. ఆటంకములు, నిందలు మొదలగు అవయోగము లున్ననూ 6, 7 తేదీలలో ప్రమాదసూచన, ఆపైని ప్రయాణము కార్యలాభము కల్గును.

*** కృత్తిక [అ, ఈ, ఉ, ఏ] ***

గత రెండువారముల నుండి కలుగుచుండిన ఆటంకములను గడిచి, అధికారుల సహాయము చేతను, మీ యుక్తి చేతను కార్యసిద్ధి పొందుతారు. ఆర్థికస్థితి బాగుపడుతుంది. 6, 7 తొట్రుపాటు, ఏమిచేయుటకు తోచదు. ఆపైని కార్యక్రమము ఒకదారిని నడుస్తుంది. ప్రయాణము, అధికారుల ఆదరణ, ధనలాభము, బంధుదర్శనము, కార్యసిద్ధి కలుగుతవి. డాక్టర్లకు, గణితశాస్త్రజ్ఞులకు, కవులకు చిత్రకారులకు, నటీనటులకు యోగకాలము. విద్యార్థులకు మేలుగా వుంటుంది. కవులు నూతన రచనలు సాగిస్తారు.

*** రోహిణి [ఓ, వా, వీ, వూ] ***

ఈ వారము మీకు యోగకాలము. ఉన్న ఇబ్బందులు తీరుతవి. అనుకున్న సొమ్ము చేతికివస్తుంది. కోర్టు దావాలు అనుకూలంగా తీర్పు అవుతవి. పిల్లల లాభముకొరకు కొన్ని ఏర్పాట్లను చేస్తారు. నూతన కార్యారంభము చేస్తారు. ప్రభుత్వ సన్మానము జరుగుతుంది. పండితులతో జ్యోతిషగోష్ఠి జరిపి నూతి నాంశాలు తెలుసుకుంటారు. 6, 7 ఏమి చేసిందికి తేములదు. ఆపైని వారమంతా యోగదాయకముగా వుంటుంది. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు మేలుకాలము.

*** మృగశిర [వే, వో, కా, కీ] ***

ఈ వారము మీకు యోగదాయకమైననూ, మానసికాందోళన వుంటుంది. ధనయోగము కలుగుతుంది. కవితాగోష్ఠి, గానసభలవంటి వినోదాలలో బంధుమిత్రులతో కలిసి పాల్గొంటారు. ఇదివరకు అనారోగ్యముతో వున్న దూరస్థులైన ఆప్తులు కోలుకున్నట్టు వార్త తెలిసి సంతోషము పొందుతారు. కవులకు, గాయకులకు, నటీనటులకు వారమంతా యోగకాలము. నూలు, బటలు, వెండినగలు, బియ్యము వ్యాపారస్తులకు లాభము. 6, 7 మానసికాందోళన. 8, 9, 10, 11 ధనయోగము, కార్యసిద్ధి, శుభకార్యాలోచన, విందు, వినోదము. 12 నీటిపై ప్రయాణము.

*** ఆరుద్ర [కూ, ఖ, ఙ, ఛ] ***

గతివారము పూర్తికాకుండా వుండిపోయిన పనులు ఈవారము లాభకరముగా ముగుస్తాయి. ధనయోగము అనుకున్నదానికన్నా ఎక్కువగా వృద్ధి అవుతుంది. శుభకార్యాలోచనలు చేస్తారు. సాంఘికసేవచేసి కీర్తి పొందుతారు. విద్యార్థులకు మేలుకాలము. నూతనగృహ నిర్మాణమునకు ఆలోచనలు చేస్తారు. విలువగల వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు ఎక్కువలాభము కలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికార హోదాలు పెరుగుతవి. వాహనయోగము కలుగుతుంది. 6, 7 తేదీలలో తెములని కార్యక్రమము. ఆపైని ప్రయాణము, ధనలాభము, కార్యసిద్ధి, సంఘసేవ, స్త్రీలతోనూ ఆప్తులతోనూ విందు, వినోదము. భార్యకు అలంకారప్రాప్తి.

పునర్వసు [కే, కో, హా, హీ]

ఈ వారము యత్నికార్యములకు ఆటంకములు కలుగుతవి. కార్యభారమువల్ల తీరుబడి వుండదు. ఆర్థికస్థితి సరిగా వుండనందున గృహావసరములకు యిబ్బంది కలుగుతుంది. వేళతప్పిన భోజనమువల్ల, కళ్ళుమంట, తలపోటువంటి అనారోగ్య సూచనలు కనబడగానే ఔషధ చికిత్సపొందుట మేలు. వర్తకులకు శ్రమ ఎక్కువ. ఉద్యోగస్తులకు ఒత్తిడివున్నా అధికారుల మన్నన పొందుతారు. రాజకీయ వాదులకు మేలుగా వుంటుంది. విద్యార్థులకు చదువు సరిగా జరగదు. 6, 7 అనారోగ్యము. ఆపైని అలజడిగా వున్నా కార్యలాభము, ధనయోగము కూడా వుంటవి.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారము మీకు మిశ్రమయోగము. నిరాశగా వుంటుంది. కాని క్రమేణా మిత్రుల సహాయమువల్ల కార్యలాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు మంచిరోజులు కావు. బదిలీ అయ్యే సూచన లున్నవి. వర్తకులకు మాంద్యము. విద్యార్థులకు శ్రద్ధ తక్కువ. ప్రభుత్వముచే రహస్యములను కనిపెట్టడానికి నియోగింపబడుతారు. 6, 7 తేదీలలో మనోవ్యథ, నిరాశ, గృహకలతలువంటి అవయోగము లున్ననూ, ఆపైని ప్రయాణము, మిత్రసహాయము, కార్యసిద్ధి, విదేశీయులతో పరిచయము, అపురూప వస్తుసంపాదన మొదలగు మంచి యోగములు కూడా వుంటవి. ఆప్తుల ఆరోగ్య చింత కలుగుతుంది.

*** ఆశ్లేష [డీ, డూ, డే, డో] ***

ఈ వారము తలపెట్టిన పనులకు ఆటంకములు కలుగుతవి. ధనాభావమునకు తోడు

★ నక్షత్రఫలితాలు ★

బంధువుల రాకపోకలవల్ల అధిక ఖర్చులచే మనోవ్యధగా వుంటుంది. మతసంబంధమైన ఉపన్యాసములు వినుట, వ్యాసములు చదువుట, సాధు సంగత్యము, ఆధ్యాత్మిక చింతచే మనోవికాసము కలుగుతుంది ఉద్యోగస్తులు కొంత శ్రమపడిన మీదట మేలు పొందుతారు. వర్తకులకు అకస్మాత్తుగా ధనలాభము కలుగుతుంది. 6, 7 తేదీలలో అధిక ఖర్చులు, గృహకలతలు, ఆటంకములు వున్నా ఆపైని ధనలాభము, సాధుసాంగత్యము, ఆత్మవికాసమువంటి మంచియోగములు కూడా కలుగుతవి. ఆప్తుల ఆరోగ్యము సరిగా వుండనందున వ్యథ.

* మఖ [మా,మీ,మూ,మే] *

ఈ వారము బుద్ధిమాంద్యము ఎక్కువగా వుంటుంది. తలపెట్టిన కార్యములలో జయము లేకపోవుట, వ్యర్థముగా తిరుగుట, సజ్జనవిరోధము వంటి చెడు ఫలితాలు కలుగుతవి. పరోపకారమునకు పూనుకొని, సాగక, మాటపడి విచారము పొందుతారు. ధనలోపము తీరిందికి చాలా తాపత్రయము పొందుతారు. దావాలలో గెలుపువుంటుంది. ఉద్యోగస్తులకు సెలవు పెట్టవలసి వస్తుంది. అపరదినుసులు, ఉప్పు, నువ్వులు, నూనె వ్యాపారస్తులకు లాభము. 6, 7 వివాదము, భార్య అనారోగ్యముచే చింత, మొత్తం మీద వారమంతా అలజడిగానే వుంటుంది.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
మో, టా, టీ, టూ

ఈ వారము రాబడికి మించిన ఖర్చులు కలుగుటచేతను అప్పుచేయవలసి వస్తుంది. ప్రారంభించిన పనులకు ఆటంకములు కలిగినా, అధైర్యపడక ప్రయత్నించి, తుదకు ఫలమును పొందుతారు. శరీరముపై కురుపులు లేస్తాయి. అగ్నివల్లగాని, యంత్రములవల్ల ప్రమాదము జరుగవచ్చును. ఉద్యోగస్తులకు అధికారుల పోటుమాటలచే మనోవ్యధ. సోదరసహాయము కలుగుటవల్ల ఇదివరకు చేసిన అప్పు తీరుస్తారు. భూస్వాములకు, గనుల యజమానులకూ, వారమంతా శ్రమతో కూడిన లాభము. 6, 7 తేదీలలో ఆటంకములు, ప్రమాదభయము. పోలీసుశాఖలో వారికి మేలుకాలము.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పీ]

ఈ వారము మీకు ధనయోగము, వ్యవహారములలో జయము, శుభకార్యాలోచనలు చేయుట, బంధుదర్శనము, విద్యాప్రాప్తి, నూతన కార్యయత్నలాభము, మంచి ఉత్తరములు వచ్చుట, జ్ఞానమార్గ ప్రసంగము, యుక్తిగా ప్రసంగించుట, గణిత, జ్యోతిష శాస్త్ర చర్చలు, సుఖభోజనమువంటి మంచి యోగాలు కలుగుతాయి ప్రత్తి, దూది నూలు, వస్త్రములు, ఇత్తడి, కంచు మొదలగు సరుకుల వ్యాపారస్తులకు లాభము కవులకు, శిల్పులకు, చిత్రకారులకు, నటీనటులకూ మేలుకాలము.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము శుభకార్యాలోచనలు జరుగుట, పుత్రప్రాప్తి సూచనలు, ధనలాభము, బిరుదులు పొందుట, ఆకస్మిక ప్రభుత్వ సన్మానము, ఘన కార్యాచరణ ప్రయత్నములు, వేదబ్రాహ్మణభక్తి, పుణ్యకార్యములు చేయుట, పుణ్యక్షేత్ర సంచారము, వైద్య, జ్యోతిషశాస్త్ర ప్రసంగములులాంటి మంచి యోగాలు కలుగుతవి. విద్యార్థులకు మేలుగా వుంటుంది. న్యాయస్థానోద్యోగులకు, న్యాయవాదులకు, పండితులకు. ఉపాధ్యాయులకు వారమంతా మేలుగా వుంటుంది.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము మీరు వినోదములలో పాల్గొనుట, దధిక్షీరయుక్త మధుర పదార్థములతో సుఖభోజనము వెండి పాత్రలలో చేయుట, తలచిన కార్యములలో జయము, నీటిమీద ప్రయాణము, తెల్లని వస్తువులు కొనుటవంటి మంచి యోగములు కలుగుతవి. ప్రత్తి, దూది, నూలు, తెల్లని వస్త్రములు, వెండి, బియ్యము, ద్రవపదార్థ వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, నటీనటులకు మేలుకాలము. శుభయోగములున్నా వారంమతా భయాందోళనలతో కూడి వుంటుంది.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము ధనధాన్య వృద్ధి, పశుసంపద, కృషి మూలకముగా లాభము, వివాహాది శుభకార్యాలోచనలు చేయుట, ఇష్టవస్తు లాభము, పరోపకారమువల్ల కీర్తి, ప్రభుత్వ కార్యనిర్వహణవల్లగౌరవంవంటి రాజయోగములు కలుగుతవి. విద్యార్థులు వినోదములలో పాల్గొన్నా చదువు బాగా సాగుతుంది. వర్తకులకు ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 6, 7 తేదీలలో కుటుంబ కలహము ఆపైని శుభయోగములు.

—ధరలు:—

నూలు, వస్త్రములు : మందముగా వుండును.

నూనె దినుసులు: నిలబాటుగా వుండును.

బెల్లము, పంచదార, చింతపండు : మందమగును

ఆహార ధాన్యములు : మార్పు లేదు.

పప్పుదినుసులు : నిలబాటుగా వుండును.

వెండి, బంగారము: మందమగును

మంచి వర్షములు అంతటా కురియును.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారి వారి పేర్ల ననుసరించి పేర మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమున్నా, హృష్ణుడను పేరునకు స్వాతియూ, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

* విశాఖ [తీ, తూ, తే, తో]*

ఈవారము మీకు కార్యభారము ఎక్కువ, రాబడి తక్కువ. గృహావసరములు తీరవందున స్పర్థలు. ఆరోగ్యము సరిగా లేని సూచనలు కనబడగానే గ్రహారాజైన రవికి శాంతి చేయుట మేలు. ఉద్యోగస్తులకు కొత్త సమస్యలు, వర్తకులకు ఆందోళన. విద్యార్థులకు చదువు సరిగా సాగదు. 6, 7 తేదీలలో ఆరోగ్యభంగము, ఆపైని పితృవర్గము నుండి సహాయము, కార్యలాభము కలుగుతవి. రాజకీయవాదులకు ఆందోళన

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈవారము అనుకున్న సొమ్ము సకాలములో చేతికిరాదు. కార్యాచరణకు పాలుపోని అనిశ్చితస్థితిలో వుంటారు. చేదామనుకున్న పనులకు మొదట్లో ఆటంకములు కలిగినా వారాంతమునకు మిత్రసహాయమువల్ల కార్యానుకూలత పొందుతారు. వర్తకులకు నిరాశగావున్నా వారాంతమునకు లాభము. ఉద్యోగస్తులకు వన పర్వతప్రాంతములకు బదిలీ అయే సూచనలున్నవి. 6, 7 తేదీలలో అనిశ్చితస్థితి, ఆటంకములు, ఆప్తుల ఆరోగ్యముగురించి చింత. ఆపైని విదేశీయులతో పరిచయము, విచిత్రవస్తు సంపాదన, ప్రయాణము, మిత్రసహాయము, కార్యలాభము కలదు.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము మీకు మిశ్రమయోగము. ధనలోపము వుంటుంది. అనుకున్నట్టుగా పనులు జరగవు. కోరిన సహాయము లభించదు. అవసరములు తీరక ఆందోళన కలుగుతుంది. దైవముపై భారము వేసి కార్యసాధనకు ప్రయత్నించి ఫలమును పొందుతారు. వర్తకులకు చాలా కాలమునుండి రాకుండా నిలిచిపోయిన పాతబాకీలు వసూలు అవుతవి. వ్యర్థప్రసంగములవల్ల ఉద్యోగస్తులు అధికారుల అనాదరణకు లోనౌతారు. 6, 7 ధనలోపము, ఆటంకములు, ఇంట్లోవారి అనారోగ్యముచే ఆందోళన. ఆటుపైని పుణ్యపురుషుల సాంగత్యము, ఆత్మవికాసము, శాంతి, పుణ్యక్షేత్ర సంచారము, దేవతా దర్శనము, నష్టద్రవ్యలాభము.

*** మూల [యే, యో, బా, బీ] ***

మీ ఆలోచనల ప్రకారం కార్యక్రమాలు సాగించుకోడానికి కొందరు అడ్డు వస్తూవుంటారు. కొన్ని సందర్భాలలో అశాంతి, బంధువిరోధం వస్తవి. డబు లేనాదేనా సందర్భాలలో వివాదాలు వస్తవి. కోర్టు వ్యవహారములు అనుకూలముగా తీర్పువున్నా మరికొన్ని కొత్తచిక్కులు కలుగుతవి. భార్య ఆరోగ్యం కొద్దిసూచన ఉన్నవి. కొర్రలు, రాగులు వంటి అపరదినుసులు, మినుములు, ఉప్పు నువ్వులు, నూనె సంబంధమగు వస్తువుల వర్తకులకు లాభము. అన్యజాతివారివల్ల గౌరవము జరుగుతుంది. 6, 7 ఆటంకాలు, వివాదాలు, త్రిప్పట, శ్రమ, ఆపైని వారాంతముదాకా కొంత యోగప్రదముగా వుంటుంది.

పూర్వాషాఢ [బూ, ధ, భా, డా]

ఈ వారము ఎంత ప్రయత్నించినా కార్యసాధనలో అనేక ఆటంకాలు కలుగుతవి. సాహసము, పట్టుదలగలవారగుటచేతను నిరాశ పొందకుండా కలిగిన చిక్కులను విప్పుకొని మేలు పొందుతారు. సోదర సహాయమువల్ల ఒడిదుడుకులు సద్దుకుంటాయి. జాగ్రత్తగా వుండుటవల్ల అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదము తప్పవచ్చును. 6,7 కార్యభంగము, మనోవ్యధ, ప్రమాదము వంటి బాధలున్నా ఆపైని సోదరసహాయము, ధనలాభము, కార్యానుకూలత కలుగుతవి. గనుల యజమానులకూ, భూగర్భశాస్త్రజ్ఞులకు, లోహ, ఖనిజ వ్యాపారస్తులకు, పోలీసుశాఖ ఉద్యోగులకు, కష్టముతో కూడిన యోగము.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము మీరు ధైర్యముతో వృత్తి, ఉద్యోగాలలో ముందడుగు వేసి హోదా, ఆదాయము పెంచుకొనగలుగుతారు. కొత్త అనుకూలతలు ఏర్పడుతవి. మీ బుద్ధిబలము వల్ల ఉపద్రవాలను సాధించుతారు. మీరు వేసుకున్న పథకం ప్రకారము అన్నివిధాలా డబ్బు చేతికందుతుంది. మనుష్యసహాయము కూడా కలుగుతుంది. మాట పలుకుబడి బలంతో పరిస్థితులలో అనుకూలమైన మార్పులను తెచ్చుకొనకలుగుతారు. ఈశాన్య దిక్కునుండి బంధువుల కుశలవార్త తెలుస్తుంది. గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, చిత్రకారులకు, నటీనటులకు యోగకాలము.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈ వారము మీకు యోగప్రదము. గత వారము అవకుండా నిలిచిపోయిన కార్యములు ఈ వారము సుముఖమవుతాయి. అధికారముతోపాటు ధనాదాయము కూడా పెరుగుతుంది. బిరుదులు పొందుట, సన్మానమువంటి రాజయోగములు కలవు. పండితగోష్ఠి, నూతనగ్రంథములు చదువుటచే విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. పిల్లల యోగక్షేమాల విషయములో మీరు కొన్ని ఏర్పాట్లు చేసారు. వర్తకులకు లాభయోగము. విద్యార్థులకు మేలుకాలము. న్యాయస్థాన ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు మంచికాలము.

*** ధనిష్ఠ [గా, గీ, గూ, గే] ***

ఈ వారము లౌకిక వ్యవహారరంగంలో చాలా జయప్రదముగా వుంటుంది. ఆదాయము ఎక్కువవుతుంది. ఇంట్లోవారి ఆరోగ్యము బాగుపడుతుంది. నీటిపై ప్రయాణము చేయవలసి వస్తుంది. కవితాగోష్ఠి, గానసభలు మున్నగు వినోదములలో బంధుమిత్రులతో కలిసి పాల్గొంటారు. విద్యార్థులకు మేలుకాలము. దధిక్షీరమధుర పదార్థయుక్త సుఖభోజనము చేస్తారు. బియ్యము, నూలు, బట్టలు, వెండి వ్యాపారస్తులకు లాభము. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగము. 6, 7, మానసికాందోళన, ఆపైని శుభయోగములు.

*** శతభిషం [గో, సా, సీ, సూ] ***

ఈ వారము మీరు గౌరవమర్యాదలు పొందగలుగుతారు. ఇతరుల శాంతి సౌఖ్యాల కోసము మీరు ఎంతైనా శ్రమపడి కీర్తి పొందుతారు. డబ్బు రాబడి బాగుంటుంది. ఆప్తుల శుభకార్యములగురించి తగిన నిర్ణయాలు జరుగుతవి. స్త్రీలతోను, బంధుమిత్రులతోను కలిసి విందు, వినోదములలో పాల్గొంటారు. విద్యార్థులకు మంచికాలము. వర్తకులకు విలువగల వస్తువుల క్రయవిక్రయములలో విశేషలాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 6, 7 తేదీలలో అధిక ఖర్చులు, ఆపైన శుభయోగములు.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

ఈ వారము కార్యభారము ఎక్కువ. రాజవార్తాప్రసంగములు, వింతమాటలు వినుట, పరాక్రమమువల్ల ఘనత, ధనలాభము ప్రయాణము వుంటవి. అకాలభోజనమువల్ల వేడిచేసి కడుపునొప్పి, కళ్లమంట. బలహీనతవంటి సూచనలు కనబడగానే ఔషధ చికిత్స చేయించుకొనుట మేలు. ఉద్యోగస్తులకు బదిలీ అవుటగాని, ఒత్తిడితట్టుకో లేక శెలవు పెట్టుటగాని జరుగును. విద్యార్థులకు మంచికాలము కాదు. 6, 7 ప్రయాణము, అనారోగ్యము ఆపైని ఘనత ధనలాభము, కార్యసాధన.

ఉత్తరాభాద్ర [దూ, శం, ఛా, ధా]

ఈ వారము ప్రతి పనికి అనవసరముగా ఆలస్యము జరుగుతుంది. ఏ పని చేసేందుకు సమాధానము కుదరక చికాకు పడతారు. ఆశాభంగము ఎక్కువ. వర్తకులకు లాభము తక్కువ. రహస్య భేదనోద్యోగములో చాతుర్యమువల్ల జయము పొందుతారు. ఉద్యోగస్తులకు వనపర్వత ప్రాంతములకు బదిలీ అవవచ్చును. వారాంతమున అంతవరకూ తటస్థముగా వున్న మిత్రుని సహాయమువల్ల కార్యానుకూలతను పొందుతారు. ప్రయాణములో కలిసిన విదేశీయులతో స్నేహము ఏర్పడి అపురూప వస్తుసంపాదన చేస్తారు. 6, 7 విటంకములు, ఆత్మీయుల ఆరోగ్య చింత. ఆపైని మిత్రసహాయము, కార్యసిద్ధి.

*** రేవతి [దే, దో, చా, చీ] ***

ఈ వారము మీరు ఎవరి సహాయము పొంది కార్యములు చేసుకుందామనుకున్నారో ఆ వ్యక్తివల్లనే ఆటంకములు కలుగుతవి. ధనాభావం ఎక్కువగా వుంటుంది. ఆధ్యాత్మిక చింత కలవారగుటవల ఈశ్వరకృపచే అన్నికష్టములు తీరుతాయనే నమ్మకము వుంది కనుక క్రమేణా కార్యానుకూలత కలుగుతుంది. ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలుగజేస్తుంది. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వ్యాపారస్తులకు మొదట్లో నిరాశగావున్నా వారాంతానికి కొన్నాళ్ళనుండి రాకుండా నిలిచిపోయిన బాకీలు వసూలౌతాయి. విద్యార్థులకు చదువు సరిగా జరుగదు. 6, 7 తేదీలలో వ్యర్థముగా తిరుగుట, ఆటంకములు, ఇంట్లో అనారోగ్యము. ఆపైని కొంతవరకూ కార్యానుకూలత, నష్ట ద్రవ్యలాభము పుణ్యక్షేత్రసంచారము, దేవతా దర్శనము.

★

వనితాలోకం

ఆంధ్రలో క్రొత్త సంక్షేమ కార్యక్రమాలు

సంక్షేమకార్యక్రమాలనగానే మనకు పల్లెటూళ్ళలో నడుపబడుతున్న సంక్షేమకేంద్రాలే జ్ఞాపకం వస్తాయి. కుట్టుపనులు, చేతిపనులు, వయోజనవిద్య, కొద్దిపాటి వైద్యసహాయం – ఇవి మాత్రమే ఎక్కువగా గోచరిస్తాయి మనకు. నిజమే. యిన్ని సంవత్సరాలుగా అధికార అనధికార సభ్యులతో కూడిన కమిటీలు నడిపే యీ 'జిల్లా ప్రాజెక్టులు' మాత్రమే వున్నాయి మన ఆంధ్రదేశంలో. ఐదు కేంద్రాలతో కూడిన ఒక ప్రాజెక్టు, ఒక్కొక్క సంక్షేమ కేంద్రంలో గ్రామసేవిక, మంత్రసాని, కుట్టు ఉపాధ్యాయిని పనిచేయడం – ప్రాజెక్టు అంతకీ ఒక ముఖ్యసేవిక, ప్రతిజిల్లాకు ఒక కమిటీ – ఇదంతా ప్రథమ ప్రణాళికనుండి అమలులో ఉన్న పంథాయే. ఈ కేంద్రాల ముఖ్యోద్దేశ్యం గ్రామీణులకు ముఖ్యంగా గ్రామస్త్రీలకు సహాయపడడమే.

దేశఅభ్యున్నతికి ముందుగా గ్రామాలలో చైతన్యం కలగాలనేది అందరికీ తెలుసు. మరి – అసంఖ్యాకమైన మనపట్టణాల్లోవున్న ప్రజలకి ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలే లేవా? పట్టణాల్లోవున్న బీదప్రజలు – గూడెములలో, గుడిసెలలో, మురికి పరిసరాల్లోవుండి దుర్భర జీవితాలు గడిపే వారికి సహాయపడేపని ఎవరు చేస్తున్నారు? అనిపిస్తుంది చాలామందికి. మన ఆంధ్రదేశంలో పట్టణాలన్నిటిలో -చిన్న-చిన్న యిళ్ళతో, పేద కుటుంబాలతో నిండివున్న మురికిగూడెములు అసంఖ్యాకంగా ఉన్నాయి. కొన్ని పట్టణాల్లో పారిశ్రామిక కార్మికులు ఎక్కువగా వున్నారు – ఖార్ఖానాల్లో పనిచేసేవారు, రోజు కూలీ చేసుకునేవారు' రిక్షాలు లాగేవారు, ఫ్యాక్టరీల్లో, రైళ్ళల్లో బరువులు మోసేవారు–ఒకరేమిటి, అనేక రకాల జీవనోపాధులు అనుసరిస్తూ, చాలీచాలని ఆదాయాలతో పొట్ట గడవటమే కష్టంగా వుండేవారున్నారు. వీరందరి కష్టసుఖాలు ఎవరుచూస్తున్నారు? ఎవరూ లేరనే ఒప్పుకోవలసి వస్తుంది.

పట్టణ సంక్షేమ పథకాలు

ఈ తరగతి ప్రజలకి సహాయపడడం కోసమే 'పట్టణసంక్షేమ ప్రాజెక్టు'లనేవి పట్టణాల్లో ప్రారంభించాలని ఒక సంకల్పం. ఈ సంకల్పం కేంద్రసాంఘిక సంక్షేమసమితి వారిది. జనసమ్మర్దం బాగా వున్న ప్రదేశాల్లో షుమారు ఐదువందల కుటుంబాలున్న ఒక ప్రాంతాన్ని ఒక ప్రాజెక్టుగా తీసుకోవచ్చును. ఒక ప్రాజెక్టులో 2500 వరకు జనాభా వుండవచ్చును. ఆకుటుంబాలకి లేక ఆ పేటకి సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడమే 'ప్రాజెక్టు' ను ప్రారంభించడం. పల్లెలలో నడుస్తున్న (Welfare Fxtention Projects) సంక్షేమ విస్తరణ ప్రాజెక్టులను నడపడానికి ప్రత్యేక కమిటీలు ఏర్పరుస్తున్నారు. కానీ యీ పట్టణ ప్రాజెక్టులను మటుకు సంఘసేవాసంస్థలకు అప్పచెబుతారు. దీనివలన నిస్వార్థ సేవా పరాయణులైన వ్యక్తుల చేతుల్లోనే యీ 'ప్రాజెక్టు' వుంటుందని నమ్మవచ్చును.

మన నగరాలలో

మన ఆంధ్రప్రదేశ్ లో పెద్ద నగరాలైన హైదరాబాదు, సికిందరాబాదు, బెజవాడ, విశాఖపట్టణము, పట్టణాలయిన రాజమండ్రి, గుంటూరు, వరంగల్లు, కాకినాడ—వీటిలో యిటువంటి 'పట్టణ సంక్షేమ ప్రాజెక్టులు' ప్రారంభించడానికి అనువైన ప్రదేశాలు ఎన్నోవున్నాయి. 'ప్రాజెక్టు'లను నిర్వహించడానికి తగిన శక్తిసామర్థ్యాలు కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ఎన్నోవున్నాయి. ఈ సంస్థలు 'ప్రాజెక్టు'ను నడుపుతాము అని దరఖాస్తు పెట్టుకుంటే, కేంద్ర సాంఘిక సంక్షేమ సమితి సంవత్సరానికి 8 వేల రూపాయల చొప్పున, మూడు సంవత్సరాలకు 25 వేలు మించకుండా గ్రాంటు యిస్తుంది. సమితి నిర్ణయించిన ఖర్చుల ప్రకారము, కార్యక్రమావళి ప్రకారము ఆయా సేవా సంస్థలు ఈ ప్రాజెక్టును నడపవలసి వుంటుంది.

నాలుగు శాఖలు

ఈ 'ప్రాజెక్టు'లలో నడపటానికి అనువైన సంక్షేమ కార్యక్రమాలను నాలుగు తరగతులుగా విభజించారు సమితి వారు. శిశు, యువజన, స్త్రీ సంక్షేమ కార్యక్రమాలు, సార్వజనీన (జనరల్) సంక్షేమ కార్యక్రమము ఇల్లా విభజింపబడినవి. వీటిలో ఏవయినా ఒక విభాగాన్ని గానీ, అన్నీ గానీ తీసుకొని 'ప్రాజెక్టు' నిర్వహించవచ్చును.

శిశు సంక్షేమ కార్యక్రమముల క్రింద— శిశు సంరక్షణ, వైద్యసహాయము, తల్లిదండ్రులు పనిలోకి వెళ్ళినప్పుడు పిల్లల సంరక్షణ. ఐదు సంవత్సరములలోపు పిల్లలకు, 'ప్రీబేసిక్' క్లాసులను నడపటం, పెద్దపిల్లల ఆటపాటలకు వసతి కల్పించడం—ఇవి వస్తాయి. 'శిశు సంక్షేమం' ప్రధానంగా తీసుకున్న ప్రాజెక్టులో యిల్లాంటి అంశాలు ఎన్నైనా తీసుకోవచ్చును. ప్రస్తుత పరిస్థితులనుబట్టి పేద కుటుంబాల్లో చిన్న పిల్లలను కూడా ఏదో ఒక పనికి ఆర్జనకోసం పంపుతున్నారు. అల్లాంటి పిల్లలకి పాపం జీవితంలో చదువుకునే అవకాశం ఉండటంలేదు. అల్లాంటి పిల్లలకూ అల్లాగే విద్యాభ్యాసానికి అవకాశంలేని పెద్దలకు ఏదోఒక సమయంలో విద్య నేర్పవచ్చును.

వృత్తులు; ఉద్యోగాలు

యువజనులకు సంబంధించిన సమస్యలు

చాలా వున్నాయి. వృత్తి విద్య నభ్యసించడం, నేర్పుకి తగిన ఉద్యోగం సంపాదించడం, ఉద్యోగావకాశం వివరాలు తెలుసుకోవడం, ఉద్యోగంచేస్తూ ఉన్నత విద్య నభ్యసించగలగడం, వివాహ విషయాల్లో నిర్ణయాలు తీసుకోవడం—అన్నీ సమస్యలే. క్షణక్షణం బ్రతుకుకోసమే పెనుగులాడే యీ కాలంలో సమస్యలనుగురించి ఆలోచించి, ఒక నిర్ణీత పద్ధతిలో జీవితం గడపడానికి అవకాశం లేదు. అందరికీ సామర్థ్యం ఉండదు. వివిధ ఉద్యోగావకాశాలను గురించిన విషయాలను సేకరించి ఏ అవకాశము లేనిచోట సరైన శిక్షణకు అవకాశం కలిగించడం యువజనులకు చాలా సహాయకరంగా వుండగలదు. వృత్తి విద్యలు శిక్షణావకాశాలు సరిగా లేకపోవడం వలన చాలామందికి సరియైన ఆదాయం, వృత్తి ఏర్పడటం లేదు. ఈవిధమైన అవకాశాలు కల్పించడం విషయసేకరణ, 'యువజనుల సంక్షేమం' ప్రధానంగా తీసుకున్న ప్రాజెక్టులలో జరుపవచ్చును. యువతీ యువకులకు మానసిక వికాసానికి దోహదమిచ్చే వినోదయాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్కౌటు, గైడు సంఘాలు-ఎన్నైనా నిర్వహించవచ్చును. వారిలో అణగివున్న శక్తి సామర్థ్యాలు సంఘానికి ప్రయోజనకరంగా ఉండేట్లు చూడటం, అభిరుచి నేర్పునుబట్టి వృత్తి నిర్ణయంచేయడం-ఇవన్నీ వారి జీవిత పథాలను సుకరం చేయగలవు.

మహిళా వికాసం

స్త్రీలకు వినోద కార్యక్రమములు, చేతిపనులు కుట్టు, సంగీతం చిత్రలేఖనం యిత్యాది స్త్రీ తరగతులు, స్త్రీ సంక్షేమం ప్రధానంగా నిర్వహించ దలచిన ప్రాజెక్టులలో నడపవచ్చును. అనాథ స్త్రీలకు సరైన ఉపాధి కల్పించడం వారికి శరణాలయ వసతి కల్పించడం కూడా యీ కార్యక్రమలో చేర్చవచ్చును. కుటుంబ నియంత్రణను గురించిన తరగతుల నిర్వహణ, వినోద కార్యక్రమముల నిర్వహణ కూడా యీ తరగతిలో వస్తాయి.

ఈ మూడు విభాగాలుకాక, 'ప్రాజెక్టు ప్రాంతం'లో నివసించే ప్రజలందరికీ ఉపయుక్తంగా వుండే సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, సాంఘిక విద్య, వయోజన విద్యా కార్యక్రమాలు కూడా నిర్వహించవచ్చును. వికలాంగులకు, ముసలివారికి తగిన శరణాలయ సౌకర్యాలు కల్పించడం, వారికి సేవ, సహాయం చేయటంకూడా ఈ కార్యక్రమాలలో చేర్చవచ్చును.

పైన ఉదహరించిన నాలుగు విభాగములలో ఏ ఒక్క కార్యక్రమము తీసుకొని 'ప్రాజెక్టు' నిర్వహించినా అది ప్రజా సంక్షేమానికి ఎంతో దోహదకారిగా వుండగలదు. ఆపదలలో ఆర్థిక సహాయం, వైద్య సహాయం, విద్యయందు అపేక్షవుండి అవకాశంలేనివారికి అట్టి సదుపాయం కల్పించడం, నిరుద్యోగసమస్య, వృత్తి శిక్షణ సమస్యలను ఎదుర్కొలేనివారికి తగు మార్గాలను చూపడం, భావిపౌరులైన శిశువుల సంరక్షించడం, స్త్రీలకు ఉపాధి కల్పించి కుటుంబ ఆర్థిక స్థితికి తోడ్పడడం—ఇవన్నీ అసంఖ్యాక కుటుంబాలలోని పరిస్థితులను వాతావరణాన్ని ఎంతగానో చక్కబరుస్తాయి.

ఇంతేకాక, 'ప్రాజెక్టు'ను జయప్రదంగా నిర్వహించగలిగే సంస్థలు, చిన్న తరగతి కుటుంబాలకు సరిపోయే గృహాలను నిర్మించడానికి కూడా పూనుకోవచ్చును. పురపాలక సంఘాలను, ప్రభుత్వాన్ని ప్రోత్సహించి ఆ ప్రదేశానికి తగిన సదుపాయాలు ఏర్పరుప వచ్చును. ఒక 'ప్రాజెక్టు'లో పొందిన అనుభవంద్వారా, యింకా ఎన్నో సంఘసేవా కార్యక్రమాలను అదే పట్టణంలో నిర్వహించవచ్చును.

ఆంధ్రలో 7 ప్రాజెక్టులు

ఈ విధమైనటువంటి 'పట్టణ సంక్షేమ ప్రాజెక్టు'లు షుమారు 100 భారతదేశంలో నెలకొల్పవలసి వున్నది. ఆంధ్రప్రదేశ్‌కు ఏడు మాత్రమే కేటాయించబడినవి. చిరకాలంగా సంఘసేవ చేస్తున్న సంస్థలు నిర్ణీత ఫారంమీద దరఖాస్తు వ్రాసి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహాసంఘానికి, కేంద్ర సమితికి ఒకేసారి పంపుకోవాలి.

'ప్రాజెక్టు' ప్రారంభించడానికి ఒక్కొక్క సేవాసంస్థ ఎన్నుకొన్న ప్రదేశంలో ఏవిధమైన యితర సంఘ సేవా కార్యక్రమములు నిర్వహించబడటం లేదు అని ముందుగా నిర్ధారణ చేసుకొని ఆ సంగతి స్పష్టంగా చెప్పాలి. నిర్వాహకుల సమర్థత, అనుభవం, వారు తీసుకొనబోయే కార్యక్రమం యొక్క ఉపయోగం, దానికి కాగల ఖర్చు—వీటిమీద గ్రాంటు యివ్వడమనేది ఆధారపడి వుంటుంది.

చాల సంస్థలలో నిస్వార్థపరులైన వ్యక్తులున్నారు. కొద్దిపాటి వనరులతో సరిగా పనిచేయలేకపోతున్నవి చాల సంస్థలు. స్వల్పాదాయంమూలంగా అవసరమైన పరికరాలు, సుశిక్షితులైన ఉద్యోగులు దొరకడం లేదు వారికి. ఏ కొద్ది ఆర్థిక సహాయం ఉన్నప్పటికీ వారు ఆ హంగులను సమకూర్చుకొని జయప్రదంగా సంఘసేవా కార్యక్రమాలను నిర్వర్తించగలుగుతారు. అట్టివారికి చేయూతనివ్వడమే కేంద్రసాంఘిక సంక్షేమ సమితి ఉద్దేశ్యము. సంస్థలు తమకుతాముగా పనులు చేసి, ఖర్చుచేస్తున్న మొత్తాలలో లోటు భర్తీచేయడం కాదు సమితి ఉద్దేశ్యం.

కొందరికి ఒక సందేహం కలుగవచ్చును. ప్రస్తుతం పురపాలకసంఘాలు ఉచిత పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు నడుపుతున్నవి కాదా?—అదేవిధంగా పారిశ్రామిక కార్మికులకు అనేక సౌకర్యాలు ప్రభుత్వంవారు, యజమానులు కల్పిస్తున్నారు కాదా—ఈ 'ప్రాజెక్టు' కార్యక్రమాలు చర్విత చర్వణం కానేరవా అనవచ్చును. అది నిజమే. ఒక ప్రదేశంలో, ఒకవాడలో ఏమి కొరత వున్నదో, అది గమనించి, అత్యవసరమైన కార్యక్రమం నిర్వహించడమే ఒక ముఖ్యమైన సమస్య. సంక్షేమ కార్యక్రమాలనేవి ఒకరికి యిద్దరుగా నిర్వహించడం డబ్బు దండగ అయినా ఏదీ సమగ్రంగా ప్రజలకు అందకపోవడం, అనేది సంక్షేమ కార్యకర్తల పట్లవున్న ఒక పెద్దవిమర్శ. ఈ 'పట్టణ సంక్షేమ ప్రాజెక్టు'ల విషయంలో, సమితి యీ అంశాన్ని తప్పనిసరిగా గుర్తిస్తుందనీ, ఆ యా కార్యక్రమాలను సమన్వయించడంలో శ్రద్ధ తీసుకొంటుందని ఆశిదాం. ★

(ఒక విలేఖరి)

నేను అట్టే చదువుకోలేదు

నేను అట్టే చదువుకోలేదు కనీసం హైస్కూలు చదువైనా లేని పల్లెటూరులో అప్పుడు ఎందుకు ఉన్నానా అని ఇప్పటికీ బాధపడుతూవుంటాను. పట్నాలకు వెళ్లి చదివిన నాతిమ్మలంతా డిగ్రీలు తీసుకొని, ఉద్యోగాలు చేస్తున్నారు. నాతో పల్లెటూరు గర్ల్‌స్కూలులో చదివిన స్నేహితురాండ్రు కొందరు డాక్టర్లుగానూ, లెక్చరర్లుగానూ వృద్ధిలోకి వచ్చారు. కొందరు సంతకం చేయడంకూడా ఎల్లాగో మరిచిపోయారు, నేనుమాత్రం యీ మధ్యరకం చదువుతో వుండిపోయాను. ఉన్నత విద్య గగన కుసుమంగానే వుండిపోయింది.

జులై 2వ తేది పత్రికలో నేనూ చదివాను బి. ఏ. అయితే ఏంలాభం? అన్న వ్యాసం, టి. ప్రభావతిగారు రాసినది చదివి ఆశ్చర్యపడ్డాను. డిగ్రీలు పొందిన విద్యాధికురాండ్రే ఆడవాళ్ళకి చదువెందుకని ప్రశ్నిస్తోంటే. స్త్రీ విద్యను ప్రోత్సహించి అభివృద్ది తీసుకువచ్చేవారు ఎక్కడ కనిపిస్తారు. ప్రభావతిగారు తన రైలు ప్రయాణానుభవం పురస్కరించుకొని తక్షణం ఆడవాళ్ళకి చదువు అనవసరం అనే నిర్ణయానికి వచ్చేశారు. ఆ రైలుపెట్టెలో ప్రభావతీ దంపతులతో ప్రయాణం చేసినవారు వృద్ధదంపతులు కనుక పూర్వాచార ప్రకారం పిల్లలిద్దరేనా? అప్పు నివాలికే అనేసి ఊరుకున్నారు. అదే మరో యువదంపతులై, కొంచం కలిసికట్టుగా మాట్లాడేవారు ప్రభావతిగారికి తటస్థపడితే యింత నిరుత్సాహపడియుండరనిపిస్తోంది. ఈనాటి మహిళలు ఎంత తక్కువ పరిచయంతో నైనాసరే మీరేం చదువుకున్నారనే ప్రశ్న ప్రతివాళ్లనీ వేస్తూవుంటారు. సంభాషణ మొదలుపెట్టిన దగ్గర నుంచీ, అంతర్జాతీయ సమస్యలనుండి ఆంధ్రపత్రిక వనితాలోకం శీర్షికవరకూ కబుర్లుదొర్లిపోతాయి, 'కామాలూ, ఫులుస్టాపులూ' లేకుండా.

మోచర్ల సుబ్బలక్ష్మి
భీమవరం

నేను ఎక్కడికైనా వెళ్లినా ఎవరేనా మా ఇంటికి వచ్చినా మీరేం చదువుకున్నారని నన్ను అడిగే వాళ్లు చాలామంది కనిపిస్తారు. ఏం చదువుకోలేదంటే నమ్మరు, ఒక్కొక్కప్పుడు చాలా విసుగు కలుగుతో వుంటుంది చదువుకోలేదని స్పష్టంగా చెపుతోన్నా నమ్మకపోతే ఏం చెయ్యాం.

ప్రభావతిగార్ని ఏం చదివావని అడుగకపోవటం పరాభవంగా ఎంచుకొని ఆడచదువు ఇంతే కాబోలు ననుకున్నానన్నారు. ఆడచదువూ మొగచదువూ అనే రకాలు లేవు. విద్య పురుషుల కెంత అవసరమో స్త్రీలకూ అంతే అవసరము. స్త్రీలకే చదువు బాగుగా వస్తోందని మేధావులంతా చెపుతోనే వున్నారు. ఆడపిల్లలు చదివినంత శ్రద్ధగా మొగపిల్లలు చదవకపోవటం ప్రతికుటుంబము లోనూ చూస్తూనే వున్నాము: "ఆడది చదువుకోవడం 75% దండుగ. ఈ విషయంలో నాతో ఎంత మంది ఏకీభవిస్తారో!" అంటూ ప్రభావతిగారు వ్యాసాన్ని ముగించారు. వారితో ఈవిషయంలో ఏకీభవించేవారు నూటికి ఇద్దరో ముగ్గురో వుంటారేమో, అసలు వుండకపోయినా ఆశ్చర్యంలేదు.

ఆడవాళ్ళే ఆడవాళ్ళకి చదువు నిరర్థకం అని వ్యాసాలు రాస్తూవుంటే మొగవాళ్ళంతా సంతోషిస్తారంతే, పైగా ఆవిడ బహుబాగా రాశారంటారు కూడా; మనలో కొమ్మ వెళ్లి గొడ్డలితో చేరుటవల్లే మహందర్ని నరికేశక్తి మానవుడికి కలిగిందని చింతించే చింత చెట్ల సామెత స్త్రీలకు కూడా వర్తిస్తుంది.

గత 20 సంవత్సరాల నుంచీ స్త్రీ విద్య అభివృద్ధి చెందుతోనే వుంది. ఇప్పుడిప్పుడు చాలామంది అమ్మాయిలు ఉన్నత విద్య నభ్యసించి ఉద్యోగాలు చేస్తూనే వున్నారు. వివాహానంతరం భర్తగారి ఇష్టప్రకారం ఉద్యోగం చేయడమో మానేయడమో జరుగుతోంది. అసలు ఉద్యోగం చెయ్యకపోయినా, లేక మానివేసినా చదివిన చదువు నిరర్థకం ఎల్లా అవుతుంది విద్యాధనం నశింపు లేనిది. "తరుగదు విరుగదు వీసమైన విద్య నృపాలపూజితము" అన్నారు పెద్దలు. విద్య విదేశబంధువు అన్నారు. ప్రభావతిగారు తనని ఆ దంపతులు ఏం చదివావని అడుగుతారేమో చెప్పి ఆ చదువు సార్థకమైనట్లు సంతోషిద్దా మనుకున్నా నన్నారు. అంతేనా? చదువువల్ల లాభం పరులు ఏం చదివావని అడిగి మెచ్చుకోవడంకోసమేనా? చదువుత, చదువువల్ల వారికి కలిగిన లాభం ఒకటికూడా లేకపోవటం శోచనీయము. చదువుకున్న ప్రతి మహిళా ఉద్యోగం చేస్తోందా? లేదు. ఆ మాటకువస్తే చదువుకున్న మగవాళ్ళంతా మాత్రం ఉద్యోగాలు చేస్తున్నారా? లేదు. వారి వారి అవసరాలను బట్టి కుటుంబ సాంప్రదాయాన్నిబట్టే వర్తిస్తారు. అందుచేత పెద్ద చదువులు చదివిన యువతులంతా ఉద్యోగం చెయ్యనంత మాత్రంచేత తమ చదువు బూడిదలో పోసిన పన్నీ రనుకోకూడదు. విద్యావతియగు స్త్రీ ఆఫీసు పనులలో భర్తకి సాయపడి భర్త ఆరోగ్యాన్నీ, సంపాదననీ కాపాడుకోవచ్చును, తన పిల్లలకు విద్యాబోధన చెయ్యవచ్చు. సాహిత్య రంగంలో రాణించవచ్చు. మహిళా సంఘాలను ఆదర్శవంతంగా నడుపవచ్చు. సంసారంలో అర్థకంగా ఎంతో పొదుపు చూపి భర్త మన్నన బడయవచ్చు. స్త్రీ విద్యవల్ల లాభంలేద నేవారు ఒక్కటి. ప్రభావతిగారు తప్ప, మరెవరూ ఇంతవరకూ ఈవిధంగా అనలేదు. అనబోరు. ఈ వ్యాసాన్ని ఇంతకన్న బాగా రాద్దామనుకున్నాను. కాని రాయలేకపోయాను, నేను అట్టే చదువుకోలేదు, అందుచేతనే రాయలేకపోయా ననిపిస్తోంది. ★

మన సమాజంలో భర్తృవిహీనల దుస్థితి

కావలసింది చల్లటిమాట

ఎన్నెంతనే బాణతో హృదయాలు ద్రవించే విషాదగాథలను ఆధునిక సమాజంలో అగచాట్ల బరువుకింద అణగారిపోతున్న అనాథ వనితలు వినిపిస్తూవున్నారు. ఆభరణాలకీ, అలంకారాలకీ ఆనందాలకీ దూరమైపోయి అడివినికాసిన వెన్నెలవంటి జీవితాలని వెళ్ళదీస్తూ హేళనలకీ, తిరస్కారాలకీ, నిరసనలకీ, నిందలకీ గురిఅవుతూ దీనాతిదీనంగా కాలం వెళ్ళదీస్తున్న, అభాగినుల కష్టాలు వింటే శిలలుకూడా జలజల కన్నీరు రాల్చగలవు పసివయసులోనే పసుపుకుంకుమలకు దూరమైపోయిన అభాగినులు తీరని కోరికలతో ఫలించని ఆశలతో భగ్నస్వప్నాలతో అనుభవించే దారుణమైన మనోవ్యథని అనాథలు దయనీయంగా వర్ణిస్తున్నారు. నిజమే కానివైధవ్యంవలనకలిగే ఆర్థికమైన,సాంఘికమైనబాధలు కూడా దుర్భరమైనవే. వీటివల్ల వైధవ్యం స్త్రీకి ఏ వయసులో ఎదురైనప్పటికి ఆమె జీవితం దుస్సహమైన యాతనలతో నిండిపోతున్నది. పెళ్ళినాడు తప్ప భర్త ముఖమే ఎరుగని అభాగినుల బాధలు ఎంత ఘోరమైనవో, కొన్ని యేళ్ళపాటు సంసారజీవనం నడిపి సంతానాన్ని పొందిన మీదట భర్తని కోల్పోయిన అనాథ అనుభవించే వ్యథలు కూడా అంత క్రూరమైనవే.

అత్తవారివైపు ఆస్తి వుండగా ఉన్నది కాస్తా భర్త వైద్యానికి హారించిపోతుంది. ఒక నవలలో శరత్‌బాబు అన్నట్లు కొందరు రోగులు తాము చనిపోయేసరికి బతికివున్నవాళ్ళని సగం చంపి మరీ పోతారు భార్యా పిల్లలూ దిక్కులేని పక్షులైపోతారు. ఎట్లాగో నావలాగా సంసారం దరీ తెన్నూ లేని పరిస్థితులలో అల్లాడిపోతుంది. అసహాయస్థితిలో పిల్లల్ని వెంటపెట్టుకుని పుట్టింటికిచేరుకోటం తప్ప అనాథకి ఇంకో దారి కనిపించదు. అన్నగారి పంచనో, తమ్ముడి పంచనో తల దాచుకోవలసి వస్తోంది. తనూ పిల్లలూ ఆర్థికంగా జన్మాంతరమూ ఇతరుల దయాధర్మాలమీద ఆధారపడి, ఇతరులకి అణగిమణగి కాలం వెళ్ళదీయటంకంటె అనాథ స్త్రీకి అగ్నిపరీక్ష ఇంకోటి వుండదు. వదినకో మరదలుకో లొంగి వొంగి సలాము చేస్తూ, వంటపనీ ఇంటో చాకిరీ మీద వేసుకుని గాథల్ని లోపలే దిగమింగుకుని పెదవి విప్పకుండా వుంటేకాని తనకీ పిల్లలకీ నిలవ నీడకాని, వంటికిగుడ్డకాని, పూటకితిండికాని దొరకని దిక్కులేని పరిస్థితిలో వైధవ్య దుఃఖంతో క్రుంగిపోయేఅనాథస్త్రీలుఎందరో వున్నారు. ఒంట్లో సత్తువున్నంతకాలం బండచాకిరీచేసినా ఒకపూట జ్వరం వచ్చి పడుకుంటే ఎన్ని సాధింపులకో సతాయింపులకో గురికావాలి. ఇంట్లో చాకిరీకి ఏర్పడిన జీతంబత్తెంలేని సేవకురాలుగా కొన్ని సంసారాల్లో అనాథని పరిగణిస్తున్నారు. ఇంటో వున్న ఇతర పిల్లలు మంచి రుచికరమైనబలం ఇచ్చే ఆహారం తింటుంటే అదే పంక్తిలో అనాథకన్న అభాగ్య సంతానం అడుగు బొడుగువ మిగిలినవీ, చద్దికంపు కొట్టేవీ, చవీ సారం లేనివీ అయిన పదార్థాలనే కిక్కురు మనకుండా తింటుంటే తను వండిన పదార్థాలనే తన బిడ్డలకు వడ్డించుకునే స్వాతంత్ర్యం లేని కన్నతల్లి కడుపుమంట లోపలే కుమిలిపోతుంది. గొప్పఇళ్ళలో పుట్టినా వైధవ్యం వచ్చేసరికి అక్కచెల్లెళ్ళూ అన్నదమ్ములూ అనాథని చిన్నచూపు చూస్తారు. కడుపులో పెట్టుకుని

శ్రీమతి ఇంద్రాణి

ఆదరించి ఆదుకోవలసిన కన్నతల్లికూడా కొన్ని ఇళ్లలో క్రూరరాక్షస రూపం ధరించటం చూస్తున్నాం. అల్లుడు పోయి కూతురూ పిల్లలూ తన పంచను చేరబట్టే తన సంసారానికి కష్టాలు చుట్టుకున్నవని అస్తమానం సాధించే తల్లులుకూడా వున్నారు. మిగిలిన కూతుర్లు సీతాకోక చిలకల్లాగా సిల్కు చీరలతో తిరుగుతుంటే, చినిగిన పాత చీరతో నలుగురి ఎదుటికి రావటానికి సిగ్గుపడి వంటింట్లో చాకిరితో సతమతమై పోతున్న అనాథయైన కూతురుని గురించి చీమకుట్టినంతైనా బాధపడకుంటే "అది వాళ్ల భాగ్యం; ఇది దీని రాత ఎవరి అదృష్టానికి ఎవరు కర్తలు?" అని వేదాంతం వెళ్ళబోసే తల్లులు లేక పోలేదు. అనాథ తనకూతురే అయినా ఆర్థికంగా తనకో గుదిబండ కావటంవల్ల, కూతురూ పిలలూ తన మీద ఆధారపడటం వల్ల సహజ వాత్సల్యం కూడా హరించుకుపోతోంది. అన్నదమ్ములకీ అక్కచెల్లెళ్లకీ వదినలకీ మరదళ్లకీ అనాథలు పీడాకారంగా, శనిగా, హాయిలేని బరువుగా కనబడితే ఆశ్చర్యం లేదు.

కొద్దోగొప్పో అత్తవారి వైపునుంచి ఆస్తి సంక్రమించిన వితంతువులు కొందరు అన్నలో తమ్ముళ్లో నమ్ముకుని వాళ్ళపంచను చేరిత వాళ్ళు కనిపిస్తారు. డబ్బువుంది గనుక వదిన ఆదరిస్తుంది. అన్నయ్య గౌరవిస్తాడు. మేనల్లుళ్ళూ మేనకోడళ్ళూ ప్రేమిస్తారు. అన్న పిల్లల్నే తన పిల్లలుగా అనాథ ప్రేమించి తన డబ్బును వాళ్లకి పెడుతుంది. అలా పెట్టక ఏ కాశీ రామేశ్వరాలకో వెళ్లామనుకున్నా, ఏ పుణ్యకార్యాలకో తన ధనం స్వతంత్రంగా వినియోగించదలచినా ఒక్కసారిగా ఆవిడ అందరికీ శత్రువై పోతుంది. కొందరు బుద్ధిమంతులైన అన్నలూ తమ్ముళ్లూ అమాయకులైన వితంతు సోదరుల ఆస్తిపాస్తులని యుక్తిగా చేతచిక్కించుకుంటారు. అంతదాకా గౌరవించిన అనాథని ఇక నీతో పనేమిటి? నీయిష్టంవచ్చిన చోటికి పోయి చెప్పుకో అన్నంత అమానుషంగా నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తారు. చిన్నప్పుడే వితంతువైన ఒకావిడ తనకి ఉన్నదంతా తెగనమ్మి అన్నగారికొడుకులకి పెద్దచదువులు చెప్పించి పైకి తీసుకొచ్చింది. ఇప్పుడు వాళ్లంతా గొప్ప ఉద్యోగస్తులు వాళ్ళ ఇళ్లకివెళితే వాడు ఆమెకు దాసీదానికున్న గౌరవం కూడాదొరకదు. అందుకని ఆవిడ ముసలితనంలో కూడా వంటరిగా వండుకు తింటూ పడిపోతున్న పూరిపాకలో కాలం వెళ్ళదీస్తున్నది. పాతికేళ్ళు నిండకుండానే ఒకామె భర్తను కోలుపోయింది నలుగురు కొడుకులు రెక్కలు రాని పసికూనలు. పుట్టింటివైపునా, మెట్టిన ఇంటివైపునా, ఏమీ ఆధారం లేదు. ఒక చిన్న భోజన హోటల్ పెట్టి పిల్లల్ని పెద్దవాళ్లని చేసింది. రెక్కల కష్టంతో అందరికీ చదువులు

(49-వ పేజీ చూడండి)



"అన్నట్టు నీకు 90 ఏళ్ళ జైలుశిక్ష అన్నారు కదూ? అయితే, ఆ గుమ్మంముందు వుండే ఆ పక్క నీవు తీసుకో—నాకు యావజ్జీవ శిక్షే; తెలిపిందికదూ!"

వనితా వాణి



అసలు విషయం

వితంతుస్త్రీకి అలంకరణ లుండాలా వద్దా అనే చర్చకన్నా, వితంతుస్త్రీని చీడపురుగులా చూచే అలవాటుకు స్వస్తి చెప్పాలి. చెడుత్రోవలో పడి, వ్యభిచారిణిగ తయారయే అవకాశము లున్నపుడు, అంతకంటె మేలుగ ఆ స్త్రీ ఇష్టంపై పునర్వివాహం చేస్తే, అటు ఆమెకు ఇటు సంఘానికి మేలు చేసినట్లవుతుంది. సమాజంలోని పరిస్థితులను బట్టి కాలానుగుణ్యంగ యీ విషయమును పరిశీలించవలెను అంతేకాని కేవలం సనాతన ఆచారాలను గ్రుడ్డిగ అనుసరిసే లాభం వుండదు. వీటన్నిటికి గొప్పమార్పు తల్లిదండ్రులలో సంఘసంస్కర్తల మని విర్రవీగే ఈ కాలపు యువకులలో రావాలి. మనసులలో మార్పురానపుడు, వాగ్వాదాలు శాసనాలు ఏం సాధించలేవు.

—"వెన్నెల. పతి" విజయపురి.]

* * *

జూలై 16 వారపత్రికలో "విషాదగాథ–వింటే బాధ" అని రాధ (హైద్రాబాదు) గారిచే రచించబడిన శీర్షిక చదువుచున్నంతసేపు ఒక సినిమాకథ చదివినట్లుగావుంది. ఈ రచనలోని కవిత్వమంత ఘాటుగా జీవితములో వుండటమనేది అసంభవం.

చదువు పూర్తి అయ్యేంతవరకు అన్ని బాధలు పూర్తిగాభరించి విద్యను పూర్తి చేసుకోవటం వుత్తమం. అప్పుడీ సంఘానికి బలికావలసిన అవసర ముండదు. కన్నీళ్ళతో హృదయాన్ని చల్లార్చవలసిన పనీలేదు.

భర్త అంటె యేమిటో తెలియని వయస్సులో భర్తను పోగొట్టుకొన్నవారు విధవలు కారు. కన్యలే.

10 వ తరగతి ప్యాసయ్యేరు కాబట్టి చదువు పూర్తిచేసుకొని వుద్యోగం చేసుకొంటే యీబాధ లుండవు. ఎవరూ యేమీ అనరు. ఆనాడు సంఘానికి బానిసలుగా కాక నాయకులుగానే బ్రతకవచ్చు. అటువంటివారు చాలమంది వున్నారిప్పుడు.

—దాడి వెంకట్రావు, విజయవాడ]

* * *

విషాదగాథేగాని, వితంతువివాహాలు సర్వసామాన్యమైన ఈరోజులలో ఆమె పునర్వివాహమున కొటంక మేమున్నది? కాని ఒక్కొక్క కుటుంబపుపరిస్థితులొక్కొక్క మాదిరిగ నుండును. పరాధీనయగు స్త్రీ కుటుంబపు పరిస్థితులకు తలయొగ్గక తప్పదుగదా! పాపము రాధగారి కుటుంబ పరిస్థితులామెకు చదువుటకుగాని ఉద్యోగము చేయుటకుగాని పునర్వివాహం చేసుకొనుటకుగాని అవకాశ మీయుటలేదు గాబోలు. తనవంటి అభాగినుల మొర వినుమనీ, వారికి పసుపుకుంకుమలు పెట్టుకొనే భాగ్యము కలుగజేయుమనీ ఆమె సంఘమును (లోకమును) ప్రార్థించి లాభమేమి? ప్రస్తుత సంఘము స్త్రీల పునర్వివాహము, వితంతువులు గూడ విద్యార్జన చేయుట కనుకూలతలు, ఉద్యోగార్హతలు అన్నియు కలిగించేయున్నది. ఇందు సంఘలోపములేదు.

—ఇమ్మనేని చంద్రకాంతామణి, బళ్ళారి]

* * *

'విషాదగాథ — వింటేబాధ' అని రాధ (హైదరాబాదు) గారు వ్రాసిన వ్యాసం చదివాను. సంఘంలో భర్తృవిహీనలకు జరుగుతున్న అగౌరవంచూస్తే గుండె తరుక్కుపోతుంది.

—మునగవలస శారద, (యానంపేట)

* * *

శ్రీమతి వుంతకల్ పరిమళ గారు వ్రాసిన "మన సమాజంలో భర్తృవిహీనుల దుస్థితి" అను వ్యాసము చాల బాగున్నది. ఇటువంటి వ్యాసములు చదివైనా సనాతనుల దృక్పథం మార్పుతారేమోనని నేను ఆశించుచున్నాను.

—రామలక్ష్మి, ఆర్మూరు]

* * *

ఈరోజుల్లో సంఘానికి జడిసే వారెవరండీ? సంఘంపేర అన్యాయంగా ఎవరు బ్రతుకుతారు. ఈరోజుల్లో విధవలు పునర్వివాహము చేసుకుంటున్నారు. వివాహము చేసుకోకపోయినా మామూలు స్త్రీల మాదిరిగానే వుంటున్నారు. కానీ రాధగారు ఏదో వ్రాసేశారు.

—పి. యం. కృష్ణమూర్తి, రాజోలు]

* * *

రాధగారికి; సోదరీ! మీ విచారపూరితమైన గాథ చదివేను. అది చదివినంతసేపు మీయందు నాకు ఒకవిధమైన జాలి కలిగింది. వ్రాసిన వ్యాసాలన్నీ నిరర్థకమే గానీ, తోటి సోదరీమణులకు ఉపయోగం ఏమీ లేదు. ఇదంతా కంఠశోష అంటే ఇంకేమీ లేదు. ఇకమీద మీజీవితం వడిదుడుకులు లేకుండా సాఫీగా గడిచిపోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. మీ చరిత్ర చదివినంతసేపు మీరు ఎదురుగావుండి చెపుతున్నట్లే వుంది. ఇటువంటి వ్యాసాలన్నీ ప్రతివారం చదువుతూనే వున్నాను. వాటిపై విమర్శలు చూస్తూనే వున్నాను. కానీ వాటిపై నేనేమీ అభిప్రాయం తెలియజేయలేదు. మీకు వ్రాయాలని బుద్ధిపుట్టింది. అందుకే చదివిన వెంటనే వ్రాశాను. సెలవు.

—బలభద్రుని వరలక్ష్మి, విజయనగరం]

* * *

ఇంతవరకు ఎన్ని వితంతు వివాహాలుజరగలేదూ! సంఘం వాటిని అడ్డుపెట్టిందా? అట్లా వివాహం చేసుకున్నవాళ్ళని "వెలి" వేసిందా? నేను కళ్ళారా చూచినవిషయం రాస్తున్నాను చదవండి నేను హైస్కూలులో చదివేటప్పుడు మా క్లాసులో, ఒక అమ్మాయి వుండేది ఆ అమ్మాయికి అప్పటికి 18 ఏండ్లు. అప్పటికే ఆమెకు పెళ్ళికావటం, భర్తపోవటం జరిగింది. కానీ ఆ అమ్మాయి పూలు పెట్టుకునేది. గాజులు వేసుకునేది బొట్టు పెట్టుకునేది ఆ అమ్మాయిని ఏ సంఘం అడ్డుపెట్టింది? ఇప్పుడు ఆ అమ్మాయికి, వివాహముకూడా అయింది. భర్తతో సుఖంగా వుంటున్నది. వ్యాసాలు రాయడం యవ్వనాన్ని సంఘానికి బలిపెడతాననడం, సంఘానికి జీవితాన్ని ధారపోస్తాననడం తప్పు. అర్థంకాదు. వెనుక మీరు సంఘాన్ని, ఏకటం, మానుకోలి. మీ తల్లిదండ్రుల ఇష్టమైతే మరల పసుపుకుంకుమ పొందడం. సంఘానికి జీవితాలు బలి ఇవ్వటం చాలా అనవసరము.

—డి. ఆర్. కె. శర్మ, మహబూబ్ నగర్]

* * *

వనితావాణిలో వి. మంగళం (న్యూఢిల్లీ) గారు రాసిన "వాటాలో కోటా" బాగుంది. ఆమె చెప్పినటుగా వనితాలోకానికిగాను కేటాయించిన పేజీలలో 2 పేజీలు ఇంగ్లీషు భాషను నేర్పటానికి గాని, కట్టింగులు నేర్పటానికి గాని ప్రచురించాలి అని నేనుకూడా ఆమెతో ఏకీభవిస్తున్నాను.

—వాచస్పతి సరసు, తుంగభద్ర డామ్]

"శ్రీమతి చంపక" గారు వ్రాసిన వ్యాసము చాలా బాగున్నది. వి. పాప (బందరు).

కె. కృష్ణవేణిగారు వ్రాసిన "సంస్కారం అంటే—" అనే వ్యాసం చదివాను. చదువున్నా లేకపోయినా సంస్కారంవుంటె సంసారం చక్కదిద్దుకోవచ్చును అన్నారు. అది నిజమే. కాని వారు ఉదహరించిన పక్కింటి పార్వతమ్మ చదువుకపోయినా సంస్కారముగలదైనందుకు ఆమెను అత్త, తోడికోడళ్ళు గౌరవించారు. కోడలు సంస్కారముగలదైతే మటుకు అత్త, తోడికోడళ్ళు సంస్కారము లేనివాళ్లయితే కుటుంబం ఎలా బాగుంటుంది? పై ఉదాహరణ కేవలం ఒకరికి సంస్కారంవుంటె, కుటుంబంలోని అందరిచేత గౌరవింపబడతారని వారి అభిప్రాయమేమో! కుటుంబంలోని ప్రతిఒక్కరు సంస్కారముగల వాళ్ళయితేనే ఆకుటుంబం నిత్యకల్యాణం-పచ్చతోరణంగా వుంటుంది.

—జి. డేవిడ్. ద్రోణాచలం]

* * *

విషాదగాథ నిజంగా బాధే!

బాలరోజులనుంచి భర్తృవిహీనల దుస్థితి అంటూ ఎవరికి తోచింది వారు వ్రాస్తున్నారు. కొన్ని సందర్భంగాను, కొన్ని అసందర్భంగాను వుంటున్నాయి.

ఈమధ్య వ్రాసేవన్నీ కూడ అర్ధశతాబ్దపు క్రితంగా జరిగినవే వ్రాస్తున్నారుగాని ఇప్పటి సమాజంలో ఏ మూలపల్లెల్లోగాని, వింత సనాతనులలోగాని అంత వికృతంగా చేయడంలేదు. పత్రికవారు వ్రాయమన్నారు గదా అని నాయనమ్మ, తాతమ్మల అనుభవాలు, వారినాటి ఆచారాలు వ్రాస్తున్నారు.

కొంతమంది వ్రాసినదాంట్లో వితంతువులను వీధిలోకి రానీయరని, పొయ్యికే అంకితం చేస్తారని, అన్నదమ్ములు ఆదరణగా చూడరని వ్రాశారు. కొంతమందికి కొన్ని సందర్భాలలో కష్టంగా వుండవచ్చునేమోగాని స్వతంత్రవాయువు వీచ్చే భారతదేశంలో ప్రతీవారు వ్యక్తి స్వాతంత్ర్యానికి ముందడుగు వేస్తూనేవున్నారు.

ఇంక నిజంగా విషాదగాథ ఏమిటంటే జూలై 16 వ తేదీ పత్రికలో వ్రాసిన రాధలాంటివారిది, అంతేగాని ఏదో వ్రాశాము. ఏదో అచ్చయింది, అనికాదు మనం చూడవలసినది. అంత అజ్ఞానదశలో పెళ్ళిచేసి ఆ పిల చేత వితంతువేషం వేయించడం చాల దురన్యాయం. భర్తతో సంసారంచేయని పిల్లలకు ఆ యోగంవస్తే పసుపుకుంకుమలు కూడ తీయనవసరంలేదు. కొన్నాళ్లు సంసారంచేసి పిల్లలు బయలుదేరితే వారికే విరక్తి కలిగి అన్నిటికి విముఖంగానే వుంటారు. అంత చిన్నవయస్సులో వున్నవార్ని బాధపెట్టకుండా మామూలుగావుంచి వార్ని చదివించి, మళ్ళీ పెళ్ళిళు చేయవచ్చు. పెళ్ళి అవకపోతే వుద్యోగం చేసుకోవచ్చు. అంతేగాని వార్ని పొయ్యికి అంకితం చేయడం మంచిపనిగాదు.

మా పెద్దమ్మమ్మకి ఏడవ ఏట భర్తపోతే 14 వ ఏట కేశఖండన చేయించి ముల్లుపంచ ఇస్తే 87 సంవత్సరములు ఆ ముల్లుపంచ మోసింది. ఇదిశతాబ్దంనాటిమాట. అంతేగాని నవీన భారతదేశంలో అంత అన్యాయం చేయడం మంచిదిగాదు.

—పాకలసీత, ఏలూరు]

* * *

ఇంకావున్నారా?

జూలై 16 వ తేదీ పత్రిక వనితావాణిలో తోలేటి కామేశ్వరరావుగారు గుంతకల్లు నుంచిరాసిన లేఖ "సరికొత్త పాత కోణం" అన్నది చాలా అమోఘంగావుంది. ఇంతవరకూ అటువంటిఊహను ఎవ్వరూ రాసివుండరని నా నమ్మకం. ఇంకా ఈ సమాజంలో ముందంజ వేస్తోన్న మన సమాజాన్ని త్రొక్కి వెనక్కినెట్టేవారు వున్నారని అనుకోలేదు. భర్తను పోగొట్టుకున్న భార్య అందరిచేత నానాదుర్భాషలాడించుకుంటూ, నలుగుర్లో తలెత్తుకు తిరగకుండా వుండే లాగ నానావికారంగా మనిషిని తయారుచేసి భర్తనుపోగొట్టుకున్న బాధకాకుండా ఇదొకొత్తబాధ తెచ్చిపెట్టడం ఏమి న్యాయం? భర్తతో వచ్చిన మంగళసూత్రం తప్ప ఒక్కనవి తియ్యనవసరంలేదు. ఈ ఖర్మ ఒక్క స్త్రీలకేనా చెందవలసింది? ఏం మగవారిలో భార్యపోయినవారికికూడా ఇటువంటి కొన్నివిధాలు మనం ఎందుకు చెయ్యకూడదు? భార్యపోయిన మరువాడు (చంటిపిల్లలున్నా సరే వారి మంచీ చెడూ యోచించకుండా) తిరిగి వివాహం ఆడేటందుకు పురుషులు ప్రయత్నాలుచేస్తారు. ఈవిధంగా అయితే జనాభా పెరగటంలేదా? ఒక్క స్త్రీలు వివాహమాడితేనేనా జనాభా పెరిగి తిండిలేకపోయేది? భార్యవుండగా తిరిగి వివాహం చేసుకునే పురుషులసంగతిఏమిటి? ఎంత ముసలివాడయినప్పటికీ ఇంకా నవయౌవనులను వివాహమాడాలని ఆశ కొద్దీ పిల్ల తల్లితండ్రులకి డబ్బునుచూపెట్టిఅన్నం, వున్నం ఎరుగని కన్యలను వివాహమాడి వారు పదిహేను సంవత్సరాలవారు కాకుండా వారిని విధవగాచేసి తాను హరీ అనడం మనం ఎన్నిచోట్ల చూడలేదు? ఎన్నిచోట్ల వినలేదు? ఇవన్నీ ఆయన పిట్టకథలక్రింద జమకట్టేరా? ఇటువంటి అనుభవాలు ఎన్నికాకపోతే శ్రీ గురుజాడ అప్పారావుగారు పుత్తడిబొమ్మ పూర్ణమ్మకథను రచించారు? భర్త గతించేవరకూ భార్య వుండాలా? భార్యకుమాత్రం అలాంటి అభిప్రాయాలు వుండకూడదా? ఏ మంచీ చెడ్డా ఎరగని స్త్రీలకి భర్తపోతే వివాహం చెయ్యకూడదా? అన్ని మంచి చట్టములను అమలులోనికి తీసుకువస్తోన్న మహానుభావులు శ్రీ కాశేశ్వరరావుగారు ఇకముందు భార్యపోయి తిరిగి వివాహం ఆడదలచిన ప్రతీ పురుషుడూ విధవనేగానీ వివాహం ఆడకూడదనే చట్టాన్ని అమల్లోకి పెట్టినట్లయితే ఇటువంటి సనాతనులు బలవంతాన్నయినా తమఅభిప్రాయాలను మార్చుకుంటారు.

—టి. వి. లక్ష్మి, కాకినాడ]

* * *

చదువూ సంస్కారం

జూలై 16 వ తేది వారపత్రికలో శ్రీమతి కె. కృష్ణవేణి (మద్రాసు) గారు వ్రాసిన "సంస్కారం అంటే...." అనే వ్యాసమును చదివాను. ఈవిషయములో వారితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. వారు, సంస్కారమనునది విద్యమీద ఆధారపడి యుండదనియు, అది జన్మతః వచ్చే లక్షణమనియు చక్కగా నిరూపించారు. ఈ కాలంలో చదువుకొన్నవారిలో కొందరు సంస్కారమంటే యేమిటో తెలియనివారున్నారంటే యాశ్చర్యము లేదు. చదువుకున్నవారికంటే చదువురాని వారు యెంతమాత్రము తీసిపోరని చక్కగా నిరూపించారు. చదువుకునిగూడ సంస్కారమున్నవారున్నారంటే గర్వించదగ విషయం. వారిలాంటి వ్యాసముల నింకెన్నో అందచేస్తారని ఆశిస్తూ నా ధన్యవాదములను తెల్పుచున్నాను. ★

—గానుగపాటి వెంకట శివానందం, కాకుమాను]

వంటలు

పెసరట్టుపులావు

పెసలు—పావుశేరు. రాత్రి నానపోసి పొద్దున పెసరట్ల పిండి రుబ్బుకోవాలి అల్లం, పచ్చిమిర్చి నూరి, వుప్పు, జీలక్ర, వుల్లిపాయ ముక్కలు సన్నగాతరిగి పిండిలో కలపాలి. అరచేతిమందంలో పెసరట్లు కాల్చాలి. వీటిని మరీచిన్నవీ పెద్దవీ కాకుండా ముక్కలు కోసుకోవాలి.

చిన్న అల్లంముక్క, ధనియాలు నూరి ½ గ్లాసు నీళ్ళలో కలిపి 10 ని॥లు మరగనిచ్చి కషాయంతియ్యాలి. బియ్యంకడిగి ఆరనిచ్చి, నేతిగిన్నెడు నేతిలో మంచి వాసన వచ్చేవరకు వేయించాలి. పొయ్యిమీద పావుశేరు నెయ్యిపెట్టి గరంమసాలా (లవంగాలు, చెక్క, యాకులు) బిరంజిఆకు వేసి శేరు బియ్యానికి. శేరునీళ్లు, తీసినకషాయం పొయ్యాలి కారం కావాలంటే పోపులోనే పచ్చి మిర్చివేసుకోవాలి. సరిపడు వుప్పువేసి నీళ్ళు మరిగాక బియ్యంవేసి మూతపెట్టాలి. వేరేగిన్నెలో కొంచెం నెయ్యిపోసి పెసరటు ముక్కలు వేసి 1 ని॥ వేగనిచ్చి 4 వుల్లిపాయలుముద్దా, కొద్దిగసాలు ముద్దావేసి నీరు కొద్దిగా చిలకరించి 5 ని॥ వుంచిదించాలి వండినఅన్నం కొద్ది బిరుసుగా వున్నప్పుడే సగం వేరే గిన్నెలోతీసి, పెసరటు కూరవేసి పైన తీసిన అన్నంవేసి గట్టిమూతపెట్టి పైన నిప్పు సెగలో వుంచాలి దించాక అంతాకలిసేట్లు కలుపుకోవాలి.

కొబ్బరిబాత్

సన్నబియ్యం:- ½ శేరు, కొబ్బరికాయలు 2, పచ్చిమిర్చి, వుల్లిపాయలు, గరంమసాలా, బిరంజీఆకు.

బియ్యం కడిగి ఆరనిచ్చి, నేతిగిన్నెడు నేతిలో మంచివాసన వచ్చేవరకు వేయించాలి పొయ్యిమీద ½ పావు నెయ్యిపెట్టి గరం మసాలా, పచ్చిమిర్చి చీల్చి వేసి బిరంజీ ఆకువేసి వేగాక ½ శేరు నీళ్ళు కొద్దిగా వుప్పువేసి మూత పెట్టాలి. వుల్లిపాయలు చక్రాల్లా తరిగి జీడిపప్పు బాగా ఎర్రగా వేయించాలి కొబ్బరికాయలు ముగురివి రుబ్బి పావుశేరు పాలు తియ్యాలి. నీళ్ళు మరిగాక అందులో బియ్యంవేసి పదునుగ వుడికేప్పుడు కొబ్బరిపాలు, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు వేసి గరిటకాడతో ఒక్కసారి కలిపి ఉమ్మగిల మూతపై నిప్పులు పొయ్యాలి ఖర్చు క్రమ అయినప్పటికీ చాలా రుచిగా వుంటుంది.

అనపకాయరొట్టె

కొంచెం లేత అనపగింజలు కప్పు కావాలి. మధ్యాహ్నం చేసుకుంటే పొద్దుటే ఒకకప్పు సెనగపప్పు నీళ్లలో నానపోయాలి. మధ్యాహ్నం పప్పు రోట్లో వేసి



"బాలరాజు"

—ఫోటో, ఏ. శేషాద్రి, సికింద్రాబాదు.

రవ్వమాదిరి రుబ్బి గింజలుకూడా వేసి రుబ్బాలి. సరిపడ్డ పచ్చిమిర్చి, వుప్పు, 4 వుల్లిపాయలు, కొంచెం జీలక్ర కచ్చాపచ్చాగా తొక్కి రుబ్బినపిండితో కలపాలి. పొయ్యిమీద కళాయిపెటి ఒక చెంచాడు నూనెగాని నెయ్యిగాని వేసి పల్చగా రొట్టె వేసుకోవాలి, రెండు వైపులా కాలాక వేడిగా తింటే కమ్మగా చాలా బాగుంటాయి.

లేత అనపకాయను కొబ్బరికోరులా కోరి మెత్తగా రుబ్బాలి పచ్చిమిర్చి, వులిపాయలు, వుప్పు, జీలక్ర మెత్తగానూరి రుబ్బినపిండితో కలపాలి 2 కప్పుల కోరుకు ½ కప్పు బియ్యం పిండి కలిపి రొట్టెలపిండివలె గట్టిగా కలపాలి ఒకబట్ట తడిపి పీటమీద వేసి పిండిని నారింజకాయంత సైజు తీసుకొని బట్టమీద పెట్టి పల్చగా రొట్టెలవలె చేతితో వత్తాలి. వాటిని పెనంమీద వేసి రెండువైపులా కొలింతగ్యాత నూనె వేసి ఎర్రగా కాల్చాలి. ఇవి వేడిమీదే చాలా రుచిగా వుంటాయి

బెంగుళూరు మిఠాయి

లేత బూడిదగుమ్మడికాయను చిన్న చిన్న ముక్కలుగా కోసుకోవాలి. ½ శేరు నెయ్యిపెట్టి ముక్కలు బాగ వేయించాలి కర కరలాడేట్టు కాకుండా దోరగా వేయించాలి 1 కప్పు ముక్కలకు 2 కప్పుల పంచదార బాగా పాకం రానిచ్చి అందులో వేయించిన ముక్కలు వేసి 5 ని॥ లు వుంచి జీడిపప్పు, కిస్‌మిస్ నేతిలో వేయించి అదీ యాలకుపొడి వేసి దించాలి. ఇది పొడి పొడిలాడుతూ వుంటుంది.

కాజాలు

బూడిదగుమ్మడికాయను పల్చగా ముక్కలు కోసి నేతిలో వేయించి పంచదార పాకంలో వెయ్యాలి. వుజాయింపుగ అన్నీ వేసుకోవాలి. ఇవి తింటుంటే గమ్మత్తుగా చాలా బాగుంటాయి

ఎమ్. జానకీభాస్కర్.
(సూర్యాపేట) ★

బాలసాహితి

బడాయి కోరు

సోమంచి సూర్యనారాయణశర్మ

బొంత కాకి కోకదానికి,
  చింత వొకటి పట్టుకొంది:
అందం లేనందుకు, తన
నందరు 'హాష్' అన్నందుకు.

"చేతిమీద నెక్కించుక,
చిలకను ముద్దిడుకొందురు;
కోకిలమ్మ కూస్తుంటే,
ఆకలి చెవితో విందురు

చిలక్కి, నాకూ వన్నెల,
పలుకు బడుల రాదుపోల్కి
నారూపే కోకిలమ్మ
తీరు; అదో పాట కత్తె.

కళాకళల చల చిత్తులు,
ఇలాంజనం మాటలకేం ?
పాటిమూకలో నైనా
పోటరి ననిపించుకొందు"

ఇలాటి తలపుల కాకం
మెలాగనో చెరివి కొంది
నెమలి పించియపు టీకల,
తెమలించిన పుర్రాకుల

ఇంత లింతలుగ లగించె
వింతతోక, బొంత కాకి
అచ్చ కేకి ననుకరించె,
డచ్చి నటన చలాకీ!

'నిక్కుబోత!' అంటూ ఎక
నక్కమ్ముల పలుగాకులు,
ఈ కలూడ దన్ని, దాన్ని
యినుప ముక్కుల బాడిచాయి!

పెద్దపెద్ద పోకిళ్ళకు,
హద్దులు మీరే బడాయి
కే కాలమునందు, 'బొంత
కాకి విందు' ఖాయమాయి!



వికటకవి యుక్తి

శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఒకసారి గజదొంగల గుంపు ఒకటి దేశంమీద పడింది. వారు చేసే దురాగతాలకి హద్దు పద్దు ఉండేదికాదు. ఎల్లా వచ్చేవారో అర్థరాత్రి అన్ని గస్తీలు తప్పించుకొని పట్టణాలలో కన్నాలు వేసి దొరికినదల్లా దోచుకుపోయేవారు. అడ్డంవస్తే క్రూరంగా నరికి పారేసేవారు. రోజూ ఎక్కడో ఒకచోట దొంగతనం విధిగా జరిగేది. అపార నష్టం సంభవించేది. చక్రవర్తి ఎంతోమంది సైనికులని కాపలా పెట్టాడు. కాని ఏమీలాభం లేకపోయింది. వారు ఎంత అప్రమత్తతో ఉన్నా దొంగతనాలు దోపిడీలు మాత్రం నిరాటంకంగా సాగిపోయేవి. శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా గుఱ్ఱాన్నెక్కి ఖడ్గం ధరించి నగరమంతా కలయతిరిగేవాడు. ఏమీలాభం లేకపోయింది. ప్రజల హాహాకారాలెక్కువయ్యాయి.

ఒకనాడు తెనాలిరామలింగకవి విచారంగావున్న చక్రవర్తి దగ్గరకు బయలుదేరాడు. రామలింగకవిని చూసేసరికి చక్రవర్తికి హాయి అనిపించింది. ఎందుచేతనంటే ఏ పనికైనా ఈ బ్రాహ్మడు సమర్థుడని తెలుసు రాయలకు. రామలింగనితో దొంగల సంగతి అంతా చెప్పి ఎల్లాగైనా రాజ్యాన్ని రక్షించవలసిన భారం నీదేనని చెప్పాడు. రామలింగడు చిఱునవ్వు నవ్వి "ఈ మాత్రానికే ఇంత భయపడతారేమిటి రాజా! రెండురోజుల్లో ఈ దొంగలగుంపు నంతనీ బంధించి మీ పాదాలమీద పడవేస్తాను. మీరు ఒక్క సైనికుని నా వెనకాల పంపనక్కర్లేదు. ఒక్క కానీ వ్యర్థం చెయ్యనక్కర్లేదు. కాని మీ కోటలోని చెరసాల తాళాలు మాత్రం నా కివ్వండి. ఎల్లుండి ఉదయం ఆ బంధితులను మీరు చూడగలరు. మీరు నిర్విచారంగా ఉండండి," అన్నాడు. అన్నంతపని చేసి తీర

గౌతమశ్రీ

కాదు వికటకవి అని తెలుసును చక్రవర్తికి. వెంటనే చక్రవర్తి చెరసాల అధికారిని పిలిపించి, చెరసాలలో ఉన్నవారి నందఱను ఇంకొకచోటికి మార్పించి ఆ తాళాలు వికటకవికి ఇప్పించాడు. రాజ దగ్గర సెలవుతీసుకొని బయలుదేరాడు రామలింగడు.

రామలింగకవి తిన్నగా ఒక పేదరాసి పెద్దమ్మ ఇంటికి వెళ్లేడు. ఆవిడ పరమ గయ్యాళి అని తెలుసు రామలింగడికి. నెమ్మదిగా కుశల ప్రశ్నలడిగి "పెద్దమ్మా! నీతో రహస్యం చెప్తా. ఎవరికీ చెప్పకేం. చెప్పకపోతే నీకు పది కాసులిస్తా," అన్నాడు. పెద్దమ్మ ఉబ్బిపోయి "అంతకంటేనా నాయనా! ఎవ్వరికీ చెప్పను. చెప్ప"మనికంగారుపెట్టింది. రామలింగడు ప్రారంభించాడు "ఇదిగో, మన ఊరికి దక్షిణంగా పెద్ద మఱ్ఱిచెట్టుఉంది చూశావూ, భట్టుమూర్తిగారి భవనం దగ్గిర, అక్కడ..." అని ఊరుకున్నాడు రామలింగడు. పెద్దమ్మఆత్రుత ఎక్కువైంది. నాలుగుసార్లు బతిమాలించుకుని మళ్ళీ మొదలుపెట్టేడు రామలింగడు. "ఆ చెట్టుక్రింద రాజుగారు నాలుగు లక్షల రూపాయలు ఖరీదు చేసే రత్నాలనుపాతిపెట్టారు. నువ్వు నాకు ఆప్తురాలివి కనక నీతో చెబుతున్నాను. జాగ్రత్త. ఎవ్వరికీ చెప్పకు" అన్నాడు. పెద్దమ్మ కళ్ళు పెద్దవిచేసుకొని ఆశ్చర్యంగా చూసి "అల్లాగే...ఎవ్వరికీ చెప్పను. నాకు మరి ఇస్తానన్న పదికాసులు..." అంది.

తెనాలిరామలింగడు కఠినంగా ముఖంపెట్టి "కాసులూ లేవు, కడియాలూ లేవు. నువ్వుమాత్రం చెప్పకు ఎవరితోటీ. నేను కాసులియ్యను," అన్నాడు.

పెద్దమ్మకి బ్రహ్మాండమైనకోపం వచ్చింది. "నేను ఈ రహస్యాన్ని ఊరూరా చాటించకపోతే నా పేరు అసలు పెద్దమ్మేకాదు చూసుకో.." అంది ప్రళయకాల కాళిలాగ. గట్టిగా కేకలుపెడుతూ రామలింగణ్ణి తిట్టిపోస్తోంది. సమయం కనిపెట్టి రామలింగడు చల్లగా జారుకున్నాడు అక్కడినుండి.

మూడురోజులయింది. దొంగల దౌర్జన్యాలను గురించి దేశమంతా కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

రోజురోజుకీ హాహాకారాలు పెచ్చు పెరుగుతున్నాయి. దొంగలను గురించి చర్చించడానికి ఆవేళ రాజుగారు ఒక మహాసభను ఏర్పరచారు. ఎవరేమి చెబుతారో దొంగల ఆచూకీని గురించి అని అంతా అతి నిశ్శబ్దంగా ఉన్నారు. ఇంతలో మన తెనాలిరామలింగంగారు సభలోనికి ప్రవేశించి, రాజుగారికి నమస్కరించి, తరువాత సభకు నమస్కరించి తన ఉత్తరీయంలో నుండి చెరసాల తాళాలుతీసి రాజుగారికి ఇచ్చేడు.

ఈ వికటకవి ఏమి చేస్తాడోనని సభ అంతా నిశ్శబ్దంగా ఉంది.

తెనాలి రామలింగడు చిఱునవ్వు నవ్వేడు. "అఖండాంధ్ర కర్ణాటక సార్వభౌమా! మహా ప్రజలారా! మిమ్మల్ని అనేక దినాలుగా బాధిస్తున్న దొంగల గుంపుని నేను బంధించివేశాను. మన కోటలో ఉన్న దుర్భేద్యమైన కారాగారంలో వారంతా బంధితులయి ఉన్నారు. మీకు అనుమానంగాఉంటే వెళ్ళి చూసుకోవచ్చును," అన్నాడు. రెండు నిముషాలు సభ అంతా మంత్రముగ్ధమయినట్లు ఆశ్చర్యంతో నిశ్చేష్టితమైంది. అంతమంది మహా సైనికులు, అపరాధ పరిశోధకులు పట్టలేని అజేయమైన గజదొంగల గుంపుని ఈ ఉత్తరీయం కప్పుకున్న వికటకవి బంధించాడంటే మరి ఆశ్చర్యంకాదూ?...

ముందర కవి, తరువాత రాజు తరువాత సభాసదులు అంతా చెఱసాల దగ్గఱకు వచ్చారు. ఆశ్చర్యం! నిన్నటివరకు ఖాళీగావున్న కారాగారం ఈవేళ కిటకిటలాడుతోంది. వందమంది దొంగలు మహా వ్యాఘ్రాల్లాగ రోషంతో అటూ, ఇటూ, పచార్లుచేస్తున్నారు దానిలో కింకర్తవ్యతామూఢులై.

ప్రజ లంతా ఆశ్చర్యచకితులై, సంతోషంతో "తెనాలి రామలింగ మహాకవికీ జై" అని జయ జయ ధ్వానాలు మిన్నుముట్టేటట్లు చేశారు. ఐతే ఇంతమందిని రామలింగడు ఏవిధంగా బంధించగలిగాడా అన్నదే అందఱికీ కలిగిన ప్రబల సందేహం. ఆనందంతో తిరిగి అంతా సభామందిరంలో కూర్చొన్నారు. రాజుప్రక్కనే నవరత్న ఖచిత హేమపీఠంపై తెనాలిరామలింగడు కూర్చొన్నాడు. మిగిలిన వారంతా ఏమి చెబుతాడో నని చెవులు నిక్కించి నిరీక్షిస్తున్నారు.

రాజుగారు లేచి సభవంక చూసి "మన కవిగారు ఈ మహాపదనుండి మనల్ని రక్షించారు. అంతమంది దొంగలను ఏవిధంగా బంధించారో ఆయన ఇప్పుడు చెప్తారు" అన్నారు.

ప్రజలు ఆత్రంగా ఎదురు చూస్తూండగా వికటకవి లేచి నిలబడి అన్నాడు:

"ఇదంతా భగవదనుగ్రహం. మనల్ని ఇన్నాళ్లుగా బాధించే దొంగలని బంధించడం నిజంగా ఆ దేవుని మహిమే. నేను నిమిత్తమాత్రుడిని మాత్రమే.

నేను రాజుగారికి చెప్పి సెలవు పుచ్చుకొని ఆనాడు తిన్నగా పేద రాశిపెద్దమ్మ ఇంటికి వెళ్ళాను. ఆవిడ పరమగయ్యాళి అని మన కంతా తెలుసునుకదా. నేను వెళ్ళి "మన ఊరికి దక్షిణాన్ని మఱ్ఱిచెట్టుంది. ఆ చెట్టుక్రింద రాజుగారు అమూల్య రత్నరాసులని దాచిపెట్టారు. ఈ రహస్యాన్ని నువ్వు ఆప్తురాలివి కనక నీతో చెప్తాను. ఎవరికీ చెప్పకపోతే పదికాసులిస్తాను" అన్నాను.

పాపం పెద్దమ్మ నిజమే ననుకుంది...కాని నేను కాసులివ్వ నన్నాను. అంటే ప్రళయస్వరూపం ధరించింది పెద్దమ్మ. దేశమంతా ఈ రహస్యం చాటించేస్తానని నన్ను భయపెట్టింది. ఆవిడ చెప్పినంతపనీ చేసితీరుతుందని తెలుసు నాకు. అసలు ఆమె అల్లా చాటించాలనే నేను ఆ విధంగా చేశాను. ఈ రహస్యం దొంగలకు తెలియాలని నా అభిప్రాయం.

పెద్దమ్మ చెప్పినంతపనీ చేసింది. ఆనోటా, ఈనోటా నే కల్పించిన రహస్యం దొంగలముఠాకు చేరింది. ఇంత ధనరాశి ఉందంటే వారు ఊరుకుంటారూ?...నేననుకొన్నట్లే రెండవనాడు రాత్రికల్లా మఱ్ఱిచెట్టు క్రింద మూగి ధనంకోసం అన్వేషిస్తున్నారు.

"నేను నెమ్మదిగా గుఱ్ఱమెక్కి ఆ చెట్టును సమీపించాను..."

రామలింగకవి కాస్సేపు ఆగాడు. అందరి ఉత్కంఠ పెచ్చు పెరిగింది. మళ్ళీ అందుకొని ఇలా చెప్పాడు:

"నేను అక్కడకు వెళ్లి ఒక చిన్న ఉపాయం పన్నాను. మానవ స్వభావం కనిపెట్టకలిగితే వారిచేత ఏమైనా చేయించవచ్చు. ఉద్రేకంలో వున్న మానవులు ఏపనైనా చేస్తారు.

నేను వెళ్లి, గట్టిగా "మీకు

★ వికటకవి యుక్తి ★

బుద్ధి వుందా లేదా? వెధవ దొంగతనాలు మీరూను. మీ కీరత్నాలు కావలిస్తే నాతో కుస్తీపట్టి తీసుకుపొండి. ఆ మఱ్ఱిచెట్టు క్రింద భూగృహం ఉంది. దాని తాళం నా దగ్గర ఉంది. ఎల్లా తీస్తారో చూస్తాగా" అన్నాను, వారికి ఎంతో ఆశ కలిగింది. ఆ ఆశలో మంచి చెడ్డలు ఆలోచించలేదు వాళ్లు. రెండు నిముషాల్లో నన్ను హతమార్చి నా దగ్గర వున్న తాళాన్ని తీసుకుపోయి ధనాన్ని కాజేద్దామనుకున్నారు. ఉన్నపళంగా అందరూ నామీద పడ్డారు. వాళ్లు ఇంకా పదిగజాల దూరంలో ఉండగానే నేను దాము తీసేను. తిన్నగా కోటవంకకు పరుగెత్తించాను గుఱ్ఱాన్ని. ఆ దురాశలో, వాళ్లకి మంచి చెడ్డలు తోచలేదు. అంతా నా గుఱ్ఱం వెనక పరుగెత్తుతున్నారు.

"నేను ముందుగానే కోటలోని దీపాలనన్నింటినీ ఆర్పివేయించాను. చెరసాల తలుపులు తీసివుంచాను. నేను తిన్నగా నా గుఱ్ఱాన్ని అతి విశాలమైన చెరసాలలోకి పరిగెత్తించేను.

ఆ ఆవేశంలో వారు నా వెనక పడ్డారు. అంతా చెరసాల్లోకి వెళ్లే వరకూ చూసి ఆ కోలాహలంలో గుఱ్ఱం దిగి వారికి కనబడకుండా ఇవతలికి వచ్చేశాను. వారికి తెలియనే లేదు ఆ అదనుచూసి గభాలుమని చెరసాల కాపలా కాసేవారి సహాయంతో తలుపులు మూయించి తాళాలు పెట్టేశాను.

"ఇంకేముంది. లోపలకు పోయి పాపం దొంగలంతా నా కోసం వెతుకుతున్నారు. ఆ అంధకారంలో పదినిముషాలవరకూ వాళ్లకి నాలుగు గోడలమధ్య దుర్భేద్యమైన కారాగారంలో ఉన్నట్లే తెలియదు. తెలిసిన తరువాత ఏమి చేయగలరు. అంతే బోనులో చిక్కిన ఎలకల్లాగ మన బోనులో దూరేరు అందరూ వారంతట వారే వచ్చి"...

రామలింగడు ముగించి తన ఆసనంపై కూర్చున్నాడు. అందరూ ఆశ్చర్యంతోనూ, సంతోషంతోనూ సభ అదరిపోయేలాగ నినాదాలు చేశారు. ఆపద నుండి సామ్రాజ్యాన్ని కాపాడడం ఇది ప్రథమం కాదు వికటకవికి. చక్రవర్తి అనేక కానుకల్ని సమర్పించాడు అప్పుడు.

"ఆ పేదరాశి పెద్దమ్మకు కూడా ఇవ్వండి. ఆవిడ ప్రచారం లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు" అన్నాడు రామలింగకవి. ప్రజలంతా హర్షధ్వానాలు చేశారు కడుపు చెక్కలయ్యే నవ్వుతో. పేదరాశిపెద్దమ్మ అసలు విషయం తెలుసుకొని ఆశ్చర్యపోయింది. ★



★ కలహంలో కాంతారావు ★

(16-వ పేజీ తరువాయి)

లో ఉంది, అతను ఏదైనా సొల్యూషన్ సూచిస్తాడని.

కాంతారావు జరిగినదంతా చెప్పాడు. వెంకట్రావ్ నవ్వుతూ-'భలే దాంపత్యమోయి, మీది...' అన్నాడు.

అంతలో వీధి తలుపులు నెట్టిన శబ్దమైంది.. ఇరువురూ, ఆ వైపు చూశారు.

కాంతారావు చిన్న బావమరిది కిష్టు, ఓ సంచీ చేత్తో పట్టుకొని...ప్రత్యక్షమయ్యాడు.

'నమస్కారమండీ బావగారు ...' అంటూ, కిష్టు కూర్చున్నాడు.

'ఒరేయ్ కిష్టూ! బాగా మాటలు నేర్చావే! కేనా రావటం! సరిసరి! అసంచి అక్కడ పెట్టు, కాఫీకి వెళదాము...' అన్నాడు కాంతారావు, కిష్టు రాకకు ఆశ్చర్య పడుతూ నే.

వెంకట్రావ్ అర్థం చేసుకున్నాడు, ఆ కుర్రాడు అతని బావమరదని.

కాంతారావు కాఫీ త్రాగుతూ, "మిస్టర్ రావు! నే చెప్పటం మర్చిపోయాను...ఈ అబ్బాయి నా చిన బావమరిది, కిష్టు..." అంటూ, కిష్టును పరిచయం చేశాడు...

"ఏమోయ్! ఏమి చదువుతున్నావ్..." వెంకట్రావ్ అడిగాడు.

"ఫిఫ్త్ ఫారమండీ .."

"అయితే, మీ బావను తీసుకెళ్ళటానికి వచ్చావన్నమాట. మొత్తంమీద కాంతారావ్గా, నీవు అదృష్టవంతుడవోయి. దసరా వారం వుండగనే వచ్చాడు పిలుపులకు. నేను వెళదామన్నా పిలిచేవారు లేరుగదా—" నవ్వుతూ, వెంకట్రావ్ అనేసరికి, కాంతారావు నవ్వకుండా వుండలేకపోయాడు...

"బావా! నిన్ను వెంటనే పిల్చుకురమ్మన్నారు, మా నాన్న—అందుకనే నన్ను పంపించారు..." కిష్టు ఆమాటలు అంటుంటే వెంకట్రావ్‌కు సంతోష మొచ్చింది...

కాంతారావు అంగీకరించలేదు వెళ్లటానికి. తను వెళ్ళటం, తన గౌరవానికి తగింది కాదని అతని అభిప్రాయం.

కాని వెంటనే వెంకట్రావ్ అన్నాడు: "బ్రదర్! నీ మనస్సులోవుంది నాకు తెలుసు. కాని వెళ్ళేది నీ మామగారింటికి. దానిమీద లక్ష్మికి ఎంత అధికారం వుందో, నీకు అంతే. పైగా మీ ఇరువురిలో ఎవ్వరూ గౌరవ హాని పొందరు...నా మాట విని వెళ్ళు..." వెంకట్రావ్ సలహావలనే కానీ, బలవంతంవల్లనే కానీ కాంతారావు వెళ్ళక తప్పలేదు. తప్పించుకోవటానికి ప్రయత్నించలేదు.

* * *

గుమ్మంలో అల్లుణ్ణి, కిష్టుని చూడగానే, కాంతారావు మామగారికి ఎక్కడలేని సంతోషం వచ్చింది...రండి రండని ఆహ్వానిస్తూ, లోపలికి తీసుకెళ్ళాడు.

కాసేపు సోఫాలో కూర్చున్నాక, బట్టలు మార్చుకున్నాడు కాంతారావు. అతనికి కొంచెం బిడియంగా వుంది, వాళ్ళేమన్నా అనుకుంటారేమో అని. తను చేసింది తప్పని తనకు లోలోపల తోస్తుంది. అతని పెంకితనం మాయమయింది.

అత్తగారు కాళ్ళకు నీళ్ళిచ్చింది. మరదలు కాంతారావు చుట్టూ తిరుగుతూ 'బావా! ఏం తెచ్చావు' అని ఆనందంతో అంది. తను తెచ్చిన యాపిల్ బుట్ట అందించాడు.

కాని అంతవరకు లక్ష్మి అవుపించలేదు. కాంతారావు తహతహ లాడుతున్నాడు. ఇంకా ఆమెకు కోపం పోలేదని మౌనంగా వున్నాడు.

ఆ రాత్రి పిండివంటలతో భోజనాలు జరిగాయి. కాంతారావు తను చేసిన పనికి మరీ మరీ నొచ్చుకున్నాడు...

భోజనా లయ్యాక అతను తనకు ఏర్పాటు చేసిన గదిలోకి వెళ్ళాడు. పక్కవాడి వేసుకొని, సిగరెట్ వెలిగించి, వేగంగా తిరుగుతున్న పంకావైపు చూస్తూ కూర్చున్నాడు.

అతని మనస్సు ఇప్పుడు నిర్మలంగావుంది. తుఫాను వీచిన తర్వాత, ఎంత ప్రశాంతంగా వుంటుందో అంతకంటే ఎన్నోరెట్లు ప్రశాంతత వ్యాపించి వుంది...అతనికి లక్ష్మిని గురించే ఆలోచనలు ఎక్కువయ్యాయి. వచ్చి మూడు గంటలైనా, యింకా కనుపించలేదు. ఆమెమీద యిప్పుడు కోపం లేదు. అసహ్యం అసలు లేదు. ప్రేమ పుట్టుకుతోంది. జాలి ఏర్పడుతోంది.

ఆక్షణంలోనే అతని ఆలోచనలకు భంగం కలిగింది. లక్ష్మి మహాలక్ష్మిలా అలంకరించుకొని గదిలోనికి వచ్చింది అతని కళ్ళు మిరుమిట్లు కొలిపాయి బెనారస్ సిల్కుచీర, పెట్రోమాక్స్ లైట్ కాంతితో పంచరంగులు ప్రదర్శించింది.

అతని నాలుక చివరవరకు మాటలు వచ్చాయి పలుకరించాలని. కాని ఏమిమాట్లాడాలో తెలియ లేదు.

"నే నేమాట్లాడుతాలేండి. మీ దేవిజయం" అంటూ లక్ష్మి కోకిలకంఠం విప్పింది.

"లక్ష్మీ! ఆ చీర ఎక్కడిది?..." అతని ఆశ్చర్యానికి హద్దులు లేవు. లక్ష్మి నవ్వుతూ "మన పేచీ తెలిసి మా నాన్న తెచ్చారు. మీకు ట్వీడ్ సూట్ కూడా..." కాంతారావు ఏమీ మాట్లాడలేక పోయాడు.

ఉవ్వెత్తున లేచిన సముద్రపు అల తిరిగి యథాస్థాయికి వచ్చింది. చిన్న సంఘటన ద్వారా లేచిన తుఫాను ప్రశాంతతపొందింది.

★

మనిషిలో మనిషి

[32 వ పేజీ తరువాయి]

అరె - ఇంకోటి వుండాలనుకుంటాను - కింద టాక్సీలో మర్చిపోయా నేమిటి?

సుజాత: ఇంకొనా? బాబీ - నువ్వు పోయి తీసుకురద్దూ పాపం రాజు చాలా అలిసిపోయి నట్టున్నాడు!

[రఘు వెళ్ళబోతూంటాడు]

శేఖర్: బాబీ! (రఘు ఆగి వెనక్కి తిరుగుతాడు) ఏంలేదు—కొంచెం ఇంపార్టెంటేమో తర్వాత మర్చిపోతానని- ఇందాక ఆ కమర్షియల్ రేడియోమనిషి, బజార్లో కనిపించాడు- నీతో ఇంటర్వ్యూ కోసం ఇక్కడికొస్తానన్నాడు.

రఘు: థేంక్యూ మై డియర్ రాజా! అతను రావడం వెళ్ళిపోవడంకూడా అయిపోయింది.

శేఖర్: ఓ! గుడ్.

రఘు: (వాత్సల్యంతో) ఉరేయ్ రాజా! నా కదివరకే తెలీనికబురేదైనా ఒక్కనాటి కన్నా చెప్తావా అని చాలా రోజుల్నుంచీ చూస్తున్నారా అబ్బీ!

[బైటికి వెళ్తాడు]

శేఖర్: హలో లిల్లీ! కంగ్రాచ్యులేషన్స్! కంగ్రాచ్యులేట్ చేస్తూ ముద్దుకూడా పెట్టడనే అలవాటు మనదేశంలోకి త్వరగా వస్తే బాగుణ్ణు.

సుజాత: రాజా! అవన్నీ అలా పారేసి ఇలావచ్చికూర్చో ముందు.

శేఖర్: ఏం? ఏం మునిగింది?

సుజాత: బాబీకి పిచ్చెక్కింది.

శేఖర్: ఇంతేకదా! ఇవ్వాళ కొత్తకాపోతే ఇంకెప్పుడెక్కుతుంది పిచ్చి వాడికి!

[లేచి సామాన్లు బల్లమీద పెడతాడు]

సుజాత: ఈపూట డిన్నరుసంగతి నీతో ఎప్పుడు చెప్పాడు?

శేఖర్: ఇవ్వాళ పొద్దున ఫోన్ చేసి రాణీనికూడా తప్పకుండా వెంటబెట్టుకు రమ్మన్నాడు. ప్రధానం చాలా గ్రాండ్ గా సెలిబ్రేట్ చెయ్యాలన్నాడు.

సుజాత: మా యిద్దరికీ పెళ్ళికావడం అనేది కల్లోవార్త. అసలతనికీ వుద్దేశం వున్నట్టుండి ఎలాకలిగిందో నాకర్థంకావడం లేదు.

శేఖర్: (తెల్లబోయి) నీ ధోరణి నాకసలే అర్థంకావడం లేదు.

సుజాత: అసలు నాతోకూడా ఈ సంగతెలా చెప్పాడో తెలుసా?...రేడియోలో!

శేఖర్: రేడియోలోనా? నాకిది అంతకంటే అర్థంకావడంలేదు.

సుజాత: ఫరవాలేదు. ముందు నువ్విలా వచ్చి కూర్చో...కూర్చో రాజా! [శేఖర్ కూర్చుంటాడు] కాస్త సాయంచేసి ఈ గండం గట్టెక్కించాల్సినవాడివి నువ్వే! అసలు నిన్న సాయంత్రంనుంచీ నా మతి మతిలో లేదు—సంధి అవస్థలా—పిచ్చెక్కిపోయినట్లున్నాను... పన్నెండేళ్ళతర్వాత మళ్ళీ నిన్నసాయంత్రం నా జీవితంలో అడుగుపెట్టాడు...

శేఖర్: ఎవరు?

సుజాత: నిజంగా నెత్తిన పిడుగుపడ్డట్టైంది. నిన్నటినుంచీకూడా నా ఆలోచనలన్నీ ఇవ్వాళ సాయంత్రం మీదికే పోతున్నై. నిజంచెప్తున్నా రాజా సిగు విడిచి—ఈపూట అతన్ని కలుసుకున్నాక ఏంజరిగినా జరగొచ్చు. ఆఫ్రికా కాదు— ఉత్తరధ్రువానికైనా సరే మంత్రబద్ధురాల్లాగా అతని వెంటబడిపోతాను.

శేఖర్: (సగంలేచి) కొంపతీసి వాడు నీగ్రోగానీ ఎస్కిమోగానీ—

సుజాత: అబ్బ - పరిహాసానికిది సమయం కాదు రాజా...మా బావ! వాళ్ళమ్మ నాకు మేనత్త అవుతుంది. చిన్నతనంలోనే మా యిద్దర్నీ చూసి అంతా మొగుడూ పెళ్ళాలనే వాళ్ళు - బావ విదేశాలకెళ్లి నన్ను మర్చిపోయాడనుకున్నాను. నిన్ననే కేబుల్ గ్రాం వచ్చింది. రాత్రి ప్లేన్లో వస్తున్నాట— ఒక్కడే!... వెంటనే వాళ్ళవూరు వెళ్ళిపోతాం. డైరక్టుగా చెప్పలేక ఎన్నివంకలు పెట్టినా బాబీ వినిపించుకోవడం లేదు. చాలా పనులున్నాయన్నాను. అన్నీ చూసుకునే రమ్మంటాడు. ఎంతపొద్దు పోయినా సరే రమ్మంటున్నాడు. కాని నేను రాను— నిజంగా రాను. అసలీ జన్మకే మళ్ళీ తిరిగి రానిక్కడికి.

శేఖర్: మరి బాబీగతి? వాడు నిన్నెంతగా ప్రేమిస్తున్నాడో ఎన్నడైనా ఆలోచించావా?

సుజాత: మరి నా ప్రేమ? [ఒక్క క్షణం బాధాకరమైన నిశ్శబ్దం] సంగతంతా నువ్వు నెమ్మదిగా చెప్పాలి బాబీకి.

శేఖర్: (హడిలిపోయి లేస్తూ) నేనా?

సుజాత: ఔను నువ్వే!

శేఖర్: నీకు నిజంగా పిచ్చెక్కింది.

[రఘు వస్తాడు. సుజాత రెండడుగులు ఇటు వేసి ఏమీ ఎరగనట్టుండటానికి ప్రయత్నిస్తుంది.] ★

[ఇంకా ఉంది]

కావలసింది చల్లనిమాట

(39-వ పేజీ తరువాయి)

చెప్పించింది అందరు మంచి ఉద్యోగాల్లో వున్నారు. అయినా నడుము వొంగిపోతున్న మామ్మగారు హోటలు నేటికీ నడుపుతునే వుంది. ఇటువంటి ఉదంతాలు వింటుంటే మానవ సమాజంలో ఎంత కృతఘ్నత పెరిగిపోతున్నదా అని గుండె మండిపోతుంది. వైధవ్యంవల్ల ఏర్పడిన వెలితి ఎన్నటికీ తీరదు. ఏ వయసులోవున్న స్త్రీ అయినా మాంగల్యానికి దూరమైతే జీవితంలో సుఖానికీ శాంతికీ శాశ్వతంగా దూరమైనట్లే! ఎన్నో ఆశలు పెట్టుకుని పెంచిన సంతానం కూడా అనాథస్త్రీ హృదయానికి కోరిన ఓదార్పునీ సంతృప్తిని అందించలేకపోవచ్చు. ఆ భాగిని హృదయంలోని అగాధం అల్లా ఘోషిస్తూనే వుంటుంది. ఎనభైయ్యో పడిలోవున్న సీతమ్మ మామ్మగారు ఇప్పటికీ "మా వారు బాగుంటే నేనెల్లా వుండేదాన్నో! ఎక్కడ వుండేదాన్నో!" అని గత స్మృతులతో మురిసిపోతుంది. ఆక్షణంలో ఆమె ముడుతల ముఖంలో ఒక గర్వరేఖ ఒక సంతోషదీప్తి మెరుపులా తళుక్కుమంటుంది. దూర చుట్టాల గొడ్లసావిట్లో, నులకనుక్కిలో పిచినకొదీ దూరంగా పోతున్న యముని మపిమపు లోహఘంటలకోసం ఎగురు చెన్నులు చూసే సీతమ్మ మామ్మనికూడా క్షణంసేపు ఉర్రూతలూగించగల మధురస్మృతియైన జీవన వైభవం ఎంత మహత్తరమైనదో! ఆనంద ధామం వెలుపల ప్రవాసినులై అశ్రువర్షం కురిపించే పూర్వసువాసినుల కష్టాలకి అంతు లేదా? ఇంకెందరు రామమోహనులు, ఎందరెందరు కందుకూరి వీరవరేణ్యులు అవతరించి ఆశాజ్యోతులు వెలిగించాలో? ఈ నిరాశా నిశీథంలో అరుణకిరణాల కరుణామయ దరహాసం విరిసేది ఎన్నడో? అందాకా "అతివగో! అవనిలో అనుజన్మముకంటె, అడవిలో తరువుగా అవతరించిన మేలు" అన్న కవయిత్రి పలుకులలోని నైరాశ్యాన్ని, నిర్వేదాన్ని అనాథలంతా ప్రతిధ్వనిస్తూ ఆక్రోశించవలసిందేనా?

అనాథలు కోలుపోయిన ఆనందం తిరిగి రాదు. కాని దుఃఖంతో కుమిలే హృదయాలని మరింత క్షోభపెట్టి వారిజీవితాలని నరకాలుగా మార్చటం అమానుషమైన అన్యాయం. సానుభూతితో, ప్రవర్తించాలి. కారుణ్యంతో ఆదరించాలి. సభ్యప్రపంచం మేల్కొవాలి. అనాథనయనాలనుంచి రాలే సంతత బాష్పధారలని అరికట్టి అభాగినులు కూడా అందరిలాగా జీవించటానికి అనువైన పరిసరాలు సమాజంలో ఏర్పడాలి ఈసహానో సానుభూతి ప్రతిఇంటా, పెంపొందాలి. ధన ధాన్యాలు కాదు, చల్లటిమాట చాలు. కన్నీరు తుడిచి హృదయంమీద పన్నీరు చల్లే చల్లటిమాట కావాలి. దీనాతిదీనస్థితిలో వున్న సాటి స్త్రీకి ఆమాత్రంకూడా ఇవ్వలేమా? ★



సినిమా

చిత్ర నిర్మాణంలో దర్శకుడు

నచిత్ర నిర్మాణం సులువుగా, చప్పున తేలిపోయేందుకు ఎవరన్నా ఉపాయం పెడితే మానవాభ్యుదయానికి మహోప ం చేసినవారవుతారు

"కాని, అలాంటి అడదారిఅంటూ ఏదీ లేదు ఉన్నదల్లా ఒకటే గడుదారి" అని సుప్రసిద్ధ చలనచిత్ర కళాకోవిదుడు 'పథేర్ పాంచాలి', 'అపరాజిత', చిత్రాల ప్రప అయిన బెంగాలీదర్శకుడు సత్యజిత్ రాయ్ అభిప్రాయం.

గతవారం కలకత్తా రేడియో కేంద్రంనుండి సినిమాలో దర్శకుడిభూమిక గురించి మాట్లాడుతూ, చిత్రనిర్మాణంగురించి పూర్తిగా నిజమైన నిజం చెప్పకోవాలంటే, "ఇదిచాలా చిక్కుల వ్యవహారం అనేక సమస్యలు ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయన్న మాట" అన్నారాయన

"వీటిని కాదని తేలిగ్గా చురుగ్గా పని పూర్తిచేసేపద్ధతి నాకు తెలిసినంతవరకూ ఏదీ లేదు" అంటూ, తమకు తెలిసిన స్థితిగతులను సమస్యలను వివరించారు

ఒక మహాకావ్యం, మంచిచిత్రం, మధుర గీతం ఉదయించినంత త్వరగా, చలనచిత్రం రూపొందదు కవి ఉద్వేగంతో అన్నమాట, కావ్యోన్నతి గల వాక్యం కావచ్చు గాని చలనచిత్రం అలాటిది కాదు. దీనికి పడవలసిన శ్రమ, ప్రయాస, పడి తీరవలసిందే బాగాలేని చిత్రాలయినా సరే. మాటవరసకి ఒక కొత్తదర్శకుడి కథ ఎలా సాగుతుందో చూదాం ఇతగాడికి అనుభవం లేదు అయినా ప్రజ్ఞ ఉందనుకుందాం. పుడోవ్‌కిన్, ఐన్‌స్టైన్‌ల ప్రవచనాలు క్షుణ్ణంగా చదువుకున్న బుద్ధిమంతుడనికూడా అనుకుందాం తనకి కావలసిన కథ, తన ఊహలకు, కలలకు అనువైనదాన్ని తెచ్చుకుంటాడు స్క్రీన్‌ప్లే వ్రాసుకుంటాడు.

అక్కడే మొదటమొదటి పేచీ ఎదురవుతుంది. అన్నీ ఉన్నాయికాని, డబ్బు మటుకు లేదు. తిరిగి తిరిగి ఎవరినో పట్టుకుంటాడు పెట్టుబడికి.


అక్కడినించి అసలు సమస్య ఆరంభం అవుతుంది ఎన్ని అన్నా, చలనచిత్ర నిర్మాణం వ్యాపారం అని ఒప్పుకోనక తప్పదు కళేనా, వ్యాపారాన్ని సమన్వయించి వ్యవహరించవలసిన మిశ్రమ పరిశ్రమ యిది ఈ సమన్వయాన్ని ఎంత గొప్పగా సాధిస్తే అంత గొప్పదర్శకుడు అనిపించుకుంటాడు

సత్యజిత్ రాయ్

ఇతర పరిశ్రమలకూ దీనికీ ఓ తేడా వుంది అన్నిటిలో యంత్రాలశక్తి ప్రబలంగా వుంటే, ఇందులో మానవులది ప్రాబల్యం. వాటిలో యంత్రాల సాధక బాధకాలు తెలుసుకుంటే సులువుగా నడపవచ్చు; కాని ఇందులో దర్శకుడు వివిధశాఖలకు చెందిన ఎందరో వ్యక్తులను మచ్చిక చేసుకోవాలి కామెరా, సౌండ్ రికార్డింగ్ యంత్రం, లేబొరేటరీ ఉన్నాయి కాని వాటిని ప్రవీణులు నిర్వహిస్తారు చిక్కల్లా మనుషులతోటే సెట్ మీద బాక్సాఫీస్ నటుడుంటాడు అతగాడికి ఏక్షణంలో తిక్క ఎటువిరుగుతుందో, చెప్పలేం 'మూడ్'ల రాకపోకల వేళలు పసిగట్టలేం ఆపైన అద్భుతంగా నటించా రనిపించుకున్న బాలనటులుంటారు ఇంకా చెప్పాలంటే, "పితామహుడు" అనిపించుకున్న వృద్ధనటుడు ఉంటాడు ఇలాటివాళ్ళని మంచిచేసుకుని, వాళ్ళకి చాలా బావుందనిపించే పద్ధతిలో కాక, దర్శకుడికి కథదృష్ట్యా అవసరమనిపించే పద్ధతిలోనే మాట్లాడించాలి నటింపచెయ్యాలి ఇది కాక సాంకేతిక విభాగంలో పేచీలు ఎలాగా వుంటాయి సౌండ్ మైక్, నటుడికి దగ్గరగా ఉండాలంటాడు సౌండ్ ఇంజనీరు, కూడదు, అదుగో గోడమీద నీడపడుతుంది అని వాదిస్తాడు కామెరామన్ వీటితోడు యీ దర్శకుడు కొత్తవాడైతే, తొలిరోజు కాల్‌షీట్ ముగిసేలోగా వాడి తెలివితేటలు, శక్తిసామర్థ్యాలూ అంచనా వేసి తేల్చి అవ



తిరుమలావారి 'సమాజం'లో గిరిజ, చెలులు



ఎగువసభ ఉపాధ్యక్షుడు శ్రీ జి. సుబ్బరాజు అధ్యక్షతన విజయవాడ మారుతీ టాకీసులో "చెంచులక్ష్మి" శతదినోత్సవం జరిగింది. శ్రీయుతులు సుబ్బరాజు, దర్శకుడు, ఎస్. వి. రంగారావు, రేలంగి, నాగేశ్వరరావు, బాబ్జీ శ్రీమతులు అంజలీదేవి, సంధ్య

లు పారెయ్యడానికి లైట్ బాయ్ దగ్గర నించి, హీరో దాకా అంతా శక్తివంచన లేకుండా కృషిచేస్తూ ఉంటారు. సెట్ నిండా బోలు మందిని చూసి, 'ఇంతమందికి నేను ఉత్తర్వు లివ్వాలా' అని కంగారు పడుతున్న నవదర్శకుడు, ఈ ప్రవీణులను చూసి బెంబేలెత్తిపోయి, 'ఎరక్కపోయి ఇరుక్కున్నానే దేవుడా!' అని నాలిక్కరుచుకుని చెంప లేసుకు వెళ్ళిపోయే స్థితికి వస్తాడు. వస్తాడు కాని, వెళ్ళడనుకోండి. ఇందరి ఎదట, తన మనసులో భయం, అశక్తత వెళ్ళబెట్టుకోవడానికి మనసొప్పదు. ఒప్పినా, నిర్మాత ఓ పట్టాన ఒదలడు. 'సినీ పరిశ్రమ అల్లకల్లోలం అయిపోతోందని, దురభిప్రాయ పడతాడు, డబ్బుపెట్టినవాడు కాబట్టి.

ఇవన్నీ కాక, ఔట్ డోర్ షూటింగ్‌కు వెళ్తే, హాజరయే ప్రేక్షకులు వాళ్ళకి పోయేదేం లేదు. "మాకు డబ్బు, కాలం పాడైపోతున్నాయని, దురుసుగా చెబితే కోపం రావచ్చు. అది వచ్చే లోగానో పోయే లోగానో, ప్రకృతికి తిక్క తిరిగి మబ్బూ వానా ముంచుకు రావచ్చు.

ఈ సమస్యలన్నిటినీ ఎదుర్కొని నెగ్గుకు రావాలంటే, విపరీతమైన ఓర్పు కావాలి. అదే అన్నిటికన్న ముఖ్యం. ఓర్పుకి నేర్పు తోడైతే మరీ మంచిది. కాకపోయినా, ఓర్పు, లేకుండా, ఎంత డబ్బూ, తెలివి తేటలూ ఉన్నా అవి కొరగావు. ఈనాడు మన చిత్రాలు అనేకం బాగుండకపోవడానికి కారణం ప్రజ్ఞ, డబ్బులోటు అవడం కాదు. ఈ సమస్యల తాకిడి తట్టుకునే ఓర్పు ఉండవలసినంత లేకపోవడమే.

పెట్టిన పెట్టుబడి వెనక్కొచ్చి, చిత్రం తీశాక, జనం మెచ్చుకుంటే, దర్శకుడికి అంతకన్న ఘోరదండన మరొకటి లేదు. అంతా హూన్‌స్తే అంతకన్న ఆనందకరమైనది మరొకటి లేదు. అపుడు, దర్శకుడు, తను కళాకారుడే కాక, మంచి వ్యవహారదక్షుడు, మహోత్సాహుడూ, మనస్తత్వశాస్త్రవేత్త, గారడీవాడు, సహార్ష వరకుడు కూడా అని తనకి తనే చెప్పుకుని భుజం చరుచుకోవచ్చు.

ఇవన్నీ కాక ఇంకొకటి కూడా అనుకోవచ్చు. "నేను చాలా అదృష్టవంతుణ్ణి" అని ★

('ఆకాశవాణి' కలకత్తా సౌజన్యంతో)

'పరాజయ్'

పోలార్ ఫిలింస్ వారి 'పరాజయ్' చిత్రం నిర్మాణం శ్రీ సౌండ్ స్టుడియోస్‌లో ఈ నెల 28 ఉదయం ఆరంభమైంది. భరత్ భూషణ్, మాలాసిన్హా, సజ్జన్, అశీంకుమార్, ఎస్. కె. ప్రేమ్, రమేష్‌సిన్హా, మోహన్ చోటీ, సుజాత, అభిభట్టాచార్య ఇందులో పాల్గొంటున్నారు.

దర్శకుడు దులాల్ గుహా, సంగీతం చిత్రగుప్త. నిర్మాత బసుదేవ్ సిన్హా.

సతీష్ గుప్త మృతి

వంగదేశపు చలనచిత్ర దర్శకులలో అగ్రగణ్యుడైన సతీష్‌దాస్‌గుప్త జూలై 16న కలకత్తాలో మృతిచెందారు. వాసవదత్త, ఆనందమఠ్, దేవీచౌధురాణి, పథేర్ దాబి, కర్ణార్జున్, ఈయన చిత్రాలలో ముఖ్యమైనవి.

'చెంచులక్ష్మి' శతదినోత్సవాలు

కళాకారుడికి అన్నిటికన్న ఎక్కువ సంతోషాన్నిచ్చేది పదిమందీ తను చేసిన పనిని హర్షించడం. డబ్బు చేసుకోడు కాని, దానికన్న ఇదే ఎక్కువగా భావిస్తాడు.

నవయుగ ఫిలింస్ వారి అంచనాల ప్రకారం 'చెంచులక్ష్మి' చిత్రం చూచి ఆనందించిన 50 లక్షల మందిలో వీలైనంత మందిని చూచి కృతజ్ఞత తెలుపుకొని, అభినందన లందుకొని ఆనందించడానికి చెన్నపట్నం నుండి బయలుదేరివెళ్ళిన కళాకారులూ, టెక్నీషియన్లూ, గత వారం ఐదు శతదినోత్సవ సభలలోనూ ఈ భావాన్నే వ్యక్తం చేశారు. ఐదు చోట్లా పండుగలకు జనం మెండుగా వచ్చారు. జూలై 18న విశాఖపట్నం ప్రభాత్ టాకీస్‌లో జిల్లా కలెక్టరు శ్రీ ఐ. జె. నాయుడు, 19న విజయనగరంలో మినర్వ సినిమాలో సభకు పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ ఎ. అప్పన్నదొర, మర్నాడు కాకినాడ మినర్వా థియేటర్‌లో పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ దంటు భాస్కరరావు, నాలుగో రోజున గుంటూరు శ్రీ లక్ష్మీ పిక్చర్ పాలెస్‌లో కలెక్టరు శ్రీ ఎం. ఎ. హలీం, అధ్యక్షత వహించారు.

ఆఖరు రోజున ఆంధ్రా హాలీవుడ్ కు న్యూయార్కు ఫ్రంట్ ఆఫీసులాటి విజయవాడలో ఆంధ్ర శాసనమండలి ఉపాధ్యక్షులు శ్రీ. జి. సుబ్బరాజు అధ్యక్షత వహించారు. మారుతి సినిమాలో సభ జరిగింది. నవయుగ ఫిలింస్ విజయవాడ కార్యాలయం మానేజరు శ్రీ కొత్తగడ్డ నరసయ్య, శ్రీ పి. వెంకటి స్వాగతం చెప్పారు. శ్రీ సుబ్బరాజు, శ్రీ బందా కనకలింగేశ్వరరావు ప్రభృతులు 'చెంచులక్ష్మి' చిత్రం 'నిర్మించిన' వారందరినీ అభినందించారు. శ్రీయుతులు నాగేశ్వరరావు, రంగారావు, రేలంగి, శ్రీమతి అంజలీదేవి, దర్శకనిర్మాత శ్రీ బి. ఎ. సుబ్బారావు ప్రసంగించారు.

ఈ సభకు ఈ చిత్రంలో పాల్గొన్న వారంతా — పైన పేర్కొన్నవారు కాక శ్రీ వంగర వెంకటసుబ్బయ్య, శ్రీమతులు సంధ్య, అంగముత్తు, మాస్టర్ బాబ్జీ, కథా మాటలూ వ్రాసిన శ్రీ సదాశివబ్రహ్మం, పాటలు వ్రాసిన ఆరుద్ర, ఛాయాగ్రహణ దర్శకుడు శ్రీ పి. నాగేశ్వరరావు, కళాదర్శకుడు శ్రీ టి. వి. ఎస్. శర్మ మొదలగువారు వచ్చారు. పరస్పర అభినందనలతో, బహుమతి ప్రదానాలతో సభ ముగిసింది. సాయంకాలం, నవయుగ ఫిలింస్ వారు అతిథుల గౌరవార్థం విందుచేశారు. సభకు పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ జంధ్యాల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. శాసనసభ్యుడు శ్రీ పేట బాపయ్య ప్రసంగించారు. ★

అమెరికాలో చేరాయి, చూడరాని ఘోరాలూ వివరించేవి, కళ్ళకు కట్టినట్టు చూపించేవి చాలా పుస్తకాలు అమ్ముడవుతున్నాయి. బొమ్మలకథల పుస్తకాలలో 'హారర్ కామిక్స్' అనబడే ఈ జాతి పుస్తకాలవల్ల పిల్లలు చెడిపోతున్నారని, వాళ్ల మనసులు కలుషం అయిపోయి, వయసుకు (ఏ వయసుకూ) తగని ఊహలు చేతలూ అబ్బుతున్నాయనీ వాటిని నిషేధించాలనీ ఆ దేశంలో చాలామంది తలిదండ్రులు, నాయకులూ కూడా ఆందోళన చేశారు. కాని అవి లక్షలలో వ్యాపారం అయినందువల్ల ఈ ప్రతిఘటనోద్యమానికి చలించినట్టు కనబడదు. ఇప్పుడు వాటికి హారర్ సినిమాలు తోడయ్యాయి. పుస్తకాలకే అంత డబ్బు రాగా, అసలు సిసలు మనుషులు ఘోర కార్యాలు చేస్తున్నట్టు ఇంకా బాగా చూపడానికి అవకాశం ఉన్న సినిమా ద్వారా ఇంకెంత వస్తుందో అని ఒక హాలీవుడ్ నిర్మాతకి ఊహపోయింది

ఆటకి ఐదుగురి మూర్ఛ

ఆ ఊహ "ఐవజ్ ఎ టీన్ ఏజ్ వర్ వుల్ఫ్", 'బ్లడ్ ఆఫ్ డ్రాకులా' వంటి దారుణమైన చలనచిత్రాలుగా రూపుధరించి,

పీడకలల వెల - పావలా

ఇప్పుడు లక్షలకొద్దీ డబ్బు గడిస్తోంది. ఊహాకి అందని, ఊహించరాని దారుణాలను భీభత్సంగా చిత్రించారని విమర్శకులు వాటిని దుయ్యబట్టారు. ముఖ్యంగా 'డ్రాకులా' అనే చిత్రం చూస్తున్న అమెరికన్ ప్రేక్షకులలో ప్రస్తుతం ఆటకి ఐదుగురు చొప్పున మూర్ఛపోతున్నారట. వాళ్ళలో ముగ్గురు మొగాళ్ళు .. పిల్లలు కారు

ఇది గొప్ప విషయం కాదు. అందుకనే, అమెరికాలో పలువురు వీటిని నిరసించారు. (బ్రిటన్‌లో కూడా ఈ మధ్య రెండు 'హారర్' చిత్రాలు వచ్చాయి. విమర్శకులంతా వాటినీ, నిర్మాతనూ, దర్శకుడిని చాలా తీవ్రంగా విమర్శించారు)

ఇప్పుడు ఈ తరహా చిత్రాలలో బాక్సాఫీస్ ప్రభావాన్ని ఎరిగిన కొందరు, వీటిని వెనకేసుకు రాజాస్తున్నట్లు కనిపిస్తుంది. వీరి ప్రచారం ఈ చిత్రాలకన్న భయంకరంగా ఉంది

"హారర్ చిత్రాలు ప్రజలకి చాలా మంచివి" అనే నినాదాన్ని వాదంగా వాడి 'నిజం'గా నిలబెట్ట చూస్తున్నారు. ఇవి టానిక్కులాంటివని ఈ వాదం తాత్పర్యం

జనంలో చాలామందికి చిన్ననాటి భయాలు దురభిప్రాయాలూ పెద్ద అయినా కూడా పోవు.- దెయ్యాలూ, చీకటీ, మంత్రగత్తెలూ వగైరాలు.

వాటిని వదిలించుకోవడానికి మూడు మార్గాలున్నాయని అమెరికన్ మనస్తత్వ శాస్త్రవేత్త డా॥ మార్టిన్ గ్రాజాన్ చెప్పారు. ఒక మార్గం మనస్తత్వ శాస్త్రవేత్త దగ్గరకు వెళ్ళి అతని సహాయంతో 'రోగి' తన మనసును, అందులో దురభిప్రాయాలను తను తెలుసుకుని బయటపడడం.

రెండోది పీడకలలు చూడడం

కావాలన్నప్పుడు కలలూ పీడకలలూ వస్తాయని గారంటీ లేనివారికి (కాబోలు) చవగ్గా పీడకల కొనుక్కు చూడడానికి మూడో మార్గం ఈ హారర్ చిత్రాలు చూడడం

ఇవిగనక చూసినట్లయితే, చిన్నతనం నుండి మనసులో పేరుకొని, అణగిఉన్న భయాలూ అపోహలూ, భయంకరమైన

ప్ర. భా. వారి 'అడపెత్తనం'లో అంజలీదేవి, నాగేశ్వరరావు, సీతారాం, పెరుమాళ్ళు.




ఆలోచనలూ ఒక్కొనాటి వెలికేగి విడుదల అవుతాయట. ఎదురుగా ఉన్న తెరమీద భీభత్సదృశ్యాలతో సమన్వయం అయి, అప్పుడు ఈమనిషిని వదలిపోతాయట.

అట్టించి నరుక్కొస్తే

ఫలానా పెద్ద శాస్త్రజ్ఞుడు ఈ సంగతి చెప్పాడు అని ప్రచారం చేసి, ఈ చిత్రాల నిర్మాతలకు పెద్దలకూ నచ్చచెప్ప గలిగితే, ఈ హారర్ చిత్రాలకు ఇక అడ్డుండదు. అమెరికన్ సినీ పరిశ్రమకు చెందిన ముఖ్య పత్రిక 'వెరైటీ' ఈ పనికి పడిగట్టి ఈ అభిప్రాయాన్ని అచ్చుకొట్టి డా॥ గ్రాజాన్‌లా ఎందరో మనస్తత్వ శాస్త్రజ్ఞులు హారర్ చిత్రాలు ఒంటికి మంచివేనని అభిప్రాయ పడుతున్నట్లు వెల్లడించింది.

కాని ఇది తప్పు అని, డా॥ గ్రాజాన్ ప్రకటనను వ్యాపారాభివృద్ధికి అనుగుణంగా వాడుకోవడం జరిగిందని స్పష్టం చేస్తూ, డా॥ గ్రాజాన్ ప్రకటన పూర్తిపాఠాన్ని విడుదలచేసిన దక్షిణ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ ఉద్యోగి ఒకరు వెల్లడచేశారు. ఆ వ్యాపారపత్రిక డా॥ గ్రాజాన్ ప్రకటనలో తనకు పనికివచ్చేది ఉంచి, అసలు భాగాన్ని వదలివేసిందట. శరీరంలోపలి మలిన్యాన్ని పోగొట్టడానికి ఆముదంలాంటి ఔషధాలు వాడినట్లే, మనసులోని మలినాలను తొలగించి శుభ్రంచేసుకోడానికి 'హారర్' చిత్రాలను వాడాలని ఆయన తాత్పర్యం కావచ్చు. అయితే, ఈ మందు అందరికీ పనికిరాదని హెచ్చరించారు. మనోదౌర్బల్యం ఉన్న కుర్రవాళ్లూ 'ఎదిగిన కుర్రవాళ్ళూ' ఇవి చూస్తే, మరింత అధ్వాన్న స్థితికి దిగజారిపోతారని ఆయన ప్రకటనలో ఉంది. ముఖ్యంగా పిల్లలు ఇలాటి వాటిని చూస్తే, సులువుగా నమ్మేస్తారనీ అది వారికి ఎంతైనా చెరుపు చేస్తుందనీకూడా ఆయన చెప్పారు. అయితే సేం, ఇవి పబ్లిసిటీకి పనికొచ్చే భాగాలు అయిఉండవు.


సంగీతావారి 'ఇంటగుట్టు' చిత్రంలో రేలంగి.

హత్య, చిత్రవధ, మానభంగం వగైరా అఘాయిత్యాలగురించి పిల్లల ఎదట, మానసికంగా దుర్బలులు అయిన పెద్దవాళ్ల ఎదటా, మాట్లాడంకూడా తగనిపని అని అంతా అంగీకరిస్తారు. ఇక వీటిని తెరమీద భయంకరంగా చిత్రించడం సంగతి చెప్పనక్కరలేదు. ఇది చాలా ప్రమాదం అని చెప్పేందుకు ప్రవీణులు అక్కరలేదు. చెప్పినా, వినలుగలవాళ్ళు పట్టించుకోరు. చిక్కెక్కడంటే, పిల్లలు సహజంగా పెద్దవాళ్ల అభిప్రాయాలగురించి పట్టించుకోరు. అదీ ప్రమాదం.

ఇక మనకి సంబంధించినంతవరకూ, ఇది మనకి సంబంధించనిదని అనుకోలేము. అమెరికాలో 'హారర్ కామిక్స్' అచ్చయితే ఇక్కడ అమ్ముడవుతాయి. అక్కడ హారర్ చిత్రాలు తయారైతే, ఇక్కడ అవి ఆడడమేకాక, దేశవాళీ పంథాలో తయారవుతాయికూడా. మనదేశంలో హారర్ కామిక్స్ పుస్తకాలను ప్రభుత్వం నిషేధించిన తరువాత, ఇంకా వీటిధాటి తగలేదు. ఇదివరకు దేశంలో దిగుమతి అయినవి ప్రాచీన తాళపత్ర గ్రంథాలలా అపురూపంగా ఉంటూ తిరుగుతున్నాయి. ఇప్పుడు హాలీవుడ్‌లో పుంజుకుంటున్న పిశాచాలలాంటి హారర్ చిత్రాల ఉద్యమం ఊడలు బొంబాయిలో దిగి పావలాకో పిశాచల చూపించడం మొదలుపెడితే ఎలా ఉంటుందో 'కాలపు' వెండితెరమీద చూడాలి ★

భారత రష్యాల సంయుక్త చిత్రాలు

భారత, రష్యన్ కళాకారులు కలిసి నిర్మించిన 'పరదేశి' (అఫనసీనికితిన్), సత్ఫలితాలను పురస్కరించుకుని ఉభయ దేశాలవారూ ఇతోధికంగా చిత్రాలు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

తరువాతి చిత్రం 'భిలాయ్' ఉక్కు కర్మాగారం నిర్మాణంలో పాల్గొంటున్న రష్యన్లు, భారతీయులగురించినది కావచ్చునని తెలియవచ్చింది. సోవియట్ ఫిలిం స్టుడియోవారు ఇందుకై అలెగ్జాండర్ జార్ఖీ అనే ఆయనను నియోగించారు. 'భిలాయ్' చిత్రానికి, నయాసన్సార్ ఫిలింస్ అధిపతి, 'పరదేశి' రచయిత, సహదర్శకుడు అయిన ఖ్వాజా అహమద్ అబ్బాస్ స్క్రిప్ట్ వ్రాస్తారట.

ఫిలింస్థాన్ మాజీ అధిపతి శశిధర్ ముకర్జీ, కొత్తగా నెలకొల్పిన ఫిల్మాలయ సంస్థ, తాష్కెంట్‌లోని ఉజ్బెక్ ఫిలిం స్టుడియో కలిసి ఒక కథా చిత్రం నిర్మించడానికి ఒప్పందం చేసుకున్నట్టుకూడా తెలిసింది. ఈ చిత్రంపేరు 'ఎ టేల్ ఆఫ్ టు హార్ట్స్'.

ఈ నిర్మాణానికి భారత ప్రభుత్వం అనుమతించగానే, స్క్రిప్టురచన మొదలైనవి త్వరత్వరగా సాగించి, రెండు నెలల్లో నిర్మాణం ఆరంభించబోతున్నారు.

ఈ చిత్రాలు కాక, భారతీయనృత్యాలను సోవియట్ ప్రజలకు, అక్కడివారి నృత్యాలను మనకు పరిచయంచేసే సంకల్పంతో, ఆయా నృత్యాలపై చిన్న చిన్న చిత్రాలు నిర్మించేవిషయమై సోవియట్ కళాకారులు భారతీయ సంగీతనాటక అకాడమీతో సంప్రతింపులు జరుపుతున్నారు.

ఫిలిం ఫెడరేషన్ వినతి

ఓపెన్ జనరల్ లైసెన్సు క్రింద స్వేచ్ఛగా విదేశాలనుండి దిగుమతి చేసుకోదగ సరుకుల జాబితాలో ముడి ఫిలిమును తిరిగిచేర్చి, చలనచిత్రపరిశ్రమ దురవస్థను నివారించాల్సిందని అఖిలభారత ఫిలిం ఫెడరేషన్, ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది. గతవారం, శ్రీ జె బి హెచ్ వాడియా అధ్యక్షతన, మద్రాసు విజయా గార్డెన్స్‌లో ఈ సమాఖ్య కార్యవర్గం సమావేశమై ఈ మేరకు తీర్మానం చేసింది.

ముడి ఫిలిం దిగుమతి కోతవల్ల ఏర్పడ్డ విషమ పరిస్థితులపై చర్చజరిగిన సమావేశంలో శ్రీయుతులు బి ఎన్ రెడ్డి, బి నాగిరెడ్డి, ఎస్ ఎస్ వాసన్, టి ఆర్ సుందరం, జె బి రూంగ్‌టా, పి ఎస్ రామకృష్ణరావు, రాజ్ కపూర్, జి పి సిప్పీలు ప్రత్యేకాహ్వానంపై పాల్గొన్నారు.

ఈ చర్చల ఫలితంగా, దిగుమతి అవుతున్న ఫిలిమును మద్రాసు, బొంబాయి, కలకత్తా, కేంద్రాలకు వాటాలు కేటాయించే నిష్పత్తిని మార్చడానికి ఒప్పందం కుదిరింది. ఆయా ప్రాంతాల అవసరాలనుబట్టి, జరిగిన నిర్ణయం ప్రకారం ఇటుపై బొంబాయికి నూరింట 50 వంతులు, మద్రాసుకు 39 వంతులు, కలకత్తాకు 11 వంతులు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. మద్రాసు వాటాకు వచ్చే కోటా ఇదివరకటి 33 1/3 నుండి ఇప్పుడు 39 కి పెరిగింది.

సమావేశం ఆరంభంలో శ్రీ బిల్లిమోరియా స్థానే అధ్యక్షత వహించిన శ్రీ వాడియా (సమాఖ్య ఉపాధ్యక్షులు), ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా నియమితులైన శ్రీ బి. ఎన్. రెడ్డిని అభినందించారు.

బిస్మిల్లాఖాఁ శహనాయ్

దర్శక నిర్మాత విజయ భట్ కొత్త చిత్రం "గూంజ్ ఉఠీ శహనాయ్"లో ప్రత్యేక ఆకర్షణ, ప్రసిద్ధ విద్వాంసుడు బిస్మిల్లాఖాఁ వాయిద్యం. ఇందులో ఒక శహనాయి విద్వాంసుడి కథను చిత్రిస్తున్నారు. ఆ పాత్రను రాజేంద్ర (మదరిండియా) కుమార్ ధరిస్తాడు.

అతడు వాయించే సంగీతం ఉత్తమస్థాయిదిగా ఉండాలన్న సంకల్పంతో నిర్మాతలు ఉస్తాద్ బిస్మిల్లాఖాఁను ఆహ్వానించి, ఆయన చేత శహనాయి వాయింపించారు. అందుకు కావలసిన సంగీతాన్ని, సంగీత దర్శకుడు వసంత్ దేశాయి ప్రత్యేకకృషి చేసి కూర్చారు. శహనాయిలో హొయినీ, అందులో సొగసులనూ, ముఖ్యంగా బిస్మిల్లా చేతిలో ఉన్నపుడు అది పోయే పోకడలను రెండు వారాలపాటు పరిశీలించినమీదట, వసంత దేశాయి, స్వరకల్పన చేశారు. వాటిని గతవారం మహబూబ్ స్టుడియోలో రికార్డు చేశారు. ★

సినిమా స్కోప్ టార్జాన్

ఎడ్గార్ రైస్ బరోస్ సృష్టించిన 'టార్ జాన్' (తెల్లమనిషి) వెండి తెరకెక్కిన కొంతకాలం తరవాత రచయిత కటిన గోడలను హాలీవుడ్ ఊడల సహాయంతో దాటేడంటారు. దాటాక మెల్లిగా పాతముతక మనిషి కొత్తపన్నబడి, సొగసుగా తయారయ్యాడు. పట్నవాసపు నేవళికం అబ్బింది. సుబ్బరమైన యింగ్లీషు ధారాళంగా మాట్లాడనేర్చాడు. అమధ్య లెక్స్ బార్కర్ వచ్చాక, స్విమ్మింగ్ పూల్ లో ఈదులాడబోతున్న నవజవాన్‌లా తయారయాడు.

ఇపుడు 'సినిమా' లో కొండలూ అడవులూ చూపే 'స్కోపు' (అవకాశం) 'సినిమా స్కోపు' పరిమాణానికి రావడంతో 'టార్జాన్' పాత్ర స్వంతదారులు సాల్ లెస్సర్ ప్రొడక్షన్ సినిమా స్కోప్ ఈస్ట్మన్ కలర్ లో 'టార్జాన్స్ ఫయిట్ ఫర్ లైఫ్' పేరిట ఓ చిత్రం తీశారు. ఇందులో కొత్త టార్జాన్ గార్డన్ స్కాట్ అనే ఆసామీ: ఇది 32 వ టార్జాన్ చిత్రం.

40 ఏళ్లనాడు తయారైన మొట మొదటి టార్జాన్ చిత్రంలో టార్జాన్ వేసిన అతని పేరు ఎల్మోలింకన్. బలంగా, వలంగా కొండంత మనిషి. ఆ కొండెంత? అంటే జవాబు: ఓసారి సెట్ మీద ఓ సింహం అతనితో మోటసరసం ఆడబోయింది. టార్జాన్ లింకన్, కత్తికటారు లేకుండానే, ఆ పళంగా సింహం పీకపిసికి చంపేశాడు. తరవాత బస్టర్ క్రాబ్, జానీ వీసీ ముల్లర్, లెక్స్ బార్కర్ లు ఈ పాత్రను ధరించారు. అందరిలోకీ ఎక్కువ టార్జాన్ చిత్రాలలో వేసినవాడు జాని విస్ ముల్లర్. 16 ఏళ్లలో మొత్తం 12 చిత్రాలు వచ్చాయి అతనివి.

బాక్సాఫీస్ చిత్రాలలో ఎన్నడూ నిర్మాతకు ఆశాభంగం కలిగించని వాటిలో 'టార్జాన్' చిత్రావళి ప్రముఖమైనది. ఇంతవరకూ ఈ చిత్రాలద్వారా వసూలైనది 50 కోట్ల డాలరట.

ఇటీవలగా మనదేశంలో కూడా టార్జాన్ మార్కు చిత్రాలు తయారవుతూవచ్చాయి. 'జింబో' 'సింగో లై సింగం' వగైరాలు. ★

'మూడ్ మెన్'

కొందరు నటులు, ఒకొక్క పాత్రను ధరించినపుడు రసపోషణకోసం చేసే ప్రయత్నాలు మిగతావాళ్ళ ప్రాణాలకి రసాభాసంగా కనిపిస్తాయి.

దీన్నే 'మూడ్' రావడం అంటారు సినీ జనభాషలో. ఇది చిన్న నటులకు రాదు. పేరూ స్టారూ పెరిగినకొద్దీను. శారీరకంగానో మానసికంగానో విపరీతమైన బాధలో మునిగిఉన్నపుడు, నటుడికి తను ధరించే పాత్రలో లీనమై నవ్వడం, యుగళగీతాలు పాడడం కష్టం అనిపించవచ్చు. అప్పుడు మూడ్ కోసం, ఆగి, అందుకు మనసును ఆయత్తం చేసుకోవడానికి ప్రయత్నించవచ్చు. ఇది సబబని చాలమంది అంగీకరిస్తారు. అలాగే చాలా కష్టమైన పాత్రను ధరించి క్లిష్టమైన భావాలు ప్రదర్శించడానికీ కొందరు మూడ్ రావాలంటారు. దీన్ని కూడా కొందరు అంగీకరిస్తారు. కాని కొందరు వరి బడాయి అంటారు. కొన్ని అలాగే కనిపిస్తాయి.

హాలీవుడ్ నటుడు రాడ్ (ఎక్రాస్ ది బ్రిడ్జ్) స్టీజర్, ఆ మధ్య ఒక చిత్రంలో మెలోడ్రామా ఘట్టంకోసం మూడ్ రావడానికి ఏమేం చేష్టలు చేశాడో, ఒక సినీ పత్రిక రంగుబొమ్మల్లో వేసిచూపించి చప్పట్లు కొట్టింది. అతను ఆ రోజు పిడికిళ్ళతో దబదబ గుండెలు బాదుకున్నాడు. జుట్టు పీకేసుకున్నాడు. ఒళ్లంతా రక్కుకున్నాడు. గది అంతా పిచ్చిగంతులు వేశాడు. తలుపులు మూసి గావుకేకలు పెట్టాడు. అలా కాసేపు చేసి, ఒగుర్చుస్తూ సెట్ మీదకు వచ్చేశాడట. 'మూడ్, అంటే మూడ్' అన్నారు అక్కడి జనాభా. కామెరాలు తిరిగాయి. స్టీజర్ నటించేశాడు...

జీవశ్రీ స్థాయిన ముఖ్యంగా బొంబాయిలో మనకి ఇలాటి 'మూడ్ మెన్' ఉన్నారు. వాళ్ల గురించి కిషోర్ కుమార్ హుషారుగా చెబుతాడు. ఒక అగ్రేసర నటుడికి మెడ కుడివేపుకి తిరిగి ఉండగా మూడ్ వచ్చేస్తే ఇహ అంతే—అరుమూడు అయినా (అవదను కోండి) ఆయన ఇటు తిరగడట. కావలిసి కామెరా దీపాలు గట్రా అన్నీ ఇటు తిప్పకోమంటాడుట. అవి జరిగేలోగా మూడు కాస్తా తోకముడుచుకు చక్కాపోవచ్చు. మూడ్‌ల రాకపోకలు రైళ్లకన్న అన్యాయం అంటారు రెండిటి బాధా తెలిసినవాళ్లు. పై ఉదాహరణ అతిశయోక్తి అయితే కావచ్చు గాని అబద్ధం మటుకు కాజాలదు.

అయితే ఒకటిమటుకు నిజం. సెట్ మీద నటీనటుల బుద్ధి, తెలుగు సినిమా కథలా పరిపరి విధాల పరుగులెత్తకుండా, కథా వస్తువు మీద, వారు నటించబోయే సన్నివేశం మీద నిలచేలా చూచుకుంటూ వాళ్ళ మనసులను అందుకు అనుగుణంగా ఉంచడం ప్రతిదర్శకుడికీ ముఖ్యం. ఇది ఒక లలితకళ. తెలుగు సినిమాలో, కె. వి. రెడ్డిగారు ఇందులో ప్రవీణులంటారు ఆయన దగర పనిచేసిన నటులంతా. సెట్ మీద ఉండగా ఆయన సాధారణంగా తీస్తున్న చిత్రం, అందులో పాత్రలు గురించి తప్ప ఇంకో విషయం చర్చకురానివ్వరని రంగారావు అంటూఉంటాడు. కొత్త షాట్ కు లైటింగు ఏర్పాటు జరుగుతున్నపుడు అరగంట విరామం ఉంటుంది. అప్పుడుకూడా బటానీల దగ్గరనించి బ్రహ్మాండంవరకూ దేని మీద ఎవరు కబుర్లు మొదలెట్టినా, క్షణాల మీద రెడ్డిగారు చర్చను అతి నేర్పుగా, తీస్తున్న చిత్రంలో కథమీదికో పాత్రల మీదికో మళ్ళించివేసారు. దీనివల్ల నటుల బుద్ధి బాగా పదునుదేరి, పాత్ర రాణించడానికి ఎక్కువ దోహదం జరుగుతుందనడానికి సందేహం లేదు.

గతవారం మెహతాబ్ ఫిలింస్ వారి కొత్తచిత్రం 'కభీ అంధేరా, కభీ ఉజాలా' షూటింగు వేళ నటీనటులకు సమయానుకూలముగా మూడ్‌లు రప్పించడానికి దర్శకుడు సి. పి. (నయా ఆద్మీ) దీక్షిత్ ఒక కొత్త ఉపాయం చేశాడు. సెట్ కు దగ్గరగా ఉన్న 'డ్రెసింగ్ రూమ్'లో ఒక గ్రామఫోను అమర్చాడు. సెట్ మీద కిషోర్ కుమార్ ఉద్వేగప్రధానమైన సన్నివేశంలో నటించడానికి సన్నాహం జరుగుతూ ఉండగా, పక్కగదిలోంచి సన్నగా లీలగా బీథోవెన్ కృతి ఒకటి వినిపించేది. నటుడికి, ఎవరో గ్రామఫోను పెడుతున్నారని మటుకు తెలియదు. ఆ సంగీతం ప్రభావంవల్ల అతనికి తెలియకుండానే పాత్రోచితమైన వాతావరణం ఆవరించి అతన్ని నటనకు ఆయత్తం చేసిందిట. అలాగే నూతన్ చైతన్యవంతమైన భాంగ్రా డాన్సు చేయాల్సివచ్చినపుడు వెనకనించి—

—రాక్ ఎండ్ రోల్ రికార్డు పుంజుకుంది! ★

హిందీ చిత్రాలకన్న తెలుగువే మెరుగు

"ఆంధ్రదేశానికి తెలుగు సినీమా పరిశ్రమను తరలించడం మాత్రం ప్రాయంగా సబబు, మంచిదీ అనిపించినా అందులో చాలా సాధక బాధకాలున్నాయి" అని సినీ నటులు శ్రీ ఎ. నాగేశ్వరరావు అన్నారు.

'చెంచులక్ష్మి' శతదినోత్సవ సందర్భంలో నాగేశ్వరరావు విజయనగరం వచ్చినప్పుడు ఇష్టాగోష్ఠి జరుపుతూ చిత్ర పరిశ్రమకు సంబంధించిన అనేక విషయాలపై తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

"ప్రస్తుతం ఆంధ్రదేశంలో చిత్ర నిర్మాణం సాగించడానికి గల ఇబ్బందు లేమిటి" అన్న ప్రశ్నకు జవాబు చెప్తూ "ప్రాంతీయాభిమానం దృష్ట్యా తెలుగు దేశంలో వెంటనే చిత్ర నిర్మాణం ప్రారంభించాలనే అభిప్రాయ పడుతూంటాను. కాని లక్షల వ్యయంతో చిత్ర నిర్మాణం సాగించవలసిన పరిస్థితుల్లో ప్రాంతీయాభిమానం అనేది ప్రాధాన్యం వహించడం అరుదు. ఎందుకంటే మద్రాసు, సినీమా పరిశ్రమకు పెద్ద కేంద్రంగా అభివృద్ధి పొందిఉన్నది. చిత్ర నిర్మాణానికి కావలసిన అనేక సదుపాయాలు మద్రాసులో లభిస్తాయి. అంతే కాకుండా ద్విభాషా చిత్రాల నిర్మాణం ఈనాడు పరిపాటి అయింది. వ్యాపారరీత్యా అది లాభసాటి. దీనికి మద్రాసు అనుకూలమైన కేంద్రం. ఆంధ్రదేశంలో చిత్రపరిశ్రమ పూర్తిగా అభివృద్ధిచెంది అన్ని సదుపాయాలూ లభించేందుకు కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు.

హైదరాబాదులో చిత్రపరిశ్రమ నెలకొల్పితే ద్విభాషా చిత్రాలకు—అంటే తెలుగు హిందీ భాషల్లో చిత్రనిర్మాణానికి ఎక్కువ సదుపాయాలు ఉంటాయని మీరు భావిస్తున్నారా?" అనే ప్రశ్నకు వారిలా సమాధానం ఇచ్చారు.

"హిందీ తెలుగు భాషల్లో చిత్రాలు నిర్మించడానికి హైదరాబాదునే కేంద్రం అవ వలసిన అవసరం లేదు. అందుకు మద్రాసు కూడా తగిన కేంద్రమే! నిజానికి మద్రాసులో నిర్మించిన హిందీ చిత్రాలు కొన్ని ఉత్తరదేశంలో నిర్మించిన చిత్రాలకన్న ఎక్కువ ప్రజాదరణను పొందాయన్న విషయం చాలా మందికి తెలిసిందే. ఇదే కాకుండా హైదరాబాదు స్వచ్ఛమైన హిందీకిగాని స్వచ్ఛమైన తెలుగుకుగాని కేంద్రం కాదని నా అభిప్రాయం. అక్కడ తెలుగు, హిందీ భాషలమీద ఉర్దూ ప్రభావం ఎక్కువ. అందుచేత హిందీచిత్ర నిర్మాణానికి హైదరాబాదుకంటె మద్రాసే అనుకూలమైన కేంద్రం అని భావిస్తాను. ఐతే తెలుగుదేశంలో మన చిత్రపరిశ్రమ లేకపోవడంవల్ల కొన్ని నష్టాలకు మనం లోనవుతున్నాం. ఇందులో ముఖ్యంగా పన్నుల విషయం. నటులూ, నిర్మాతలూ చెల్లించే ఆదాయపు పన్నులో కొంతిభాగం కేంద్రంవారు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తూంటారు. ఈ విధంగా తెలుగు సినిమాద్వారా వచ్చే ఆదాయం ప్రస్తుతం మద్రాసు ప్రభుత్వానికి లభిస్తోంది. ఆంధ్రదేశంలోనే నటులు చిత్రనిర్మాతలూ ఉన్నప్పుడు ఈ విధమైన ఆదాయం మన ప్రభుత్వానికి వచ్చే అవకాశం ఉంది."

మన చిత్రాల స్థాయి

"ఇంగ్లీషు చిత్రాలు చూచే అలవాటు గలవారు తెలుగు హిందీ చిత్రాలంటే చిన్న చూపు చూస్తూంటారు. దీనికి కారణం ఏమంటారు?" అన్న ప్రశ్నకు శ్రీ నాగేశ్వరరావు ఇలా సమాధాన మిచ్చారు.

"చాలా కాలం మన దేశం అస్వతంత్రంగా ఉండడంవలన మన చిత్రపరిశ్రమ తగినంతగా అభివృద్ధి చెందలేదు. అప్పటికే ఆంగ్ల చిత్ర పరిశ్రమ సుమారు పాతిక సంవత్సరాలు ముందడుగు వేసింది. నేడు మన పరిశ్రమ ఎంత అభివృద్ధి చెందినా ఈ సంవత్సరాల తేడా ఉండక తప్పదు. మనం పురోగమిస్తున్నాం. వారింకా ముందుకుపోతున్నారు. ఇదికాక ఆంగ్ల చిత్రాలు మనని ఎక్కువగా ఆకర్షించడంలో ఇంగ్లీషు ప్రభావంకూడా మనమీద ఉండడం కారణం. చాలా కాలం మనం బ్రిటిషువారి హయాముకు లోబడి వుండడంవల్ల పాశ్చాత్యుల సంప్రదాయాలూ నాగరికతా అంటే మనలో కొంతమందికి మోజు ఎక్కువ. ఇది కూడా కారణమే! వారు తీసే 'కొన్ని' చిత్రాలకు మనం నిర్మించే 'కొన్ని' చిత్రాలు ఏమీ తీసిపోవు" అన్నారు.

"దక్షిణాదిభాషల చిత్రాలకన్నా హిందీ చిత్రాల స్థాయి ఎక్కువగా ఉంటుందని మీరు భావిస్తారా" అనే ప్రశ్నకు ఇలా జవాబిచ్చారు.

"దక్షిణాది చిత్రాలకన్న హిందీచిత్రాలు ఎక్కువ స్థాయిలో ఉంటాయనేది అంగీకరించను. సాంకేతికరీత్యాగాని ఇతివృత్తాలలోగాని మరేవిషయంగాగాని హిందీచిత్రాలకన్న మన చిత్రాలే నయం. ఇక, హిందీ చిత్రాలలో మన సత్యాలను గొప్పగా చిత్రించిన కథలు బెంగాలీ సాహిత్యానికి చెందినవేకాని హిందీవారి సొంతకథలు కావు."

స్వీయచరిత్ర

"మీరిప్పటివరకూ నటించిన చిత్రాలలో మీ పాత్రకు ఎక్కువ సహాయకారిగా ఔచిత్యాన్ని చేకూర్చిన నటీమణి ఎవరో ఆమె పేరు చెప్పగలరా" అనే ప్రశ్నకు శ్రీ నాగేశ్వరరావు "ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఈయడంవలన చాలా అపార్థాలు వస్తాయి. పరిశ్రమలో ఇంకా ఉంటూ తోటివారిగురించి అభిప్రాయాలు వెలిబుచ్చడం వాంఛనీయం కాదు. అయితే ఆయావిషయాలపై నాకు అభిప్రాయాలు లేవనికాదు. చిత్రపరిశ్రమ నుంచి నేను విరమించుకొన్నాక స్వీయచరిత్ర వ్రాద్దామనే అభిప్రాయం ఉన్నది. చిత్రపరిశ్రమలో నా అనుభవాలూ మంచిచెడ్డలపై నా సొంత అభిప్రాయాలూ ఇంకా అనేక ముఖ్య విషయాలూ వ్రాస్తాను. అప్పుడు చిత్రపరిశ్రమలో ఉండను కనుక వ్రాయడానికి ఏ అభ్యంతరమూ ఉండదు" అన్నారు.

(56 వ పేజీ చూడండి).



సోవియట్ చిత్రం 'ఫార్టీఫస్ట్'లో ఒక సన్నివేశం.

గొడుగువంటి మనిషి

(21 వ పేజీ తరువాయి)

త్వరలోనే మిమ్మల్ని ఉపయోగించుకోవడం ప్రారంభిస్తాడు. దయచేసి ఇదంతా సాహసించి చెప్పినందుకు క్షమించండి."

లక్ష్మణరావుకు గొప్ప ఆశ్చర్యం కలగలేదు. "సరే మంచిది మీరు వెళ్ళండి" అని పూరుకొన్నా డప్పటికి. ఆతర్వాత ఆ మాటలనుగురించి చాలసేపు ఆలోచించాడు. రామదాసు కనిపిస్తే అడిగేసి తేల్చుకోవడం మంచిదనుకొన్నాడు. అలాంటి దురుద్దేశాలు లోపల వుంచుకొని తనతో అంత సఖ్యంగా ఎలా ప్రవర్తిసున్నాడు? ఒకవేళ అందులో, తప్పులేదేమో కూడాను? అతడి ఉద్యోగ ధర్మాన్ని అతడు నిర్వహించడంలో, తనతో స్నేహంచేసి మంచి చేసుకోవడంకూడా ఒక భాగం కావచ్చు...

మరునాడు సాయంకాలం రామదాసు ఇంటికివచ్చాడు. రామదాసును చూడగానే లక్ష్మణరావుకు నిగ్రహించుకోలేనంతఉద్రేకం వచ్చింది.

"రామదాసుగారూ మీ సంగతంతా తెలిసింది. మీరు నాప్రాణం తీసినాసరే నేను ఇన్స్యూర్ చేయదలచుకోలేదు. ఇదివరకు ఒకసారి మా ఆఫీసరు స్నేహితుడు ఏజెంటుగా వుండి, ఆఫీసరుగారు చెప్పే, ఆయన తృప్తికోసం చేశాను. తర్వాత ఆయనకు బదిలీ రాగానే కట్టడం మానేశాను అప్పటికింకా పాలసీరాకపోతే, ఆ కట్టిన ధరావతును తిరిగి తీసుకొన్నాను కూడాను. అర్థమైందనుకొంటాను మీకు. ప్రపంచంలో నేను ఎవరికైనా దగ్గర చేరుస్తాను గానీ మీలాంటివారికి మాత్రం పూర్తిగా దూరంగా వుండదలచాను. ఇదివరకు మీరు చేసిన సహాయానికి చాల కృతజ్ఞుణ్ణి......" ఇంకా ఏదో అంటున్నాడు.

రామదాసులో ఎలాంటి వికారమూ కలగలేదు. అతడి పెదవులమధ్య నిట్టూర్పుతో కూడిన చిరునవ్వు! ఒక్కమాట మాట్లాడకుండా తిరిగి వెళ్ళిపోయాడు. చాల నెమ్మదిగా నడిచి వెళ్ళిపోయాడు.

రెండురోజులు గడిచాయి. ఈలోగా "తను పొరబాటు చేశానేమో"నని అమితంగా బాధపడ సాగాడు లక్ష్మణరావు. అదిగాక అతనిభార్య శారద "మీరు చాల అనుచితంగా ప్రవర్తించార"ని స్పష్టంగా చెప్పింది.

'పెద్దగుమాస్తా రామస్వామి చెప్పింది రైటేనా...' అని ఆలోచించాడు. మరోకసారి అతణ్ణి అడిగి చూడాలనుకొన్నారు.

"ఏమండీ మీరు మొన్న రామదాసు గురించి చెప్పింది నిజమేనంటారా?" అని అడిగాడు.

"ఏరామదాసు గురించి సార్" అన్నాడు రామస్వామి.

"అదే మొన్న ఇన్స్యూరెన్సు ఏజెంటని ఇంకా ఏదో చెప్పి నన్ను స్నేహం చెయ్యొద్దని చెప్పారు చూడండీ..."

"రామదాసు కాదండీ నేను చెప్పింది! మీరు ఆమధ్య షికారు వెళ్తున్నారు చూడండీ 'వెంకటసుబ్బయ్య' అనే క్లబ్ మెంబరుతో ఆయనగురించి చెప్పాను" అన్నాడు రామస్వామి.

ఈసారి లక్ష్మణరావు నరాలుదారుణంగా అలసిపోయాయి. చప్పగా కుర్చీలో కూలబడిపోయాడు. కొన్ని నిముషాలు అలా పూరుకున్నాడు. తర్వాత—

"మీకు రామదాసుగురించి ఏమైనా తెలుసా!" అని అడిగాడు.

"తెలీకేం సార్ రామదాసు చాలా మంచివాడు. వాళ్ళనాన్నగారు ఇతణ్ణి పూర్తిగా వ్యాపారంలో దించేయాలని చూస్తున్నారు. కానీ ఇతడుమాత్రం మంచి స్నేహితుడంటూ దొరికితే చాలు, వాళ్ళను కంటికి రెప్పలాగ, ఎండలో గొడుగులాగ చూసుకొంటూ ఆ ఆనందంతో గడిపేస్తూ వుంటాడు. మనిషి మాత్రం చాల యోగ్యుడండీ! సందేహమేమీ లేదు" అన్నాడు రామస్వామి.

"సరె వెళ్ళిషాపని చూసుకోండి" అని రామస్వామిని పంపించేశాడు.

ఎట్లాఐనాసరే ఒక్కసారి రామదాసును చూడాలనుకొన్నాడు. మళ్ళీ విముఖంతో అతణ్ణి కలుసుకోవడమూ అనిపిస్తున్నా సరే... వెళ్ళి రామదాసును కలుసుకోటానికి తీర్మానించుకొన్నాడు కానీ ఇక రామదాసు తనను గౌరవించగలడా అసలు తనముఖం చూస్తాడా అనిపించింది తన తొందరపాటుకు అమితంగా పశ్చాత్తాపం కలిగింది. ఎట్లా అయినాసరే రామదాసును కలుసుకొని మళ్ళీ మామూలు స్నేహంలోకి వచ్చి అతణ్ణి తీసుకొనిగాని ఇంటికివెళ్ళరాదనుకొన్నాడు. ఇదంతా శారదకు తెలిస్తే తనను ఎంత దూషిసుందో......!

ఆఫీసువేళ పూర్తికాగానే బయులుదేరి రామదాసు ఇంటికేసినడక సాగించాడు. కొంతదూరం వెళ్ళేసరికి...ఎదురుగా రామదాసు అతనితో మరో మనిషి... వస్తున్నారు. అతను మామూలుగా నవ్వుతూ మాట్లాడుతూ వస్తున్నాడు. ఇతడు నాలాంటి మరో కొత్త స్నేహితుడు కాబోలనుకొన్నాడు లక్ష్మణరావు. అతడొక్షణంలో అమితంగా వ్యాకుల పడిపోయాడు.

'ఎట్లాపలకరించడం రామదాసును? ఏదో అకృతజ్ఞత నిగ్గు ఆవరిస్తున్నాయే' అనుకొంటూ నడుస్తున్నాడు.

"ఓ లక్ష్మణరావుగారు...ఏమిటి ఇలా వస్తున్నారు...వీరు లక్ష్మణరావుగారండి... వీరూ భీమసేన రావుగారని... ఇక్కడి ఫారెస్ట్ రేంజి ఆఫీసరుగా పనిచేస్తున్నారు. మొన్ననే ఇక్కడకువచ్చి జాయినయ్యారు. వారికి ఇంకా మంచి ఇల్లేదీ కుదరలేదు. అదే చూస్తున్నాము. ఈపనిలోనే అసలు మీదగ్గరకు రాలేకపోయాను. వదినగారు కులాసాగదా......"

"మూర్ఛపోతే బావుండును" అనుకొన్నాడు లక్ష్మణరావు. కానీ రామదాసు అనే గొడుగునీడలో వున్నంత వరకు ఏ మనిషికీ మూర్ఛరానే రాదు. రామదాసు గొడుగువంటి మనిషి! ★



భాస్కర్ ప్రొడక్షన్స్‌వారి 'పార్వతి కల్యాణం'లో రాగిణి, నల్లరామూర్తి, సీతారాం.

తెలుగు సినిమా

(54-వ పేజీ తరువాయి)

"హిందీ చిత్రాలలో నటించాలనే కుతూహలం మీకు ఉందా?" అనే ప్రశ్నకు శ్రీ నాగేశ్వరరావు ఇలా అన్నారు

"హిందీచిత్రాలలో నటించి దేశవ్యాప్తమైన కీర్తి గడించాలనే కుతూహలం ఉండడం సహజమే కదా! ప్రస్తుతం సువర్ణసుందరి, దొంగరాముడు హిందీచిత్రాలలో నేను నటిస్తున్నాను"

(సువర్ణసుందరి పూర్తి కావచ్చింది. 'దొంగరాముడు' నిర్మాణం అన్నపూర్ణ ఏ వి. ఎం. సంస్థలుకలసి నిర్వహించబోతున్నాయి)

"విదేశపర్యటన చేయాలనే ఉద్దేశం మీకు ఉన్నదా" అన్నప్రశ్నకు శ్రీ నాగేశ్వరరావు ఇలా సమాధానం ఇచ్చారు.

భూప్రదక్షిణం

"1960 లో ప్రపంచమంతా చుట్టి రావాలనే నిశ్చయం చేసుకున్నాను. అందుకోసమే ఆ సంవత్సరమంతా చిత్రాలలోకి ఒప్పుదలచుకోలేదు. ఈ పర్యటనకు 9 మాసాలు పడుతుందనీ, రూ 75 వేలు అవసరమనీ అంచనా వేసుకున్నాను."

ఈ పర్యటనలో తాము ఒక్కరే వెళ్లడానికి నిశ్చయించుకున్నానన్నారు.

"శతదినోత్సవాలకు నటీనటులు హాజరవడాన్ని గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అనే ప్రశ్నకు శ్రీ నాగేశ్వరరావు ఇలా అన్నారు.

"నిజానికి శతదినోత్సవాలకు హాజరయి ప్రేక్షకులు మామీద కురిపించే ప్రశంసాపరంపరలూ ఆదరాభిమానాలూ అందుకోవడంలో ఉన్న ఆనందమే మా కృషికి పరమావధి. ఈ కారణంగా శతదినోత్సవాలకు హాజరవుటకు నటీనటులంతా ఉత్సాహపడతారు. అయితే దీనివలన కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. నిర్ణయమైన కాల్ షీట్లను ఇలాంటి కార్యక్రమాలు పెట్టుకొని హాజరవలేకపోవడం వలన నిర్మాతలు ఎక్కువ నష్టాలకు లోనవడమే కాకుండా, నటీనటులమీద నిర్మాతలకు నమ్మకం కూడా పోతుంది." ★

—జి. ఎస్. మూర్తి.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S Radha Krishna at
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



పిలానిక

[ఫొటో : కె. శ్రీధర్ నాయుడు—హైదరాబాదు.]

Regd No. M. 4479 Andhra Patrika Illustrated Weekly.

